
ఒకటో యూనిట్

# 1. స్వతంత్రోత్సవం

కింది చిత్రం చూడండి.



© SCERT not to be republished


## ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- చిత్రం చూడండి. ఎవరెవరు ఉన్నారో చెప్పండి.
- చిత్రంలో ఉన్నవారి గురించి మీకు తెలిసింది చెప్పండి.
- మీకు తెలిసిన దేశభక్తి పాటను పాడండి.



### పిల్లలూ! ఇలా చేయండి.

- పాఠం చదవండి అర్థం కాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.



పవిత్ర భారత సవిత్రి కోహో
స్వతంత్రోత్సవం సాగింది
లాల్‌ఖిల్లాపై అశోక చక్రపు
త్రివర్ణ కేతన మెగిరింది ॥పవిత్ర॥

మతం తలపక గతం తడవక
ద్వేషం రోషం సకలం మరచి
స్వతంత్ర భారత జయ పతాకను
సోదరులారా! మ్రొక్కండి ॥పవిత్ర॥

నెత్తురు లోడ్చిన సత్తువలూడ్చిన
పిశాచదాస్యం నశించిందని
ప్రపంచమంతా ప్రతిధ్వనింపగ
స్వతంత్ర శంఖాలూదండి ॥పవిత్ర॥

పోరుల మ్రందిన కారల కుందిన
స్వతంత్రయోధుల స్మరించుకొంటూ
ముదశ్రు తర్పణ హృదంబుజార్పణ
సోదరులారా! చేయండి ॥పవిత్ర॥

అమోఘ శక్తుల సమీకరించుక
సమస్త భారత సమైక్య మెంచుక
హిమాద్రి మొదలు కుమారి వరకు
భారత విజయం పాడండి ॥పవిత్ర॥

– 'గౌతమీ కోకిల' వేదుల సత్యనారాయణశాస్త్రి

© SCERT Not to be republished

వందల సంవత్సరాలు బ్రిటిష్ వారి పాలనలో బానిసత్వంలో ఉన్న మనదేశానికి ఎందరో వీరుల త్యాగఫలంగా స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆనాటి రాత్రి అనగా **1947** ఆగస్టు **15**వ తేదీ రాత్రి **12** గంటలకు 'గౌతమీ కోకిల' బిరుదు కలిగిన శ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రి గారు స్వాతంత్ర్యోత్సవ సందర్భంగా 'భారత విజయాన్ని చాటండి' అని పాడిన గేయమిది.

**1.** పవిత్రమైన భారత మాతకు జయహో. స్వాతంత్ర్యం సిద్ధించిన సందర్భంగా దేశమంతటా సంబరాలు జరుగుతున్నాయి. ఢిల్లీలోని ఎర్రకోట పైన అశోక చక్రంతో ఉన్న మన మూడు రంగుల జెండా ఎగురవేశారు.

**2.** "ఓ సోదరులారా! గతాన్ని వదలిపెట్టండి. మతాలకు అతీతంగా ద్వేషాన్ని, రోషాన్ని మరవండి. స్వతంత్ర భారతదేశానికి చెందిన విజయ పతాకానికి మొక్కండి.

**3.** బ్రిటీష్‌వాళ్ళు మన నెత్తురు పీల్చి శక్తిహీనులుగా చేశారు. ఈ బ్రిటీష్ పిశాచాల నుంచి మనకు విముక్తి లభించిందని, బానిసత్వం తొలగిందని ప్రపంచమంతా చాటాలి. మన స్వాతంత్ర్య శంఖాన్ని పూరించాలి.

**4.** సోదరులారా! స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన, జైళ్లలో మగ్గిన వీరుల గురించి తలచుకోవాలి. వీరికి ఆనందంతో కూడిన కన్నీళ్లను (ఆనంద భాష్పాలను) మనస్ఫూర్తిగా అర్పించాలి.

**5.** మనకున్న అమోఘమైన శక్తులను సమీకరించుకోవాలి. హిమాలయాల నుంచి కన్యాకుమారి వరకు మన భారతీయులంతా ఐకమత్యంతో భారత విజయం గురించి పాడాలి.





© SCERT not to be republished

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



అ) గేయాన్ని రాగంతో పాడండి. అభినయం చేయండి.

ఆ) ఈ గేయానికి 'స్వతంత్రోత్సవం' అనే పేరు సరైందేనా? ఎందుకో చెప్పండి?

ఇ) కవి "భారత విజయం గురించి హిమాలయ పర్వతాలు మొదలుకొని, కన్యాకుమారి వరకు పాడండి" అని ఎందుకు చెప్పి ఉంటారు?

## II చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



అ) కింది వాక్యాలను చదవండి, గేయంలో ఎక్కడ ఉన్నయో గుర్తించండి. పాఠం ఆధారంగా వరుస క్రమంలో రాయండి.

సోదరులారా మ్రొక్కండి

మతం తలపక గతం తడవక

స్వతంత్ర భారత జయ పతాకను

ద్వేషం రోషం సకలం మరచి

ఆ) కింది వ్యాక్యాలను చదవండి. వాటికి సంబంధించిన గేయంలోని పాదాల కింద గీతగీయండి. రాయండి.



1. పవిత్రమైన భారతమాతకు జయహెూ!
2. స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన, జైళ్ళలో ఉన్న వీరులను తలచుకోవాలి.
3. ప్రపంచమంతా వినిపించేలాగా స్వాతంత్ర్య శంఖాలను ఊదాలి.
4. ఎర్రకోటపై అశోకచక్రంతో కూడిన మూడు రంగుల జెండా ఎగిరింది.

ఇ) పాఠం చదవండి. పాఠంలోని ప్రాసపదాలను గుర్తించండి.

ఉదా: పవిత్ర – సవిత్రి

ఈ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. స్వతంత్ర భారత పతాకానికి మనమెలా మొక్కాలి.
2. స్వతంత్ర శంఖాలను ఎందుకు ఊదాలి?

© SCERT not to be republished

3. భారత విజయం గురించి ఎక్కడ నుండి ఎక్కడ వరకు, ఎలా పాడాలి?

4. మనం ఆనందంతో కూడిన కన్నీళ్ళను ఎవరికి అర్పించాలి?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



అ) బ్రిటిష్ వారి పిశాచదాస్యం నశించిందని కవి ఎందుకన్నాడు?

ఆ) మనం స్వాతంత్ర్య యోధులను స్మరించాలని కవి అన్నాడు కదా! ఎందుకు?

ఇ) స్వతంత్ర్య భారత పతాకానికి ద్వేషం, రోషం అన్నీ మరచి మొక్కాలని కవి చెప్పాడు కదా! దీన్నిబట్టి మీకు ఏమి అర్థం అయ్యింది?

ఈ) ఈ గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

## IV పదజాలం



అ) **కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అర్థాలను రాయండి.**

1. భారత సవిత్రికి వందనం చేయాలి.
2. ఆగస్టు పదిహేనవ తేదిన దేశ వ్యాప్తంగా త్రివర్ణ కేతనం ఎగరవేస్తారు.
3. శత్రువులతో పోరాడడానికి అవసరమైన బలగాలను సమీకరించారు.
4. మనకు దేశానికి ఉత్తరాన ఉన్న హిమాద్రిలో గంగానది పుట్టింది.
5. కౌరవ పాండవుల పోరులో ఎందరో వీరులు చనిపోయారు.

ఆ) **కింది గళ్ళలో పాఠంలోని కొన్నిపదాలు ఉన్నాయి. వాటిని వెతకండి. వాటితో సొంతవాక్యాలు రాయండి.**



| | | | | | |
|---|---|---|---|---|---|
| ప | వి | త్ర | భా | ర | తం |
| స | జ | తం | స | హి | గ |
| వి | యం | స్వ | మై | మా | శం |
| త్రి | వ | ర్ణం | క్యం | ద్రి | ఖా |
| అ | మో | ఘ | శ | క్తు | లు |

______________________

______________________

______________________

______________________

______________________

______________________

______________________

© SCERT Not to be republished

ఇ) పాఠం చదవండి. కింది పట్టికలో సంబంధించిన పదాలు రాయండి.

| వర్ణమాల అక్షరాలతో మొదలయ్యే పదాలు | ా ఉన్న పదాలు | ం ఉన్న పదాలు | ీ ఉన్న పదాలు | ు ఉన్న పదాలు | ూ ఉన్న పదాలు |
|---|---|---|---|---|---|
| | | | | | |

## V సృజనాత్మకత



అ) పాఠం ఆధారంగా చిత్రం గీయండి. రంగులు వేయండి. చిత్రం గురించి రాయండి.

ఆ) మనదేశం గొప్పదనాన్ని తెలిపేలా నినాదాలు రాయండి.

## VI ప్రశంస



- మన దేశం కోసం ఎందరో మహావీరులు, గొప్పవాళ్ళు తమ జీవితాలను త్యాగం చేశారు కదా! వీరి గొప్పదనం వల్ల మనకు స్వాతంత్ర్యం సిద్ధించింది. వారి గొప్పదనాన్ని ప్రశంసిస్తూ ఒక పేరా రాయండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



అ) కింది తరగతుల్లో నామవాచకం, సర్వనామం, విశేషణం, క్రియలను గురించి నేర్చుకున్నారు కదా! కింది వాక్యాల్లో గీతగీసిన పదాలను గమనించండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

భగత్‌సింగ్ గొప్ప దేశభక్తుడు. అతడు ధైర్యంగా బ్రిటిష్‌వారిని ఎదిరించాడు. దేశం కోసం ప్రాణత్యాగం చేశాడు.

1. దేశభక్తుని పేరు ఏమిటి? పేర్లను తెలిపే పదాలను ఏమంటారు?
2. భగత్‌సింగ్ ఎటువంటి దేశభక్తుడు? గుణాన్ని తెలిపే ఈ భాషాభాగాన్ని ఏమంటారు?
3. 'అతడు' అనేది ఈ వాక్యంలో ఎవరికి బదులుగా వాడారు? అలాంటి పదాలను ఏమంటారు?
4. పై వాక్యాలలో క్రియాపదాలను గుర్తించి రాయండి.

©SCERT not to be republished

ఆ) గేయం చదవండి, పట్టికలోని అంశాలకు తగిన పదాలు రాయండి.

| నామవాచకాలు | విశేషణాలు | క్రియలు |
|---|---|---|
| | | |

ఇ) కింది సంభాషణను చదవండి. '. , !, ?' గుర్తులను సరైన చోట ఉంచి రాయండి.

రామయ్య : ఏం సూరయ్యా బాగున్నావా

సూరయ్య : ఆ బాగానే ఉన్నాను రామయ్యా

రామయ్య : అవును ఏం పనిమీద వచ్చావేమిటి

సూరయ్య : పండగ వస్తోంది కదా అందుకని కావాల్సిన సరకులు కూరగాయలు పూలు పండ్లు కొనడానికని వచ్చాను.

రామయ్య : నేనూ ఆ పనిపైనే వచ్చాను ఇద్దరం కలిసి వెళ్దాం పద

## ప్రాజెక్టు పని

అ) ఏదైనా ఒక దేశభక్తి గేయాన్ని/పాటను సేకరించండి. దానిని చార్టుపై రాసి ప్రదర్శించండి.

(లేదా)

అ) స్వాతంత్ర్యం కోసం పాటుపడిన గొప్పవారి చిత్రాలు సేకరించండి. ఒకరి గురించి రెండు, మూడు వాక్యాలు రాయండి. చదివి వినిపించండి.

## నేనివి చేయగలనా?

1. గేయాన్ని రాగంతో పాడగలను. అభినయం చేయగలను. ఔను/కాదు
2. పాఠాన్ని ధారాళంగా చదవగలను. ప్రశ్నలకు జవాబులు రాయగలను. ఔను/కాదు
3. గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలను. ఔను/కాదు
4. చిత్రంగీసి రంగులు వేసి దాని గురించి రాయగలను. ఔను/కాదు

భారతీయులుగా జీవించడం అలవరచుకోండి. స్వదేశీ భావనలు పెంచుకోండి.

\- సరోజినీ నాయుడు

చదువు
ఆనందించు

# తెలివైన జవాబు



అనగనగా ఒక రాజు. ఆ రాజు గారు అరవై ఏళ్ళ ఉత్సవంలో ఒక ప్రకటన చేశారు. "రాబోయే పున్నమి రోజు నేనొక ప్రశ్న వేస్తాను. దానికి జవాబు చెప్పిన వారికి వెయ్యి బంగారు కాసులు ఇస్తాను". ఇదీ రాజుగారి ప్రకటన.

పున్నమి రోజు రానే వచ్చింది. జనం తండోపతండాలుగా రాజధానికి చేరుకున్నారు. అందరూ రాజుగారు అడిగే ప్రశ్నల కోసం ఎదురు చూస్తున్నారు. రాజుగారు ఇలా చెప్పారు.

"మహారాణిగారికి గుత్తివంకాయకూర తినాలనిపించింది. వెంటనే వంటవాడిని పిలిపించింది. కూరలో మసాలా బాగా వెయ్యి. గుత్తివంకాయ కూర ఘుమఘుమలాడుతూ ఉండాలి అని చెప్పింది. వంటవాడు రంగంలోకి దిగాడు. సన్నెకల్లు మీద మసాలా నూరుతున్నాడు. కూర వండకముందే వాసన గుబాళించేస్తోంది.

వంటవాడి కూతురు ఉయ్యాలలో పడుకొని నిద్రలేచి ఏడుస్తోంది. పొయ్యి దగ్గర ఉన్న నీళ్ళ గంగాళం పట్టుకొని వంటవాడి కొడుకు ఆడుకొంటున్నాడు. ఆ నీళ్ళుపడి మంటలు ఆరుతున్నాయి. అది చూసిన వంటవాడికి ఎక్కడలేని కోపం వచ్చింది.


దీన్ని వంటవాడి భార్య చూసింది. "ఒరేయ్! నీకు పొయ్యిదగ్గర ఏం పనిరా? పొయ్యిలో పడ్డావంటే నీకు చావు మూడుతుంది". అని వాణ్ణి పట్టుకొని దూరంగా లాగింది.

ఎలాగైతేనేం గుత్తివంకాయ కూర తయారైంది. దాన్ని తిని ఆ రుచికి మహారాణి మహదానంద పడిపోయింది. సంతోషం పట్టలేక ఆమె వంటవాణ్ణి పిలిచింది. కొన్ని బంగారు కాసులు బహుమానంగా ఇచ్చింది." అని కథ చెప్పడం ముగించారు.

"కథ బాగా విన్నారుగా! రాణిగారు వంటవాడికి ఎన్ని బంగారు కాసులు ఇచ్చింది?

ఇదీ ప్రశ్న. సమాధానం కథలోనే ఉంది. ఎవరు జవాబు చెబుతారో చెప్పండి". అన్నాడు రాజు.

పండితులందరూ తలలు గోక్కున్నారు. జవాబును మాత్రం ఒక్కరైనా ఊహించలేకపోతున్నారు. 5వ తరగతి చదివే వెన్నెల కూడా కథను బాగా విన్నది. "రాజుగారూ! నేను జవాబు చెబుతాను" అంటూ పెద్దగా అరిచి చేతులూపింది. జవాబు చెప్పమన్నాడు మహారాజు. మహారాజా! రాణిగారిచ్చిన కాసులు "వెయ్యి నూట పదహారు"అంది వెన్నెల. "శభాష్! చిన్నదానివైనా సరిగా చెప్పావు". అని దగ్గరకు తీసుకున్నాడు మహారాజు. సింహాసనం మీద కూర్చోబెట్టుకున్నాడు.




"పాపా జవాబు ఎలా చెప్పగలిగావమ్మా?" అని వెన్నెలను అడిగాడు రాజుగారు. "జవాబు మీ కథలోనే ఉంది మహారాజా! మసాలా వెయ్యి 'వెయ్యి' ఉంది. నూరుతున్నాడులో 'నూరు' ఉంది. ఏడుస్తోందిలో 'ఏడు' ఉంది. ఆరుతున్నాయిలో 'ఆరు' ఉంది. మూడుతుందిలో 'మూడు' ఉంది. మొత్తం కలిపితే 'వెయ్యి నూటపదహారు' అని జవాబు చెప్పింది వెన్నెల. జనం చప్పట్లతో వెన్నెలను అభినందించారు. రాజుగారు ప్రకటించిన బహుమతి వెన్నెలకే దక్కింది.

© SCERT not to be republished

ఒకటో యూనిట్

# 2. సహవాసం

కింది చిత్రం చూడండి.



**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారు?
- పై చిత్రంతో పోల్చుకొని మీ ఇంట్లో వారి గురించి చెప్పండి.
- మంచివాళ్ళు ఉన్న ఇంట్లో అక్కడ కొన్ని రోజులు ఉంటే మనకు ఏం లాభం కలుగుతుంది?



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.


'ఆరు నెలలు సహవాసం చేస్తే వాళ్ళు వీళ్ళవుతారంట' "మా రాజేశ్, సౌజన్యలు చాలు ఇతణ్ణి దారిలో పెట్టడానికి. నువ్వేమి బెంగపెట్టుకోకు ఖచ్చితంగా మారతాడు". ఇలా ఎవరు అన్నారు? ఎందుకు అన్నారో పాఠం చదివి తెలుసుకోండి.

రంగాపురం గ్రామంలో పరంధామయ్య అనే మోతుబరి రైతు ఉండేవాడు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఊళ్ళో ఏ సమస్య వచ్చినా తన నేర్పుతో పరిష్కరించేవాడు. తోచిన సహాయం చేసేవాడు. ఊళ్ళోవాళ్ళకు ఆయన మాటంటే వేదం.

పరంధామయ్యది చాలా పెద్దకుటుంబం. ఇద్దరు కొడుకులు, కోడళ్ళు, మనమలు, మనమరాళ్ళతో ఇల్లు ఎప్పుడూ సందడిగా ఉండేది. పరంధామయ్య ఇంట్లోకి రాగానే తాతయ్యా! అంటూ అందరూ చుట్టూ చేరిపోతారు. పరంధామయ్య వాళ్ళతో రకరకాల కబుర్లు చెప్పేవారు. తొమ్మిదోతరగతి చదివే పెద్దమనవడు నరేశ్ చాలా మితభాషి. ఏదైనా అవసరంవస్తే తప్ప ఎవరితోనూ మాట్లాడడు. రెండో మనమడు రాజేశ్ మంచి మాటకారి. వసపిట్టలా వాగుతూనే ఉంటాడు. ఏడోతరగతి చదివే పెద్దమనమరాలు హరిత చాలా మంచి అమ్మాయి. రెండో మనమరాలు సౌజన్య ఐదోతరగతి చదువుతూంది. చాలా తెలివైనది, చురుకైంది కూడా. తరగతిలో అన్నింటా తానే ముందుంటుంది. అంతేకాదు ఆటల్లోనూ, పాటల్లోనూ, ఇతరులను పలకరించడంలోనూ అందెవేసిన చేయి. ఎప్పుడు, ఎక్కడ, ఎవరితో ఎలా మాట్లాడాలో తెలిసిన నేర్పరి.

మంచికి మారుపేరైన పరంధామయ్యగారి ఇంటికి ఎవరైనా వస్తే, సౌజన్య "నమస్కారమండి! రండి! కూర్చోండి. అని మర్యాదగా ఆహ్వానిస్తుంది. ఏం పనిమీద వచ్చారు? మంచినీళ్ళు తాగుతారా?" అని ఆప్యాయంగా పలకరిస్తుంది. అందరూ ఆ అమ్మాయిని చూసి అచ్చం తాత పరంధామయ్యగారి లాగే మాట్లాడుతున్నావమ్మా! ఏం పలకరింపు! ఏం మర్యాద! నిన్ను చూస్తే మీ తాతయ్యను చూసినట్టే ఉంటుంది" అనేవారు.

ఒకరోజు పొరుగూరి నుంచి రామయ్య అనే పెద్దమనిషి యాదయ్య అనే వ్యక్తిని వెంటబెట్టుకొని పరంధామయ్య ఇంటికి వచ్చాడు.



© SCERT not to be republished

పరంధామయ్య వాలు కుర్చీలో కూర్చొని పేపరు చదువుతూ, "రా.... రామయ్యా! బాగున్నావా? ఎవరితను?" అన్నాడు. "ఇతని పేరు యాదయ్య, నా దగ్గర బంధువు. ఒట్టి అమాయకుడు. 'నోట్లో నాలుకలేని' మనిషి. ఎవరేమి మాట్లాడినా 'బెల్లం కొట్టిన రాయిలా' ఉంటాడే తప్ప ఓ 'మాటామంతీ' ఉండదు. లౌక్యం అసలే తెలియదు. మీరే ఇతనికి ఓ దారి చూపిస్తారని తీసుకువచ్చాను" అన్నాడు రామయ్య.

"ఇదిగో రామయ్యా! యాదయ్యను కొంతకాలం మా ఇంట్లో ఉంచు. 'ఆరు నెలలు సహవాసం చేస్తే వాళ్ళు వీళ్ళవుతారంట' ! మా రాజేశ్, సౌజన్య చాలు ఇతన్ని దారిలో పెట్టడానికి. నువ్వేమీ బెంగపెట్టుకోకు. ఇతను ఖచ్చితంగా మారతాడు. నువ్వు నిశ్చింతగా వెళ్ళిరా!" అని రామయ్యకు భరోసా ఇచ్చాడు పరంధామయ్య. రామయ్య సంతోషంగా యాదయ్యను పరంధామయ్య ఇంట్లో వదలి వెళ్ళిపోయాడు. యాదయ్యను ఇంట్లో వాళ్ళందరికీ పరిచయం చేశాడు. అందరూ ఇతనితో కలివిడిగా ఉండాలని చెప్పాడు పరంధామయ్య.

ఆ రోజు నుంచి యాదయ్య పరంధామయ్య ఇంటిమనిషి అయిపోయాడు. సౌజన్య యాదయ్యతో చాలా చనువుగా ఉండేది. యాదయ్యకు కూడా సౌజన్య అంటే చాలా ఇష్టం. సౌజన్య, యాదయ్య అమాయకత్వం చూసి అతనికి అక్షరాలు నేర్పాలని అనుకుంది. సాయంత్రం బడినుంచి ఇంటికి రాగానే యాదయ్యను కూర్చోబెట్టుకొని రకరకాల కథలు చెప్పేది. పాటలు నేర్పేది. నిదానంగా అక్షరాలు కూడా నేర్పింది. ఇప్పుడు యాదయ్య చదవగలుగుతున్నాడు.

ఒకరోజున సౌజన్య యాదయ్యకు కుందేలు కథ చెప్పింది. ఆ కథలో కుందేలుకు దెబ్బతగలడం పిచ్చుక, కొంగ, పిల్లి సహాయం చేయడం గురించి విన్నాడు. ఎద్దు, చిలుక కట్టుకట్టడం, కాకి, కోతి పండ్లు ఇచ్చి ఎలా ఉందని పలకరించడం తెలుసుకొన్నాడు. కుందేలు వాటికి కృతజ్ఞతలు చెప్పడం ఇవన్నీ యాదయ్యను ప్రభావితం చేశాయి. ఇతరులను ఎలా పలకరించాలి? ఎవరైనా సహాయం చేస్తే వారికెలా కృతజ్ఞతలు చెప్పాలి? ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాడు. ప్రతిరోజూ సౌజన్య చెప్పే కథల ద్వారా యాదయ్యలో రోజురోజుకీ మార్పు వచ్చింది. యాదయ్యకు కూడా కథల పుస్తకాలు చదవడం అలవాటైంది. అలా మెల్లమెల్లగా పుస్తకాలతో పాటు, వార్తా పత్రికలు కూడా చదవడం మొదలుపెట్టాడు.



ఒకరోజు నరేశ్ ఇంట్లోకి వస్తూ, ఎటో చూస్తూ వస్తున్న యాదయ్యకు తగిలి కింద పడ్డాడు. ఏయ్! 'కళ్ళు నెత్తికెక్కాయా?' అంటూ నరేశ్ అరిచాడు. ఆ మాటలు యాదయ్యకు 'ముల్లులా గుచ్చుకున్నాయి'. అయినా యాదయ్య తనను తాను సంబాళించుకొని, "చూసుకోలేదు బాబూ! ఇక మీదట ఇలా జరగదు" అన్నాడు. ఇంతలో అక్కడికి వచ్చిన హరిత, "అరే! మనకన్నా పెద్దవాళ్ళతో ఇలాగేనా మాట్లాడేది? ముందు యాదయ్యకు క్షమాపణ చెప్పు" అంది.

©SCERT not to be republished

నరేశ్ పట్టించుకోకుండా అక్కడ నుండి వెళ్ళిపోయాడు. "ఏమీ అనుకోవద్దు యాదయ్యా! వాడు కొంచెం మొండివాడు. వాడి తరపున నేను క్షమాపణ చెబుతున్నాను" అంది హరిత. "లేదమ్మా! నాదే పొరపాటు, నేనే కొంచెం చూసుకొని నడవాల్సింది" అన్నాడు యాదయ్య.

ఇప్పుడు యాదయ్య మునుపటి యాదయ్య కాదు. ఇంట్లో ఉన్నప్పుడు పుస్తకాలు చదివేవాడు. పరంధామయ్య వెంట బయటకు వెళ్ళినప్పుడు పరంధామయ్య పలకరించే తీరు, ఇతరులు పరంధామయ్యతో మాట్లాడే విధానం గమనించేవాడు. ఇలా క్రమంగా తనను తాను దిద్దుకోసాగాడు. తనంతటతానుగా ఎన్నో విషయాలు తెలుసుకోగలిగాడు.


ఆ రోజు జూలై 8వ తేదీ. సౌజన్య పుట్టినరోజు. ముందురోజే యాదయ్యకు తన పుట్టినరోజు గురించి చెప్పింది. ఇల్లంతా అలంకరించారు. ఇంటికివచ్చే వారందరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నాడు యాదయ్య. పట్టుపరికిణితో ముద్దొస్తున్న సౌజన్యకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పి "ఇలాంటి పుట్టినరోజు పండుగలు మళ్ళీమళ్ళీ జరుపుకోవాలి" అని ఆశీర్వదించాడు పరంధామయ్య. సాయంత్రం సౌజన్య స్నేహితులందరూ ఆమెకు గ్రీటింగ్ కార్డులు, బహుమతులు ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. యాదయ్య ముందుగానే తయారుచేసి పెట్టుకున్న పూలగుత్తిని ఇచ్చి "జన్మదిన శుభాకాంక్షలు తల్లీ!" అన్నాడు. ఆ పూలగుత్తి చాలా అందంగా ఉంది. సౌజన్య ఆ పూలగుత్తిని చూసి ఎంతో మురిసిపోయింది. "ఇది ఎంతబాగుందో, ఎక్కడ కొని తెచ్చావు యాదయ్యా!" అని అడిగింది. "నాకు చదువు చెప్పి మాటలు నేర్పిన బంగారు తల్లికోసం నేనే చేశానమ్మా" అన్నాడు యాదయ్య. "నువ్వు పూలబొకేలు ఇంత బాగా తయారుచేస్తావా?" అంది సౌజన్య. "అవునమ్మా నాకు బాగా తెలిసిన విద్య ఇదే" అన్నాడు యాదయ్య. ఇంటికి వచ్చిన అందరినీ పలకరించడం, వారిని ఆహ్వానించడం గమనించిన పరంధామయ్యకు ఇక అతను ఎక్కడైనా బతకగలడు అని గట్టిగా నమ్మకం కుదిరింది.



ఒకరోజున పరంధామయ్య యాదయ్యను పిలిచి "నీకు పూలగుత్తులు చేయడం బాగా వచ్చు కదా! నీచేత మన ఊళ్ళోని పెద్దగుడి దగ్గర పూలదుకాణం పెట్టిద్దామనుకుంటున్నాను. ఏమంటావు?" అన్నాడు. యాదయ్య ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిపోయాడు. యాదయ్య పూల దుకాణం పెట్టాడు. రకరకాల పూలతో పూలమాలలు, బొకేలు తయారుచేస్తున్నాడు. ఎవరికి ఎలా కావాలంటే అలా తయారుచేసి ఇస్తున్నాడు. వినయంగా పలకరిస్తూ అందరినీ ఆకట్టుకొంటున్నాడు. కొనడానికి వచ్చే వారందరితో కలుపుగోలుగా మాట్లాడు తున్నాడు. అందరూ అతను పలకరించే తీరుకు ముగ్ధులవుతున్నారు. రోజురోజుకూ యాదయ్య పూలవ్యాపారం "మూడు పువ్వులు ఆరు కాయలుగా" అభివృద్ధి చెందుతూంది.

పరంధామయ్య యాదయ్య చేత పూల దుకాణం పెట్టించాడని తెలుసుకున్న రామయ్య యాదయ్యను చూడాలని తనవాళ్ళతో గుడికి వచ్చాడు. యాదయ్యను చూసి ఆశ్చర్య పోయాడు. "ఎలా ఉన్నావు యాదయ్యా?" అని అడిగాడు. "తమరి దయవల్ల, పరంధామయ్య గారి కుటుంబం వల్ల బాగున్నాను" అన్నాడు.

"ఇప్పుడు నాకు చాలామందితో పరిచయాలు ఏర్పడ్డాయి. మన ఊరివారందరూ నన్ను గౌరవంగా పలకరిస్తున్నారు" అని అన్నాడు యాదయ్య. "పెద్దాయన పరంధామయ్యగారి కుటుంబంవల్ల నీకు మేలు జరిగింది. ఆ ఇంట్లోని మంచిమనుషుల మధ్య ఉంటే ఎవరైనా బాగుపడతారు. అదే జరిగింది నీ విషయంలో" అన్నాడు రామయ్య.



## ఇవి చేయండి

### I వినడం, ఆలోచించి చెప్పడం



అ) పరంధామయ్య ఎలాంటి వాడు? ఆయనలాంటి వాళ్ళ గురించి తెలుసామీకు? వాళ్ళ గురించి చెప్పండి.

ఆ) సౌజన్య ఇంటికి వచ్చేవాళ్ళతో చక్కగా మాట్లాడింది కదా! మీరైతే మీ ఇంటికి వచ్చినవాళ్ళతో ఎలా మాట్లాడతారు?

ఇ) ఈ కథలో మీకు నచ్చిన సంఘటన ఏది? ఎందుకు?

ఈ) 'సహవాసం' కథను మీ సొంతమాటల్లో చెప్పండి.

### II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



అ) పాఠం చదవండి. పాఠంలోని సామెతలు, జాతీయాల కింద గీత గీయండి. వాటిని చదవండి.



ఆ) పాఠం ఆధారంగా ఎవరు ఎలాంటివారో పట్టికను పూరించండి.

| పేరు | ఎలాంటివారు (స్వభావం) |
|---|---|
| పరంధామయ్య | |
| నరేశ్ | |
| సౌజన్య | |
| యాదయ్య | |
| హరిత | |

ఇ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. యాదయ్య ఎవరు? అతణ్ణి పరంధామయ్య ఇంటికి రామయ్య ఎందుకు తీసుకువచ్చాడు?
2. పరంధామయ్య ఇంట్లో ఎవరెవరు ఉన్నారు? వాళ్ళు ఎలాంటి వాళ్ళు?
3. యాదయ్యతో ఎవరెవరు ఎలా ప్రవర్తించారు?
4. సౌజన్యని చూసి ఊరివాళ్ళు ఏమనుకునేవారు? ఎందుకు?
5. యాదయ్యలో మార్పు రావడానికి గల కారణాలు ఏమిటి?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



అ) "అందెవేసిన చేయి" అంటే అర్థం ఏమిటి? ఆ పదాన్ని ఏ ఏ సందర్భాలలో వాడతారు?

ఆ) యాదయ్య "బొకేలు చేయడం తనకు తెలిసిన విద్య" అని చెప్పాడు కదా! అంటే ఏమిటి? మీకు తెలిసిన విద్యలు ఏమేమి ఉన్నాయి?

ఇ) పరంధామయ్య కుటుంబంలో ఎవరెవరు ఎలాంటివారో తెలుసుకున్నారు కదా! మీ ఇంట్లో ఎవరెవరు ఉంటారు? వాళ్ళను పరంధామయ్య కుటుంబంతో పోల్చి రాయండి.

ఈ) "ఆరు నెలలు సావాసం చేస్తే వాళ్ళు వీళ్ళవుతారు" అనే వాక్యానికి అర్థం ఏమిటి?

ఉ) ఈ పాఠానికి సరిపడేలా ఉన్న సామెత ఏది? అది ఎందుకు తగినదో చెప్పండి. రాయండి.

ఊ) సౌజన్య గురించి సొంత మాటల్లో రాయండి.

© SCERT not to be republished

## IV పదజాలం



అ) ఎడమవైపు ఉన్న కింది వాక్యాలు చదవండి. వాటికి సంబంధించిన పదాలు కుడివైపున ఉన్నాయి జతపరచండి.

1. చెవులు కొరుక్కోవడం ( ) మాటకారి
2. మరీ ఎక్కువగా మాట్లాడేవారు ( ) వక్త
3. అనర్గళంగా మాట్లాడేవారు ( ) ఎగతాళి
4. తక్కువగా మాట్లాడేవారు ( ) వాగుడుకాయ
5. హేళన చేయడం ( ) గొప్పలు చెప్పుకోవడం
6. తన గురించి ఎక్కువ చేసి చెప్పుకోవడం ( ) చిలక పలుకులు
7. మాటలతో ఎదుటివారిని బోల్తా కొట్టించడం ( ) మితభాషి
8. ముద్దుముద్దు మాటలు ( ) గుసగుసలాడు

ఆ) పాఠం చదవండి. కింది గుణింతాలతో ఉన్న పదాలు వెతికి రాయండి. మీకు తెలిసిన మరికొన్ని పదాలు రాయండి.

| ు | ృ | ై | ొ | ో | ౌ |
|---|---|---|---|---|---|
| | | | | | |

ఆ) యాదయ్య సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయిపోయాడు కదా! ఇలా మనలో కలిగే భావనలను ఒక్కోదాన్ని ఒక్కో విధంగా వర్ణిస్తారు. కింది పదాలు చదవండి. సరైన వాటితో జతపరచండి. వాటితో వాక్యాలు రాయండి.



| | (అ) | (ఆ) | |
|---|---|---|---|
| 1. | కోపంతో | కుంగిపోవడం | కోపంతో ఊగి పోవడం |
| 2. | బాధతో | పొంగిపోవడం | ................................ |
| 3. | ఊహల్లో | గంతులేయడం | ................................ |
| 4. | ఆకలితో | ఉరకలేయడం | ................................ |
| 5. | ఉత్సాహంతో | విహరించడం | ................................ |
| 6. | ఆనందంతో | ఊగిపోవడం | ................................ |
| 7. | పొగడ్తలకు | అలమటించడం | ................................ |

## V సృజనాత్మకత



అ) సౌజన్య పుట్టిన రోజునాడు ఆమె మిత్రులు గ్రీటింగ్ కార్డులు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు కదా! పండుగ/ మీ మిత్రుల పుట్టినరోజు సందర్భంగా గ్రీటింగ్‌కార్డు తయారుచేయండి. వాళ్ళకు ఇవ్వండి. వాళ్ళేమన్నారో చెప్పండి?

© SCERT not to be republished

ఆ) మీ చుట్టుపక్కల దొరికే పూలతో బొకే తయారుచేసి మీ ఉపాధ్యాయులకు/పెద్దలకు/మిత్రులకు/పాఠశాలకు వచ్చిన అతిథులకు ఇవ్వండి.


## VI ప్రశంస



అ) మీ తరగతిలో ఇప్పటివరకు జన్మదినం జరుపుకోని మిత్రులను గుర్తించండి. వాళ్ళ జన్మదినాన్ని మీ తరగతిలో అందరూ కలిసి నిర్వహించండి.

ఆ) సౌజన్య చదువురాని యాదయ్యకు చదువు నేర్పింది కదా! మరి మీ చుట్టుపక్కల చదువురాని వాళ్ళుంటే వాళ్ళకు చదువు నేర్పండి. ఆ వివరాలను తరగతిలో చెప్పండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



**అ) కింది వాక్యాలను చదవండి. అవి ఏ కాలాన్ని తెలియజేస్తున్నాయో రాయండి.**

1. వహీదా, రజని కూరగాయలు కొన్నారు. ........................................
2. శ్రీనివాస్ పుస్తకం చదువుతూ ఉన్నాడు.................................
3. నిఖిల్, నితీశ్ క్రికెట్ పోటీలకు వెళతారు. ..................................
4. పిల్లి గిన్నెలోని పాలు తాగుతూ ఉంది. .........................................
5. అతడు కవిత్వం రాస్తూ ఉన్నాడు. ..........................................
6. జేమ్స్ గుర్రం మీద స్వారీ చేయాలనుకున్నాడు. ...............................

**ఆ) ఇంతవరకు మీరు నేర్చుకొన్న 1, 2, 3 పాఠాలు ఆధారంగా కింది పట్టికను పూరించండి. వాటితో వాక్యాలు రాయండి.**

| భూతకాల పదాలు | భవిష్యత్‌కాల పదాలు | వర్తమానకాల పదాలు |
|---|---|---|
| | | |

### ప్రాజెక్టు పని

పండుగ/నూతనసంవత్సరం/జన్మదినం/స్వాతంత్ర్యదినోత్సవం ఇలా వివిధ సందర్భాలకు తగిన గ్రీటింగ్ కార్డులను సేకరించండి. ఆయా సందర్భాలలో శుభాకాంక్షలు ఎలా తెలియజేస్తారో పట్టికను రాయండి. తరగతిలో ప్రదర్శించండి.

### నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | కథను సొంత మాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | పాఠంలో సామెతలు, జాతీయాలు గుర్తించగలను. ఎవరెవరు ఎలాంటి వారో రాయగలను. | ఔను/కాదు |
| 3. | వ్యక్తుల స్వభావాలను పోల్చి సొంత మాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | గ్రీటింగ్ కార్డులు తయారు చేసి శుభాకాంక్షలు తెలుపగలను. | ఔను/కాదు |

**అత్యున్నతమైన లక్ష్యాన్ని చేపట్టండి. దాన్ని సాధించేవరకు మీ జీవితాన్నంతా ధారపోయండి.**
**- స్వామి వివేకానందుడు**

© SCERT not to be republished

ఒకటవ
యూనిట్

# 3. త్రిలింగాలు

కింది చిత్రం చూడండి.




© SCERT not to be republished

## ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- చిత్రం చూడండి. చిత్రంలో ఏ ఏ ప్రదేశాలున్నాయి?
- చిత్రంలో మీకు తెలిసిన ప్రదేశాల గురించి చెప్పండి.
- చిత్రంలో మీకు నచ్చిన ప్రదేశం ఏది? ఎందుకు?



### పిల్లలూ! ఇలా చేయండి.

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

## శ్రీశైల క్షేత్రం



మనరాష్ట్రంలో ఎన్నో దర్శనీయ స్థలాలు ఉన్నాయి. వాటిలో శ్రీశైలం, దక్షారామం, కాళేశ్వరం అనేవి మూడు ప్రసిద్ధ శైవ క్షేత్రాలు. వీటిని త్రిలింగాలు అంటారు. ఈ మూడింటి మధ్య విస్తరించిన ప్రాంతాన్ని త్రిలింగ దేశమనికూడా అనేవారు. వీటి గురించి తెలుసుకుందాం.

త్రిలింగ క్షేత్రాలలో శ్రీశైలం ఒకటి. ఇది కర్నూలు జిల్లాలో ఉంది. ఈ క్షేత్రంలో భ్రమరాంబిక, మల్లికార్జునస్వామి కొలువై ఉన్నారు. శ్రీశైలం ఊరు ప్రారంభంలోనే సాక్షి గణపతి దేవాలయం ఉంది. సాక్షి గణపతిని దర్శించుకొన్న తరవాతనే మల్లికార్జున స్వామిని దర్శించుకోవడానికి వెళతారు.

శ్రీశైలం ప్రధాన ఆలయానికి తూర్పున త్రిపురాంతకం, దక్షిణాన సిద్ధవటం, పడమరన అలంపురం, ఉత్తరాన ఉమామహేశ్వరం అనే నాలుగు క్షేత్రాలు ముఖద్వారాలుగా ఉన్నాయి.

మల్లికార్జునస్వామికి ఎడమవైపున పార్వతీదేవి ఆలయం, వెనుక భ్రమరాంబ ఆలయం ఉన్నాయి. భ్రమరాంబ గుడి గోడకు ఒక చిన్న రంధ్రం ఉంది. అక్కడ చెవి ఉంచి వింటే భ్రమరనాదం వినిపిస్తుంది. భ్రమరాంబాదేవి ఆలయం అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటి.

ఈ క్షేత్రానికి దిగువగా రెండు కిలోమీటర్ల దూరంలో కృష్ణానది ప్రవహిస్తుంది. ఇక్కడ దీన్ని పాతాళగంగ అంటారు. దీనిపైన ఆనకట్ట నిర్మించారు. ఈ ప్రాజెక్టు ద్వారా విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేస్తున్నారు. పంటలకు నీరు అందిస్తున్నారు. ఈ క్షేత్రంలో ఫాలధార, పంచధార అనేవి ప్రవహిస్తుంటాయి.

శ్రీశైలంలో గిరిజన సంస్కృతిని తెలిపే ప్రదర్శనశాల ఒకటి ఏర్పాటు చేశారు. ఇందులో ఆదివాసుల చరిత్రను, సంస్కృతిని తెలిపే ప్రతిమలు ఉన్నాయి.

శ్రీశైలం ఆనకట్ట



© SCERT not to be republished

ఈ ఆలయంలో సంక్రాంతినాడు పార్వతీకళ్యాణం, శివరాత్రినాడు భ్రమరాంబ కళ్యాణం, లింగోద్భవం ఇక్కడ గొప్పగా జరుపుతారు. ఇక్కడి ప్రకృతి రమణీయత యాత్రికులకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.

త్రిలింగాలలో దక్షారామం రెండోది. ఇది తూర్పుగోదావరి జిల్లాలో ఉంది. ఇక్కడ భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ విలసిల్లుతున్నారు. దక్షప్రజాపతి ఇక్కడ యజ్ఞం చేశాడని చెప్తారు. అందుకే దీనికి "దక్షారామం" అని పేరు వచ్చిందని ప్రతీతి. దక్షారామం గురించి తెలుపుతూ శ్రీనాథుడు "భీమఖండం" అనే కావ్యం రచించాడు. దుష్యంతుడు, భరతుడు, నలుడు ఈ స్వామిని అర్చించారని ఆ కావ్యంలో ఉంది. దక్షారామాన్ని ఇప్పుడు కొందరు దాక్షారామమని, ద్రాక్షారామము అని కూడా అంటున్నారు.

భీమేశ్వరాలయం రెండు అంతస్థులతో ఉంటుంది. ఇక్కడి శివలింగం 15 అడుగుల ఎత్తు ఉంటుంది. ఇది పాలరాతి లింగం. ఈ లింగం సగభాగం నలుపు, సగభాగం తెలుపులో ఉంటుంది. శివుడు అర్ధనారీశ్వరుడు అనడానికి దీన్ని నిదర్శనంగా చెబుతారు. గుడిలో 400వరకు శాసనాలు ఉన్నాయి. గుడి ముందున్న చెరువును "సప్తగోదావరం" అంటారు.

కాశీక్షేత్రం వదిలిన తర్వాత వ్యాసుడు, అగస్త్యుడు అనే ఋషులు ఈ దక్షారామంలో తపస్సు చేశారని చెబుతారు. దక్షారామం పంచారామాలలో ఒకటి. గుంటూరు జిల్లా అమరావతిలోని అమరారామం, పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని భీమారం, ఆ జిల్లాలోనే పాలకొల్లులోని క్షీరారామం, తూర్పుగోదావరి జిల్లాలోని దక్షారామం, ఆ జిల్లాలోనే ఉన్న సామర్లకోటలోని కుమారారామం శివాలయాలను పంచారామాలు అంటారు.



దక్షారామం

© SCERT not to be republished


కాళేశ్వరంవద్ద త్రివేణి సంగమం

త్రిలింగాలలో మూడోది కాళేశ్వరం. కాళేశ్వరం కరీంనగర్ జిల్లాలో ఉంది. ఇది ప్రాణహిత, గోదావరి, సరస్వతి నదుల సంగమ స్థలంలో ఉన్న పవిత్ర క్షేత్రం. త్రిలింగాలలో ఒకటైన కాళేశ్వరాన్ని మన రాష్ట్రానికి ఒక సరిహద్దుగా భావిస్తున్నారు. గోదావరికి ఆవలి తీరంలో మహారాష్ట్ర ఉంది. ఆలయంలో ఒకే పానవట్టంపైన కాళేశ్వరలింగం, ముక్తీశ్వరలింగం ఉన్నాయి. ఈ రకంగా ఏ శివాలయంలోనూ లేదు. మొదట కాళేశ్వరుని, తర్వాత ముక్తీశ్వరుని పూజించాలి. ముక్తీశ్వరలింగంపై భాగంలో నాసికారంధ్రాలలాగ రెండు బిలాలు గోదావరిలో అనుసంధానమయి ఉన్నాయని చెబుతారు. ఈ ఆలయ శిల్పం పురాతనమైనదే గాక రమ్యమైనదికూడా. ఇక్కడ విజయగణపతి ఆలయం, వేంకటేశ్వర ఆలయం, సరస్వతీ ఆలయం, బిందుమాధవ ఆలయం, వీరభద్రేశ్వర ఆలయం మొదలైన ఆలయాలు ఉన్నాయి. దగ్గరలోని అడవిలో ఆదిముక్తీశ్వర ఆలయం ఉంది. గోదావరి ప్రాణహిత సంగమ స్థలానికి వెళ్లే దారిలో సంగమేశ్వర ఆలయం ఉంది. ఈ క్షేత్రం కాశీక్షేత్రాని కన్నా పవిత్రమైందని పురాణాలు చెప్తున్నాయి. కరీంనగర్ జిల్లాలోనే వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, మంథని వంటి పుణ్యక్షేత్రాలు కూడా ఉన్నాయి. కాళేశ్వరానికి కరీంనగర్ నుండి మంథని మీదుగా బస్సులో వెళ్ళాలి. ఇలాంటి అనేక క్షేత్రాలతో, వివిధ నగరాలతో విరాజిల్లుతున్నది ఈ తెలుగునేల. ఈ నేలలో అనేక మతాలవాళ్ళు ఉన్నారు. వాళ్ళు తమ భాషాసంస్కృతులను కాపాడుకుంటున్నారు. విభిన్న మతాల ఆచార వ్యవహారాలు ఇక్కడ ఉన్నాయి. ఈ తెలుగు నేలలోని ప్రజలు అందరూ అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉంటున్నారు.

© SCERT not to be republished

ఒకే పానవట్టంపై ఉన్న కాళేశ్వరుడు, ముక్తీశ్వరుడు.


కాళేశ్వర క్షేత్రం

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



అ) దక్షారామం, కాళేశ్వరం, శ్రీశైలం గురించి విన్నారు కదా! వీటిలో ఏదైనా ఒక క్షేత్రం గురించి మీ సొంతమాటల్లో చెప్పండి.

ఆ) మనరాష్ట్రంలో వీటిలాగా ఇంకా ఏ ఏ ప్రముఖమైన స్థలాలు, పుణ్యక్షేత్రాలు, దర్శనీయ స్థలాలు ఉన్నాయి? మీకు తెలిసినవాటిని గురించి చెప్పండి.

ఇ) కృష్ణానదిమీద నాగార్జునసాగర్, జూరాల, శ్రీశైలం వద్ద ఆనకట్టలు కట్టారు. అట్లాగే గోదావరిమీద శ్రీరాంసాగర్, ధవళేశ్వరం వద్ద ఆనకట్టలు కట్టారు కదా! వీటివల్ల లాభమా? నష్టమా? ఎందుకు? చర్చించండి.


## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



అ) పాఠం చదవండి. పాఠం ఆధారంగా కింది పట్టికలో శ్రీశైలం, దక్షారామం, కాళేశ్వరం వివరాలు నమోదు చేయండి.

| స్థలం | నదిపేరు | దేవాలయంపేరు | చూడదగిన అంశాలు |
|---|---|---|---|
| శ్రీశైలం | | | |
| దక్షారామం | | | |
| కాళేశ్వరం | | | |

ఆ) ప్రణతి రోజూ తన దినచర్య పుస్తకంలో ఆ రోజు తానేం చేసిందో రాస్తుంది. ఒకరోజున తన డైరీలో ఏం రాసిందో చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.



తేదీ: 12.7.2013

మేము పాఠశాల నుండి 12.7.2013వ తేదీ ఉదయం 9 గంటలకు బస్సులో బయలుదేరాం. 10 గంIIలకు 'నెహ్రూ జూలాజికల్ పార్కు'కు చేరుకున్నాం. విజయాటీచర్ వెళ్లి టిక్కెట్లు తీసుకువచ్చారు. అందరం జంతుప్రదర్శనశాల(జూ) లోపలికి వెళ్ళాం. అబ్బో! జూ ఎంత పెద్దగా ఉందో! పెద్ద పెద్ద చెట్లతో అడవిలాగే ఉంది. రంగురంగుల పక్షులను, కోతులను చూశాం. తరవాత సింహాలు, పులులు, ఖడ్గమృగాలు, నీటి ఏనుగులు, తాబేళ్ళను చూశాం. తిరిగి రైలెక్కి జూ అంతా తిరిగాం. జయ, లత, మాధవి, రమ, రాము, మాధవ్ ఇలా అందరితో కలిసి వెళ్లడం, అన్నీ చూడడం చాలా బాగా అనిపించింది. అయితే అడవిలో ఉండాల్సిన జంతువులను అలా బోనుల్లో బంధించి ఉంచడం బాధ కలిగించింది. స్వేచ్ఛగా ఉండాల్సిన ఆ జంతువులన్నీ తిరిగి ఎప్పుడు బయటపడతాయో!



© SCERT not to be republished



1. ప్రణతి తన డైరీలో ఏం రాసింది?
2. 'జూ' ఎలా ఉందని రాసింది?
3. 'జూ'లో ఏమేమి చూసింది?
4. 'జూ'ను చూసిన తరవాత ఆ జంతువుల గురించి ప్రణతి ఏమనుకుంటోంది?

**ఇ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. త్రిలింగాలు అని వేటిని అంటారు? అవి ఎక్కడ ఉన్నాయి?
2. శ్రీశైలం గిరిజన ప్రదర్శనశాలలో ఏమేమి ఉన్నాయి?
3. శ్రీనాథుడు "భీమఖండం"లో దక్షారామం గురించి ఏమని చెప్పాడు? రాయండి.
4. పంచారామాలు అని వేటిని అంటారు? ఇవి ఎక్కడ ఉన్నాయి?
5. కరీంనగర్ జిల్లాలో ఇంకా ఏ ఏ ముఖ్య క్షేత్రాలు ఉన్నాయి?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



అ) 'శ్రీశైలం' గొప్పదనాన్ని వివరిస్తూ ఒక పేరా రాయండి.

ఆ) 'కాళేశ్వరం' ప్రత్యేకతలను తెల్పండి.

ఇ) "దక్షారామం చూడదగిన ప్రదేశం" ఎందుకో వివరించండి.

ఈ) మీరు చూసిన ఏదైనా ఒక ప్రాంతం విశేషాలను తెల్పండి.

## IV పదజాలం



**అ) ఒక హల్లుకు అదే హల్లు చేరితే వాటిని ద్విత్వాక్షరాలు అంటారని తెలుసుకదా. పాఠంలోని ద్విత్వాక్షర పదాలు రాయండి. మీకు తెలిసిన మరికొన్ని ద్విత్వాక్షర పదాలు కూడా రాయండి.**

ఉదా: జిల్లా, ఉత్తరం ............ ..............................

**ఆ) తెలుగునేలపై ప్రవహిస్తున్న నదులు కింది గళ్ళలో ఉన్నాయి. వాటిని వెతికి రాయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| వం | శ | ధా | ర | హం | ద్రీ |
| ప్రా | ష్ణ | పె | జీ | మూ | తుం |
| ణ | కృ | న్నా | మం | సీ | గ |
| హి | గో | దా | వ | రి | భ |
| త | గౌ | త | మి | వే | ద్ర |
| నా | గా | వ | ళి | కా | య |

**ఉదా:** గోదావరి

..............................

..............................

..............................

..............................

..............................

© SCERT not to be republished

అ) కింది ఏవైనా రెండేసి పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

ఆహ్లాదం, రమణీయం, సంస్కృతి, గోదావరి, క్షేత్రాలు, విస్తరించు, పండుగ, ప్రవహించు, దర్శించు, ప్రకృతి.

**ఉదా:** శివక్షేత్రాలు తెలుగునేల అంతటా విస్తరించి ఉన్నాయి.

## V సృజనాత్మకత



అ) కింది గేయాన్ని పొడిగించి రాయండి.

తెలుగెంతో హాయి హాయి
మధురంగా ఉండునోయి
తెలుగుతల్లి బిడ్డలుగా
పుట్టడమే భాగ్యమోయి
త్రిలింగాల మననేల
...........................
...........................
...........................




ఆ) మీరు నిన్నటి రోజున ఏమేం చేశారో దినచర్య రూపంలో రాయండి.

## VI ప్రశంస



- వివిధ ప్రాంతాలు లేదా దర్శనీయ స్థలాలకు ఎందుకు వెళ్ళాలి? ఇలా వెళ్ళడానికి ఏ ఏ జాగ్రత్తలు తీసుకోవాలి?

## VII భాషను గురించి తెలుసుకుందాం



అ) కింది వాక్యాలను విడదీసి రెండు వాక్యాలుగా రాయండి.

**ఉదా:** వ్యాసుడు కాశీనగరానికి వచ్చి, తపస్సు చేశాడు.

వ్యాసుడు కాశీనగరానికి వచ్చాడు. వ్యాసుడు తపస్సు చేశాడు.

1. మాధవ్ మైదానానికి వెళ్ళి, ఖో,ఖో ఆట ఆడాడు.
2. ప్రకాశ్ బడికి వచ్చి, గోడమీద వార్తలు రాశాడు.
3. మామయ్య రాగిజావ తాగి, పేపర్ చదివాడు.



© SCERT not to be republished

4. నిఖిల్ కథల పుస్తకం చదివి, కథను చెల్లెలికి చెప్పాడు.

5. పిల్లలు బొమ్మలు గీసి, రంగులు వేశారు.

**ఆ) కింది రెండు వాక్యాలను కలిపి ఒకే వాక్యంగా రాయండి.**

**ఉదా:** యాదయ్య పూలు తెచ్చాడు. యాదయ్య పూలగుత్తులు తయారుచేశాడు.

యాదయ్య పూలుతెచ్చి, పూలగుత్తులు తయారుచేశాడు.

1. చాందిని పాటలు పాడింది. చాందిని బహుమతులు గెల్చుకుంది.
2. భాస్కర్ సంచి తీసుకొన్నాడు. భాస్కర్ రైతుబజారు కెళ్ళాడు.
3. రజని బట్టల దుకాణానికి వెళ్ళింది. రజనీ పాపకోసం బట్టలు కొన్నది.
4. రహీం రైల్వేస్టేషన్‌కు వెళ్ళాడు. రహీం రైలు ఎక్కాడు.
5. కుందేలు క్యారెట్ తిన్నది. కుందేలు పొదలోకి వెళ్ళింది.

## ప్రాజెక్టు పని

మనరాష్ట్రంలోని లేదా మీ జిల్లాలోని వివిధ దర్శనీయ స్థలాల చిత్రాలు, లేదా వివరాలు సేకరించండి. వాటి గురించి చార్టుపై రాసి ప్రదర్శించండి. వాటి గురించి చెప్పండి. (జట్టుపని)


## నేనివి చేయగలనా?

1. త్రిలింగ క్షేత్రాల గురించి సొంత మాటల్లో చెప్పగలను. కారణాలతో నా వాదనను వినిపించగలను. ఔను/కాదు
2. పాఠాన్ని చదివి ప్రాంతాల వివరాలను పట్టికలో రాయగలను. ఔను/కాదు
3. త్రిలింగ క్షేత్రాలు, నేను చూసిన ప్రాంతం గురించి సొంత మాటల్లో రాయగలను. ఔను/కాదు
4. గేయాన్ని పొడిగించి రాయగలను. ఔను/కాదు

**అన్నింటికంటే సత్యం గొప్పది. అంతకంటే గొప్పది సత్యమార్గంలో నడవడం.**

**- గురునానక్**

© SCERT not to be republished




# 4. మాతోట




## ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- చిత్రం చూడండి. చిత్రంలో ఏమేమి ఉన్నాయి?
- పై చిత్రంలో మీకు ఇష్టమైన పువ్వు ఏది? ఎందుకు?
- ఈ పువ్వులన్నీ మీరు ఎక్కడెక్కడ చూస్తారో చెప్పండి? అక్కడికి వెళితే మీరేంచేస్తారు?


### పిల్లలూ! ఇలా చేయండి.



- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.



ఈ తోట మా తోట
ఇంపుల మూట
ప్రీతిరసముల ఊట
ప్రియముల బాట
చిన్ని మొక్కలు మాకు
చిన్ని తమ్ముళ్ళు
చిన్ని తీవలు మాకు
చిన్ని చెల్లెళ్ళు
నిజమైన ప్రేమతో
నీళ్ళు పోస్తాము
గాటంపు ప్రీతితో
కలుపు తీస్తాము
ఇరవైన కరుణతో
ఎరువు వేస్తాము
శ్రద్ధగా దిన దినం
వృద్ధి చేస్తాము
చిగురు వేసిననాడు
చిటి విందు మాకు
మొగ్గ తొడిగిననాడు
మురిపెంబు మాకు
కలకల లాడిన
కలుగు వేడుక మాకు
మిలమిల మెరసిన
మోదమ్ము మాకు
చిగురాకు తెంపము
చెలిమితో మేము
ఎవరు గిల్లిన గాని
ఎవరు తెంపిన గాని
మము కొట్టినట్లుండు
మనసులో మాకు
మా చిన్ని మొక్కలు
మము చేర బిల్చు



మము జూచి పుష్పాలు
మందహాసము చేయు
గంధోళుల్ సల్లి
కలకల నవ్వు
రంగు రంగుల పూల
హోరంగుల ముందు
వన్నె చిన్నెలు చిమ్ము
సీతాకోక చిలుకల
కడు పాత్రమున వచ్చి
మిడుకు తుమ్మెదల
పిలిచి పూ దేనియ
బిచ్చంబు వేయు
పయనమ్ము సాగించు
బాటసారులను
నిలిపి తమ్మొకసారి
తిలకింప చేయు
తమదు రూపమ్ముల
తమ సువాసనల
కను వీనులకు విందు
కలిగించి పంపు
మా తోట చెంతకు
మానక వచ్చి
ఉబ్బి గానమ్ము చే
యును కోకిలమ్మ
ఆకుపచ్చని చీర
అందమ్ము తోడ
చిలకమ్మ జిలిబిలి
పల్కు లొల్కించు
అందాల మా తోట
నందనారామమ్ము
సుందరమ్ములకు మె
చ్ఛందనమ్ములకు

**మూలం: గుజ్జెనగూళ్ళు**

**–అవధాని రమేశ్, కడప**

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం




అ) గేయాన్ని రాగయుక్తంగా పాడండి.

ఆ) "మా తోట" గేయాన్ని ఎవరు చెబుతున్నారు? "మా తోట" పేరు విన్నప్పుడు మీకు ఎలా అన్పించింది?

ఇ) మొక్కలు బాగా ఎదగాలంటే ఏమి చేయాలి?

ఈ) "తోట కనులకు, చెవులకు విందు కలిగిస్తున్నది" అని విన్నారు కదా! దీన్ని సమర్థిస్తూ మాట్లాడండి

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



**అ) గేయం ఆధారంగా కింది పదాలు జతపరచి రాయండి.**

| | | |
|---|---|---|
| నిజమైన ప్రేమతో | – | కలుపు తీస్తాము |
| ఇరవైన కరుణతో | – | మురిపెంబు మాకు |
| మొగ్గ తొడిగిననాడు | – | నీళ్ళు పోస్తాము |
| గాటంపు ప్రీతితో | – | ఎరువు వేస్తాము |
| శ్రద్ధగా దిన దినం | – | చిటి విందు మాకు |
| చిగురు వేసిననాడు | – | వృద్ధి చేస్తాము. |



**ఆ) కింది వాక్యాలకు సంబంధించిన గేయపాదాలను రాయండి.**

1. తోటమీది ప్రేమతో మేం చిగురాకును కూడా విరువం.
2. తోట కళకళలాడుతూ ఉంటే మాకు వేడుకగా ఉంటుంది.
3. కనులకు, చెవులకు విందు కలిగించి పంపుతుంది.
4. సంతోషంతో కోకిలమ్మ పాట పాడుతుంది.
5. పువ్వులు మమ్మల్ని చూసి నవ్వుతున్నాయి.

**ఇ) గేయం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. పిల్లలు తోటను ఎలా వృద్ధి చేస్తామని చెబుతున్నారు?
2. తోట రోజు రోజుకూ వృద్ధి చెందుతుంటే ఎలా ఉంటుందని గేయంలో చెప్పారు?
3. తోటను పాడుచేస్తే ఎలా ఉంటుందని గేయంలో చెప్పారు?
4. తోటలోని పూల గురించి ఏమని తెలియజేశారు?
5. తోట అందం ఎలా ఉంది?

© SCERT Not to be republished

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



అ) మీరు నాటిన పూలమొక్కలు పెరిగి పూలు పూస్తుంటే మీకు ఎలా ఉంటుందో రాయండి.

ఆ) తోట అందాలు ఎలా విందుచేస్తున్నాయో రాయండి.

ఇ) "చిన్ని మొక్కలు మాకు చిన్ని తమ్ముళ్ళు", చిన్ని తీవెలు మాకు చిన్ని చెల్లెళ్ళు" అని పిల్లలు అంటున్నారు కదా! ఇలా ఎందుకంటున్నారు?

ఈ) చెట్లకు "నిజమైన ప్రేమతో నీళ్ళుపోస్తాము" అని పిల్లలు చెప్పారు కదా! మీరు నాటిన మొక్క పెరిగి పెద్దగా ఎదగాలంటే నిజమైన ప్రేమతో మీరైతే ఏం చేస్తారు?

ఉ) గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

## IV పదజాలం



అ) పాఠంలోని "్మ, ్ట, ్ల" ఒత్తున్న పదాలు రాయండి. అట్లే మరికొన్ని "్మ, ్ట, ్ల" ఒత్తుల పదాలు రాయండి.

ఆ) పాఠంలో కలకల, మిలమిల ............... వంటి పదాలు ఉన్నాయి కదా! ఇలాంటివే మరికొన్ని పదాలు రాయండి. వాటితో వాక్యాలు రాయండి.

ఇ) పాఠంలో "రంగు రంగుల పూలు" అవి చదివారు కదా! "రంగు" అనే పదం తర్వాత మళ్ళీ అదే పదం వచ్చింది కదా! ఇలాంటి మరికొన్ని జంటపదాలు రాయండి. వాటితో వాక్యాలు రాయండి.

ఉదా: గోలగోలగా, మెల్లమెల్లగా................................

## V సృజనాత్మకత



అ) పాఠంలోని పిల్లల తోట ఎలా ఉంటుందో తెలుసుకొన్నారు కదా? మరి మీరు పెంచే తోట ఎలా ఉంటుందో ఊహించండి. మీ తోట చిత్రాన్ని గీయండి. మీ తోట గురించి చిన్న కవిత/ గేయం రాయండి.

## VI ప్రశంస



అ) పిల్లలకు తోట అంటే ఎంత ఇష్టమో తెలుసుకున్నారు కదా! రహీం ఒకసారి రేష్మా వాళ్ళింటికి వెళ్ళాడు. రేష్మ వాళ్ళింట్లో అందమైన పూలమొక్కలు చూశాడు. పూల సువాసనలతో ఆ ప్రాంతం అంతా నిండిపోయింది. ఆ పూలమొక్కలు ఎవరు పెంచారని అడిగాడు. తానే పెంచానని చెప్పింది. రహీం ఇంటికి వచ్చాడు. వెంటనే రేష్మా గురించి, వాళ్ళింట్లోని పూలతోట గురించి ప్రశంసిస్తూ వాళ్ళ అక్కయ్యకు చెప్పాడు. రహీం ఏం మాట్లాడి ఉంటాడు ? చెప్పండి.

© SCERT not to be republished

## VII భాషను గురించి తెలుసుకుందాం



అ) **కింది వాక్యాలు చదవండి. గీతగీసిన పదాలను గమనించండి.**

శివ కథల పుస్తకం చదివాడు.

శివ కథల పుస్తకం చదువుతూ ఉన్నాడు.

శివ కథల పుస్తకం చదువుతాడు.

పై వాక్యాలలో మొదటిదాంట్లో 'చదివాడు' అనే పదం జరిగిపోయిన పనిని సూచించే క్రియాపదం.

'చదువుతూ ఉన్నాడు' అనే పదం జరుగుతూ ఉన్న పనిని సూచించే క్రియాపదం.

'చదువుతాడు' అనే పదం జరగబోయే పనిని సూచించే క్రియాపదం.

అంటే వాక్యాలలో కాలాలను బట్టి 'క్రియలు' మారుతూ ఉంటాయి.

అ) **2, 3వ పాఠాలలోని క్రియా పదాలను గుర్తించండి. అవి ఏ కాలానికి చెందిన క్రియాపదాలో రాయండి.**

© SCERT not to be republished

### ప్రాజెక్టు పని

మొక్కల గురించి, చెట్లగురించి రాసిన కవితలు/గేయాలు/పాటలు/ పద్యాలు/చిత్రాలను సేకరించండి. వాటి గురించి వివరించండి.

### నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | గేయాన్ని రాగయుక్తంగా పాడగలను. సమర్థిస్తూ మాట్లాడగలను. | ఔను/కాదు |
| 2. | గేయాన్ని ధారాళంగా చదవగలను. ప్రాసపదాలను, భావానికి సంబంధించిన పాదాలను గేయంలో గుర్తించగలను . | ఔను/కాదు |
| 3. | గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | తోట అందాలను గురించి కవిత/గేయం రాయగలను. | ఔను/కాదు |

**వినయంలేని విద్య, వాసనలేని పువ్వు రెండూ విలువ తక్కువైనవే.**



# శిబి చక్రవర్తి

శిబి గొప్ప చక్రవర్తి. ఆపదలో ఉన్న వారికి సాయం చేయడంలో ఆయనకు ఆయనే సాటి. శిబి చక్రవర్తి ఔదార్యాన్ని, దానశీలతను ప్రజలందరూ ప్రశంసిస్తున్నారు. ఈ వార్త ఇంద్రుని వరకూ వెళ్ళింది. ఆయన శిబి చక్రవర్తి ఔదార్యాన్ని పరీక్షిద్దామనుకున్నాడు.

ఒకరోజు యజ్ఞవేదిక మీద కూర్చుని ఉన్నాడు శిబి చక్రవర్తి. ఆయన ఒడిలో ఒక పావురం వచ్చి వాలింది. అది భయంతో కలవరపడుతోంది. "మహారాజా! రక్షించు! నన్ను ఒక డేగ వెంటాడుతున్నది. నన్ను చంపితినాలని చూస్తోంది. దాని బారి నుండి నన్ను కాపాడండి!" అని దీనంగా మానవ భాషలో వేడుకుంది.

శిబి చక్రవర్తి పావురాన్ని ప్రేమగా నిమురుతూ "నిన్ను కాపాడే బాధ్యత నాది. నీకు ఎవరి నుంచీ ప్రమాదం రాదు" అని హామీ ఇచ్చాడు. పావురం మనసు కుదుటపడింది. అంతలో అక్కడికి డేగ రానే వచ్చింది. రాజుగారి ఎదురుగా ఎత్తయిన చోట వాలింది. అది కూడా మానవ భాషలో "మహారాజా! ఈ పావురం నా ఆహారం. తప్పించుకొని వచ్చి మిమ్మల్ని చేరింది. దయతో దాన్ని నాకు వదిలి పెట్టండి" అంది. రాజు గారికి సభలో వున్న వారందరికి ఈ రెండూ మనుషుల్లా మాట్లాడడం ఆశ్చర్యం కలిగించింది.



నేను కాపాడుతానని ఈ పావురానికి మాట ఇచ్చాను. ఆడిన మాట తప్పను. అయినా నీకు మాత్రం అంత పట్టుదల ఎందుకు? దీన్ని వదిలి మరో ఆహారం వెతుక్కో" అన్నాడు శిబిచక్రవర్తి.

"రాజా! నీవు ధర్మం తెలిసినవాడవు. న్యాయంగా ఆలోచించు. నేను ఆకలితో నకనకలాడుతున్నాను. ఈ పావురం దొరికినట్లే దొరికి తప్పించుకొని పారిపోయి నీ దగ్గరకు వచ్చింది. నా నోటి ముందరి ఆహారం తీసివేయడం ధర్మం కాదు. ఇప్పుడు ఈ ఆహారం లేకపోతే నేను ఆకలి బాధతో మరణిస్తాను. అది నీకు ధర్మమా?" అంది డేగ.

డేగ మాటలకు రాజుతో సహా సభలోని వారంతా ఆశ్చర్యపోయారు.

© SCERT not to be republished



శిబిచక్రవర్తి ఆశ్చర్యం నుండి తేరుకుంటూ, "ఓ శౌన్య రాజమా? శరణన్న వారిని రక్షించడం రాజధర్మం. నీ ఆకలిబాధ తీరడానికి ఏ ఆహారం కావాలో చెప్పు. నువ్వు కోరిన ఆహారం నీకు ఇస్తాను. ఈ పావురాన్ని మాత్రం వదలిపెట్టు అన్నాడు.

"నేను కోరిన ఏ ఆహారమైనా ఇస్తారా?" అని గట్టిగా అడిగింది డేగ. ఎటువంటి సంకోచం లేకుండా అడుగు. తప్పక ఇస్తాను! అన్నాడు శిబిచక్రవర్తి". అలాగైతే రాజా! నీ శరీరంలో ఈ పావురం బరువుకు సమానమైన మాంసాన్ని కోసి నాకివ్వు అంది డేగ.

శిబి చక్రవర్తి నవ్వుతూ "అలాగే! నీకు కావాల్సింది నా మాంసమేకదా!" అని అప్పటి కప్పుడు ఒక కత్తి, త్రాసు తెప్పించాడు. సభలోని వారందరూ నిశ్చేష్టులయ్యారు.

శిబి చక్రవర్తి పదునైన కత్తితో తన శరీరం నుంచి మాంసాన్ని కోసి త్రాసులో వేశాడు. పావురం బరువుకు సరికాలేదు. మరికొంత మాంసం కోసివేశాడు. ఉహు! అప్పుడూ సరిపోలేదు. మరికొంత జోడించాడు. ప్రయోజనం లేకపోయింది. అది చూడలేక సభలోని వారంతా కళ్ళు మూసుకున్నారు.

మరికొంత వేశాడు. అయినా పావురం బరువుతో సరితూగలేదు. రాజు గారి శరీరం రక్తం ఓడుతుంది. చివరికి తానే వెళ్ళి త్రాసు పళ్లెంలో కూర్చున్నాడు. తనను తానే డేగకు ఆహారంగా సమర్పించుకున్నాడు.

అప్పుడు ఇంద్రుడు, అగ్నిదేవుడు ప్రత్యక్షమయ్యారు. "రాజా! నీ దానగుణం నిరుపమానమైనది. నీ వంటి ఉత్తముడు ఇంతవరకు ఈ భూమ్మీద పుట్టలేదు. నీ ఔదార్యాన్ని పరీక్షించడానికి నేను డేగగా, అగ్నిదేవుడు పావురంగా వచ్చాం. నీ కీర్తి చిరస్థాయిగా నిలిచిపోతుంది" అని ఆశీర్వదించాడు ఇంద్రుడు. శిబిచక్రవర్తికి మళ్ళీ మునుపటి రూపం వచ్చింది. శిబి చక్రవర్తి వారికి కృతజ్ఞతలు తెలియజేశాడు. అప్పటికీ ఇప్పటికీ దానం విషయంలో శిబి చక్రవర్తికి సాటి వచ్చేవారులేరు.

© SCERT not to be republished

రెండో యూనిట్

# 5. గోపి డప్పు కథ

కింది చిత్రం చూడండి.



© not to be republished

**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రంలో ఏమేమి అమ్ముతున్నారు? వాటిలో మీకు తెల్సినవి ఏవి?
- చిత్రంలోని బాలుడు దుకాణాదారుతో ఏం మాట్లాడుతున్నాడు?
- బాలుడికి ఇష్టమైన వస్తువు ఏమై ఉండవచ్చు?



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

**పేదలకు, నిస్సహాయులకు సహాయం చేయడం వల్లనే కర్రచక్రం నాకు ఇష్టమైన డప్పుగా మారింది. ఇలా ఎవరు అనుకున్నారు? ఎందుకు? కథ చదివి తెలుసుకోండి.**



సుల్తానాబాద్ గ్రామంలో గోపి అనే పిల్లవాడుండేవాడు. అతను వాళ్ళ నాయనమ్మతో పాటు ఉండేవాడు. గోపి వాళ్ళ నాయనమ్మ ఎంతో కష్టపడి బతుకు వెళ్ళదీసేది.

ఒకరోజు నాయనమ్మ గోపితో "బాబూ నేను కట్టెలు అమ్మడానికి సంతకు వెళుతున్నాను. వచ్చేటప్పుడు నీకేమైనా తీసుకురానా" అంది.

గోపి నాయనమ్మతో ... నాకేమీ వద్దుగానీ బజారులో డప్పు దొరికితే తీసుకురావా? డప్పు వాయించడమంటే నాకు చాలా ఇష్టం, దానితో ఆడుకుంటాను అన్నాడు. నాయనమ్మ 'సరే' అంది.

సంతలో కట్టెలు అమ్మాక నాయనమ్మ ఒక బొమ్మల దుకాణంలోకి వెళ్ళి "బాబూ! ఈ డప్పు ధర ఎంత?" అని అడిగింది. "ఇరవై రెండు రూపాయలు" అన్నాడు దుకాణదారు. కాని నాయనమ్మ దగ్గర పదిహేను రూపాయలే ఉన్నాయి. "అయ్యో! మనవడి కోసం డప్పు కూడా కొనలేకపోయానే" అనుకుంటూ ఇంటికి బయల్దేరింది నిరాశగా.

దారిలో ఆమెకు ఒక గుండ్రని కర్రచక్రం కనిపించింది. "పోనీ దీన్నైనా తీసుకెళతాను నా మనవడు ఆడుకుంటాడు" అని ఆ చక్రాన్ని సంచీలో వేసుకుని ఇంటికి తీసుకెళ్ళింది.

గోపి పరుగెత్తుకొచ్చి నాయనమ్మను చుట్టేసాడు. 'నాయనమ్మా డప్పు తెచ్చావా?' అని అడిగాడు. "డప్పు మరెప్పుడైనా తెస్తాను... ఈ చక్రంతో ఆడుకో" అని కర్రచక్రాన్ని తీసి గోపికి ఇచ్చింది. గోపి ఏమీ మాట్లాడకుండా కర్రచక్రాన్ని తీసుకుని దాన్ని దొర్లించుకుంటూ ఊరిలో తిరుగసాగాడు. అతడికా కర్రచక్రం బాగా నచ్చింది.

కర్రచక్రంతో ఆడుకుంటూ వెళుతుంటే గోపీకి ఒకచోట ఒక ముసలమ్మ పొయ్యి ముందర కూర్చుని ఏడవడం కనిపించింది. ఆమె దగ్గరగా వెళ్ళి 'అవ్వా ఎందుకేడుస్తున్నావ్?' అని అడిగాడు. "బాగా ఆకలిగా ఉంది. ఇంట్లో పిండి ఉంది గానీ పొయ్యి వెలిగించడానికి కట్టెలు లేవు. రొట్టెలు ఎలా చేసుకోవాలో తెలియడంలేదు అంది దీనంగా.



©SCERT not to be republished

"అవ్వా! ఏడవకు. నా దగ్గర కర్రచక్రం ఉంది. దీంతో పొయ్యి వెలిగించుకొని రొట్టెలు చేసుకొని నీ ఆకలి తీర్చుకో" అని కర్రచక్రాన్ని ఆమెకు ఇచ్చాడు.



ముసలమ్మ గోపి జాలి గుణానికి సంతోషించింది. ఆ కర్రతో పొయ్యివెలిగించి, రొట్టెలు చేసుకుంది. "బాబూ! నువ్వెంతో మంచివాడివి. నా ఆకలి తీర్చావు. నీకివ్వడానికి నా దగ్గర ఏమీ లేదు. ఇదిగో ఈ రొట్టె తీసుకో. ఆకలేసినప్పుడు తిను" అని ఒక రొట్టె ఇచ్చింది.

రొట్టెను కాగితంలో చుట్టుకుని ముందుకెళ్ళాడు గోపి. కొంతదూరం వెళ్ళగానే కుండలు చేసే కనకయ్య కూతురు సరిత వాళ్ళమ్మ ఒడిలో కూచుని ఏడుస్తూ కనిపించింది. "పిన్నీ! మీ అమ్మాయి ఎందుకేడుస్తోంది"? అని అడిగాడు గోపి.


"ఆకలితో ఏడుస్తోంది. వీళ్ళ నాన్న పట్నం వెళ్ళాడు రేపు వస్తాడు. నేనేం చేయను"? అంది బాధగా.

గోపీకి కూడా ఎంతో బాధ కలిగింది. "పిన్నీ! ఈ రొట్టెను తీసుకో" అని తన చేతిలోని రొట్టెను ఆమెకిచ్చాడు. పాప ఆకలి తీరి నవ్వసాగింది.

"బాబూ! ... నువ్వు ఎంతో మంచివాడివి. నా బిడ్డ ఆకలి తీర్చావు నీకివ్వడానికి నా దగ్గర ఈ మట్టిపాత్ర తప్ప ఏమీ లేదు" అని గోపికి మట్టిపాత్ర ఇచ్చింది.

గోపి మట్టి పాత్రను తీసుకుని కొంతదూరం వెళ్ళాక బట్టలు ఉతికే రాజయ్య కనిపించాడు. అతడు తన కొడుకును మందలిస్తున్నాడు. దాంతో అతని కొడుకు ఏడుస్తున్నాడు.

"బాబాయ్! ...ఈ బాబు ఎందుకు ఏడుస్తున్నాడు"? అని అడిగాడు గోపి.



"వీడు పొద్దున్నే నా మట్టిపాత్ర పగలగొట్టాడు. అందులోనే బట్టలు ఉడికించి ఉతకాలి. ఇప్పుడు మట్టిపాత్ర ఎక్కడినుండి తేవాలి? బోలెడు బట్టలున్నాయి. వాటిని ఉతికితేనే డబ్బులొస్తాయి" అని అన్నాడు రాజయ్య.

"బాబాయ్! అతణ్ణి ఏమీ అనకు. ఇదిగో ఈ మట్టిపాత్ర తీసుకో" అని మట్టిపాత్ర ఇచ్చేశాడు. దాంతో రాజయ్య "బాబూ! ... నువ్వెంతో మంచివాడివి" అని చెప్పి మట్టిపాత్రకు బదులుగా లోపలి నుండి ఒక పాత కంబళి తెచ్చి గోపీకిచ్చాడు.

గోపి కంబళి భుజాన వేసుకుని నది దగ్గరకు వెళ్ళాడు.


© SCERT not to be republished

అక్కడ ఒక వ్యక్తి ఒంటిమీద సరైన గుడ్డలు లేకుండా చలికి గజగజ వణుకుతూ నిలబడి ఉన్నాడు. అతని పక్కనే ఒక గుర్రం ఉంది.

గోపి పరుగెత్తుకెళ్ళి కంబళిని అతనికిచ్చి కప్పుకోమన్నాడు. ఆ వ్యక్తి కంబళి కప్పుకొని అందులో ముడుచుకుపోయాడు. అతని చలి తగ్గింది.

"అయ్యా! మీరెవరు? ఎందుకిలా ఉన్నారు?" అని అడిగాడు గోపి.

దానికతను "నేనొక వ్యాపారిని. పట్నంలో వ్యాపారం చూసుకుని వస్తుంటే దొంగలు దాడిచేసి నా డబ్బు, నగలతో పాటు ఒంటిమీద బట్టలు కూడా దోచుకుపోయారు. సమయానికి నా గుర్రం దూరంగా మేత మేస్తోంది. లేకపోతే దాన్ని కూడా తీసుకెళ్ళేవారు. చలితో వణుకుతున్న నాకు కంబళి ఇచ్చి ప్రాణం కాపాడావు. నీకివ్వడానికి నా దగ్గర ఈ



గుర్రం తప్ప మరేమీ లేదు" అని గుర్రాన్ని గోపికి ఇచ్చేశాడు. గోపి గుర్రం కళ్ళేన్ని చేత్తో పట్టుకుని అలా నడుచుకుంటూ పట్నంలోకి ప్రవేశించాడు.

పట్నంలో అతనికో ఊరేగింపు కనిపించింది. కాని ఆ ఊరేగింపు ముందుకు కదలడం లేదు. అందరూ నిశ్శబ్దంగా నిలబడి ఉన్నారు. అది చాలా పెద్ద ఊరేగింపు. అందరూ ఖరీదైన దుస్తులు, నగలు ధరించి ఉన్నారు. బ్యాండు మేళం వాళ్ళంతా ఒకేరకమైన తెల్లని, ఎర్రని దుస్తులలో చూడముచ్చటగా ఉన్నారు. వాళ్ళ చేతుల్లో సన్నాయి, డోలు, డప్పు ఇలా రకరకాల వాద్యాలు ఉన్నాయి.



గోపికి ఊరేగింపు ఎందుకు నిశ్శబ్దంగా ఉందో అర్థం కాలేదు. గుర్రాన్ని చెట్టుకు కట్టేసి ఊరేగింపు వద్దకు వెళ్ళాడు. ఊరేగింపు ముందర పెళ్ళికొడుకు, అతని తండ్రి దీనంగా నిలబడి ఉన్నారు.

“ఏమయింది? ఊరేగింపు ఎందుకు ఆగిపోయింది”? అని అడిగాడు గోపి.

“ఏమని చెప్పను బాబూ. నేను ఈ ఊరిలో పెద్ద షావుకారును. ఈరోజు నా ఏకైక కుమారుని పెళ్ళి. ముహూర్త సమయం దాటిపోతోంది గానీ మేము మాట్లాడుకున్న గుర్రం ఇంకా రాలేదు. మరో గుర్రం అందుబాటులో లేదు. ముహూర్తం దాటిపోతూంది. పైగా నాకిది చాలా అవమానకరం” అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

“అయ్యో తాతా! ... దీనికే మీరింత బాధపడాలా? నా దగ్గర గుర్రం ఉంది. దాన్ని తీసుకుని ఊరేగింపు ప్రారంభించండి” అని గుర్రాన్ని తీసుకువచ్చి ఇచ్చాడు.

ఊరేగింపు మొదలైంది. పెళ్ళి అంగరంగవైభవంగా జరిగింది.

“నాయనా! నువ్వు చాలా మంచివాడివి. నేనీ ఊరిలో ధనవంతుడైన షావుకారును. నీ గుర్రానికి ఎన్ని రూపాయలు కావాలో అడుగు” అన్నాడు షావుకారు.

గోపి నిర్మలమైన మనసుతో “తాతా! నాకు డబ్బులు వద్దు. ఒకవేళ ఇవ్వదలచుకుంటే ఆ బ్యాండుమేళంలోని డప్పు ఇప్పించండి. డప్పంటే నాకు చాలా ఇష్టం” అన్నాడు గోపి.

షావుకారు ఎంతో సంతోషించి ఆ డప్పును దాంతోపాటే డబ్బునూ ఇచ్చాడు. డబ్బు సంచీని భుజాన వేలాడేసుకుని, డప్పు కొట్టుకుంటూ ఇంటికి బయల్దేరాడు గోపి.

“ఇంటినుండి బయలుదేరేటప్పుడు నా దగ్గర ఒక కర్రచక్రం ఉంది. కానీ పేదలకు, అవసరాల్లో ఉన్నవారికి సహాయం చేయడం వల్లనే కర్రచక్రం నాకు ఇష్టమైన డప్పుగా మారింది” అని అనుకున్నాడు.





© SCERT not to be republished

# ఇవి చేయండి

## I  వినడం, ఆలోచించి చెప్పడం



అ) గోపి డప్పు కథను మీ సొంతమాటల్లో చెప్పండి.

ఆ) "పేదలకు, అవసరాల్లో ఉన్నవారికి సహాయం చేయడం వల్లనే కర్రచక్రం నాకిష్టమైన డప్పుగా మారిపోయింది" అని గోపి అనుకున్నాడు కదా! గోపి అలా ఎందుకు అనుకున్నాడో చెప్పండి.

ఇ) మీరు చూసిన ఏదైనా పెళ్ళి ఊరేగింపు గురించి వర్ణించి చెప్పండి.

ఈ) ఈ కథలో గోపి కాకుండా మీకు నచ్చిన మరో వ్యక్తి ఎవరు? ఎందుకు నచ్చారో చెప్పండి.

## II  ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



అ) పాఠం చదవండి. పాఠం ఆధారంగా గోపి ఎవరెవరికి, ఏమేమి ఇచ్చాడు? ఏమేమి తీసుకున్నాడో రాయండి.

| ఏమిచ్చాడు? | ఎవరికి ఇచ్చాడు? | ఏం తీసుకున్నాడు? |
|---|---|---|
| | | |

ఆ) పాఠం చదివి కింది వాక్యాలు ఎవరు ఎవరితో అన్నారో రాయండి.

1. "బాబూ! ఈ డప్పు ధర ఎంత?"
2. "వీళ్ళ నాన్న పట్నం వెళ్ళాడు. రేపు వస్తాడు".
3. "ఊరేగింపు ఎందుకు ఆగిపోయింది?"
4. "పేదలకు, అవసరాల్లో ఉన్నవారికి సహాయం చేయడం వల్లనే కర్రచక్రం డప్పుగా మారిపోయింది"



ఇ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. గోపి నాయనమ్మను ఏమని అడిగాడు?
2. నాయనమ్మ డప్పు ఎందుకు కొనలేకపోయింది?
3. గోపి ముసలమ్మకు కర్రచక్రాన్ని ఎందుకు ఇచ్చాడు?
4. రొట్టెకు బదులుగా మట్టిపాత్ర ఇస్తూ సరిత వాళ్ల అమ్మ గోపితో ఏమన్నది?
5. గోపికి గుర్రాన్ని ఎవరు, ఎందుకు ఇచ్చారు?
6. గోపి చూసినప్పుడు ఊరేగింపు ఎలా ఉంది?
8. షావుకారు గోపికి ఏం ఇచ్చాడు?

© SCERT not to be republished

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



1. గోపిని అందరూ మంచివాడని పొగిడారు కదా! మరి మిమ్మల్ని మంచివాళ్ళని ఇతరులు అనాలంటే మీలో ఏ ఏ మంచిగుణాలు ఉండాలి?

2. గోపి తన ఇంటికి వెళ్ళిన తరవాత తనకు ఎదురైన సంఘటనలను నానమ్మతో ఏమని చెప్పిఉంటాడో ఊహించి రాయండి.

3. గోపికి ఐదు సంఘటనలు ఎదురయ్యాయి కదా! అందులో మీకు బాగా నచ్చిన సంఘటన ఏది? ఎందుకు నచ్చిందో సొంతమాటల్లో రాయండి.

4. గోపి గురించి ఐదువాక్యాలు రాయండి.

## IV పదజాలం



అ) ఒక హల్లుకు వేరే హల్లు ఒత్తుగా చేరితే వాటిని 'సంయుక్తాక్షరాలు' అంటారు కదా! పాఠంలోని సంయుక్తాక్షర పదాలను రాయండి. మీకు తెలిసిన మరికొన్ని సంయుక్తాక్షర పదాలు కూడా రాయండి.

**ఉదా:** ఆంధ్రప్రదేశ్, కష్టపడి ..................... .....................

ఆ) పాఠంలో 'మట్టిపాత్ర' 'కర్రచక్రం' అనే పదాలున్నాయి కదా! వాటిలో రెండేసి పదాలు ఉన్నాయి. రెండో పదం వస్తువు అయితే, మొదటిపదం ఆ వస్తువు దేనితో తయారైందో చెబుతుంది. అలాంటి పదాలు రాయండి.

**ఉదా:** గుడ్డసంచీ

ఇ) కింది వాక్యాలలో గీతగీసిన పదాల స్థానంలో అదే అర్థాన్నిచ్చే మరో పదాన్ని చేర్చి వాక్యాన్ని తిరిగి రాయండి.

**ఉదా:** పొయ్యి <u>వెలిగించడానికి</u> కట్టెలు లేవు: పొయ్యి <u>మండించడానికి</u> కట్టెలు లేవు.

1) నా బిడ్డ <u>ఆకలి</u> తీర్చావు. : ..............................................

2) పాత <u>కంబళి</u> గోపికి ఇచ్చాడు. : ..............................................

3) ఒంటి మీద <u>బట్టలు</u> కూడా దోచుకుపోయారు. : ..............................................

4) గుర్రాన్ని <u>చెట్టుకు</u> కట్టేసి వెళ్ళారు. : ..............................................

5) డప్పు <u>కొట్టుకుంటూ</u> ఇంటికి బయలుదేరాడు. : ..............................................

© SCERT not to be republished

## V సృజనాత్మకత



అ) గోపికి, షావుకారుకు మధ్య జరిగిన సంఘటనను సంభాషణల రూపంలో రాయండి.


ఆ) పాలిథిన్ కవర్/ గట్టి కాగితాలు /ప్లాస్టిక్ డబ్బా వంటి వాటిని తీసుకోవాలి. వాటిని కుండ మూతకు కట్టి /అతికించి సొంతంగా డప్పు తయారు చేయండి. దీన్ని వాయిస్తూ పాట పాడండి.

## VI ప్రశంస



అ) గోపి తన దగ్గర ఉన్న కర్రచక్రం, మట్టిపాత్ర, రొట్టె, కంబళి ఇలా అన్నింటిని అవసరమైనవారికి ఇచ్చేశాడు కదా! ఇలా మీరు కూడా అవసరం పడిన వారికి మీ దగ్గర ఉన్నవి ఏమేం ఇస్తారు?

## VII భాషను గురించి తెలుసుకుందాం



**అ) కింది అసమాపక, సమాపక క్రియా పదాలను ఉపయోగించి వాక్యాలు రాయండి. అవి ఏ కాలానికి చెందిన క్రియాపదాల్లో రాయండి.**

1. వచ్చి, చేసింది
2. తిని, చూస్తుంది
3. చదివి, రాస్తూ ఉన్నాడు
4. రుబ్బి, చేశారు
5. తెచ్చి, వండుతారు

**ఉదా:** పాపవచ్చి, భోజనం చేసింది (భూతకాలం క్రియాపదం)

పాపవచ్చి, భోజనం చేస్తూ ఉంది (వర్తమానకాలం క్రియాపదం)

పాపవచ్చి భోజనం చేస్తుంది (భవిష్యత్‌కాలం క్రియాపదం)

### ప్రాజెక్టు పని

రకరకాల సంగీత వాద్యాల చిత్రాలను సేకరించండి. మీకు నచ్చిన ఒక వాద్యపరికరం గురించి వివరాలు రాయండి. తరగతి గదిలో ప్రదర్శించండి.

### నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | గోపిడప్పు కథను సొంత మాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | పాఠంలో ఎవరు ఎవరితో ఏమన్నారో గుర్తించగలను. పాఠంలోని ముఖ్యమైన సంఘటనలను గుర్తించగలను. | ఔను/కాదు |
| 3. | గోపి గురించి సొంతమాటల్లో రాయగలను. కథను ఊహించి పొడిగించగలను. | ఔను/కాదు |
| 4. | సంఘటనకు సంభాషణలు రాయగలను. డప్పు తయారు చేసి పాటపాడగలను. | ఔను/కాదు |

విద్య, స్వాభిమానం, శీలం ఈ మూడూ నా ఆరాధ్యదేవతలు.

- డా॥ బి.ఆర్. అంబేద్కర్

రెండో యూనిట్

# 6. అన్నం

కింది చిత్రం చూడండి.



© SCERT not to be republished

**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారు?
- చిత్రంలో ఆహార పదార్థాలు వృథాగా పడేస్తున్నారు కదా! ఎందుకు చేస్తున్నారు?
- ఆహారాన్ని ఎందుకు వృథా చేయకూడదు?



**పిల్లలూ! ఇలా చేయండి.**


- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

**నేను తింటుండగా కిందపడ్డ కొన్ని మెతుకులు కనిపించాయి. అవి ఎంతో విలువైనవిగా అనిపించాయి. ఇలా ఎవరు అన్నారు? ఎందుకు? పాఠం చదివి తెలుసుకోండి.**

“అమ్మా .... ఈ రోజు అన్నం తినను” అన్నాను అమ్మతో. అమ్మ చిన్నగా నవ్వింది. ఏమీ మాట్లాడలేదు. మళ్ళీ చెప్పాను. “ఎందుకట?” అంది అమ్మ. “ఈరోజు శనివారం .... నువ్వు ఉపవాసం ఉంటావుగా. రోజంతా తినకుండా ఉంటావు. మరి నేనూ ఉంటాను” అన్నాను. “వద్దు నాన్నా.... ఎదిగే వయసు నీది. అన్నం చక్కగా తింటే బాగా పెరుగుతారు” అంది అమ్మ. “ఉహూ .... నేనూ తినను” గొడవ చేశాను. సరే అంటూ నవ్వింది అమ్మ.

అలా అని గంట అయిందో లేదో కడుపులో ఆకలి మొదలయింది. నాలో పంతం ఎక్కువయింది. మరో గంట ఎలాగో ఓర్చుకున్నాను. ఇంక నా వల్ల కాలేదు. శరీరమంతా నీరసించిపోయింది. రోడ్డుమీద, టి.వి.లో, వార్తాపత్రికల్లో ఎంతోమంది ఆకలితో దీనంగా చూడడం గుర్తొచ్చింది. ఆకలి బాధ ఎలా ఉంటుందో అప్పుడు తెలిసింది నాకు.

అమ్మకు తెలియకుండా అన్నం తినాలని వంటింట్లోకి దూరాను. గిన్నెలో అన్నం లేదు. ఏం చేయాలో తోచలేదు. బాధతో కడుపు పట్టుకుని వెనుదిరిగాను. వెనకాలే అమ్మ. అమ్మ చేతిలో పళ్ళెం. పళ్ళెంలో వేడి వేడి అన్నం, గబగబా అమ్మదగ్గరకు పరుగెత్తాను. అమ్మ చిన్నగా నవ్వుతూ అన్నం కలిపి ముద్దలు చేసి నోట్లో పెట్టసాగింది. “అమ్మో! ... ఆకలి భరించడం చాలా కష్టం. ఇంత ఆకలిని ఎలా భరిస్తారో కదా!” అన్నాను.



© SCERT not to be republished

"అందుకే అన్నారు... అన్నం పరబ్రహ్మ స్వరూపం అని ... అంటే అన్నం దేవుడన్నమాట. మరి నువ్వేమో రోజూ అన్నాన్ని వదిలేస్తూ, పారేస్తూ నిర్లక్ష్యం చేస్తావు" అంది అమ్మ.



దుక్కిదున్నడం

"పారేస్తే ఏమవుతుందమ్మా? అన్నం చాలా తేలిగ్గానే దొరుకుతుంది కదా!" అన్నాను తింటూనే.

"తేలిగ్గా దొరుకుతుందా? ఎలా?" అమ్మ కళ్ళల్లో ఆశ్చర్యం.

"ఏముందీ దుకాణంలోకెళ్ళి బియ్యం కొనుక్కోవడం. పొయ్యి మీద నీళ్ళలో ఉడికించి గంజి వార్చడం ... అంతే కదా!" అన్నాను. అంతే కదా మరి!.



నారుమడి

"మరి, దుకాణంలోకి బియ్యం ఎలా వస్తాయో తెలుసా?" అడిగింది అమ్మ.

తెల్లమొహం వేశాను. అమ్మ మళ్ళీ నవ్వింది. అన్నం తినిపిస్తూనే చెప్పడం మొదలుపెట్టింది.

"పల్లెల్లో పొలాలు, అందులో ఆకుపచ్చని వరిపైరు చూశావు కదా! ఆ వరి పైరు ద్వారా వడ్లు వస్తాయి. వడ్లను మర పట్టిస్తే బియ్యం వస్తాయి" అంది.



నాట్లువేయడం

"మరి వడ్లను ఎలా పండిస్తారు? వివరంగా చెప్పవా?" అడిగాను.

"ముందుగా పొలంలో నీరు నిలువ ఉండడానికి పొలం చుట్టూ గట్లు వేస్తారు. ఆ గట్ల మధ్య పొలంలో ఒకసారి నాగలితో దున్ని బెడ్డ విరుస్తారు. అట్లా చెయడం వల్ల పాత మొక్కలన్నీ పోతాయి. ఆ పొలంలోనే ఒక మూల చిన్న మడిని చదును చేసి తడిపెడతారు. మెత్తగా చేస్తారు. తరువాత మొలకెత్తిన ధాన్యం విత్తనాలు చల్లుతారు. అవి నీటితడికి మొక్కలుగా వస్తాయి. అప్పుడు ఆ మడి పచ్చని తివాచీ లాగా కనిపిస్తుంది. దీన్నే 'నారుమడి' అంటారు".



వరి కంకులు

అమ్మ అలా చెబుతూంటే నా కళ్ళముందర పచ్చని తివాచీ లాంటి పొలం కనిపించింది. నేను కొన్నిసార్లు బస్సులో వెళుతున్నప్పుడు మరి కొన్నిసార్లు టి.వి.లో, సినిమాల్లో చూశాను. అమ్మ చెబుతుంటే ఎంతో ముచ్చటేసింది.

"నారుమడిలో మొక్కలు మూరెడు పెరగగానే పొలాన్ని దుక్కిదున్ని సిద్ధం చేస్తారు. ముందు నాగలితో లోతైన చాళ్ళుగా దున్నుతారు. నీరు పట్టించి తిరిగి దున్ని దమ్ము చేస్తారు. దమ్ము చేయడం అంటే పట్టీలాగా ఉండే ఒక పొడుగు కర్రతో చేనును చదును చేయడమన్నమాట. అప్పుడు ఇందాక నారుమడిలో మొలిచిన మొక్కలుంటాయి కదా! వాటిని మూడేసి, నాలుగేసి మొక్కలను ఒకచోట నాటుతారు. అలా కొద్ది కొద్ది దూరంలో వాటిని నాటుతూ పొలమంతా మొక్కల్ని నాటుతారు. దీన్నే 'నాట్లు వేయడం' అంటారు.

©SCERT not to be republished

అమ్మ అలా వర్ణించి చెబుతుంటే ఆ దృశ్యాలు నా కళ్ళముందర మెదులుతున్నట్లే అనిపించసాగాయి.



కోతకోయడం

"మొక్కలు మొనలూదుకున్న తరువాత దుబ్బులు వేస్తాయి. అప్పుడు కలుపు మొక్కలు బయలుదేరతాయి. వాటిని వెంటనే తీసి వేయాలి. లేకపోతే భూమిలోని సారాన్నంతా అవే పీల్చుకుని, వరిమొక్కలను పెరగకుండా చేస్తాయి. దీన్ని 'కలుపుతీయడం' అంటారు. ఆ తరవాత మొక్కలు ఎదిగి పొట్టలుపోసుకుని పాలు చేస్తాయి. ఆ పాలే వరి కడుపులో ఎదిగి గింజకడతాయి. గింజ గట్టిపడి మొనదేలుతుంది. అలా పంట తయారైన తరువాత కోతలు కోసి, ఆరనిచ్చి కుప్పలు వేస్తారు".



కుప్ప నూర్చడం

అమ్మ ఒక్కోమాట చెబుతున్నకొద్దీ తింటున్న అన్నం మరింత తియ్యగా, కమ్మగా మారిపోయినట్లు అనిపించసాగింది.


"ఎడ్లతో, ట్రాక్టర్లతో, యంత్రాలతో కుప్ప నూర్పిస్తారు. తరువాత చేటలతో చెరిగి ధాన్యాన్ని తూర్పారబోస్తారు. ఇలా చేయడం వల్ల ధూళి, దుమ్ము, పొల్లు పోయి గట్టి ధాన్యపురాశి మిగులుతుంది. ధాన్యాన్ని బస్తాలలో నింపి బండ్లలో తోలి గాదెలలో నింపుతారు. ఏడాదికి సరిపడా ఉంచుకుని మిగతాది అమ్మేస్తారు. అలా వడ్లను మరపట్టిస్తే ఇదిగో మనం తినే ఈ బియ్యం తయారవుతాయి" అంది అమ్మ.



తూర్పారబట్టడం

తినడం పూర్తయింది. అమ్మకథ చెప్పడమూ పూర్తయింది. నేను తింటూండగా కిందపడ్డ కొన్ని మెతుకులు కనిపించాయి. అవి ఎంతో విలువైనవిగా అనిపించాయి.

"అమ్మా! ఇదంతా పండించడానికి ఎంతకాలం పడుతుంది"? అని అమ్మను అడిగాను. 'సుమారు నాలుగునెలలు పడుతుంది. ఈ నాలుగునెలల కాలంలో వర్షాలు కురవాలి. విత్తనాలు మొలకెత్తాలి. ఎరువులు వేయాలి, పురుగు పట్టకుండా మందులు చల్లాలి. మధ్యలో అకాల వర్షాలు, రాళ్ళ వర్షాలు పడకుండా ఉండాలి. ఇలాంటి ఎన్నో కష్టాలు పడితే గానీ రైతుకు పంట చేతికి రాదు. అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపమైతే రైతు మనకు తిండిపెట్టే దేవుడు" అంది అమ్మ.



అమ్మ చెప్పే మాటలతో నాకు మొదటిసారి అన్నం విలువ, రైతు విలువ తెలిసినట్లనిపించింది. తినే ఆహారాన్ని వృథా చేయకూడదనని నిశ్చయించుకొన్నాను.

© SCERT not to be republished

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



అ) బాబు అమ్మతో "నేను నీలాగే ఉపవాసం ఉంటాను" అన్నాడు కదా! మరి నీవెప్పుడైనా అన్నం తినకుండా ఉన్నావా? అప్పుడు నీకెలా అన్పించింది? ఆకలివేసినప్పుడు ఎలా ఉంటుంది?

ఆ) "అన్నాన్ని వదిలేస్తూ, పారవేస్తూ నిర్లక్ష్యం చేస్తావు" అని అమ్మ అంది కదా! ఆహార పదార్థాలను వృథాచేయడం ఎక్కువగా ఎక్కడెక్కడ కనిపిస్తుంది? అలా చేస్తే ఏమౌతుంది?

ఇ) 'తెల్లమొహం' వేయడమంటే ఏమిటి? ఈ పదబంధాన్ని ఎప్పుడెప్పుడు వాడతారో కొన్ని ఉదాహరణలు చెప్పండి.

ఈ) "కొన్నిసార్లు బస్సులో వెళుతూ పచ్చని తివాచీలాంటి పొలాల్ని చూశాను" అని బాబు అన్నాడు కదా! మీరు బస్సులో వెళ్లినప్పుడు ఏ ఏ దృశ్యాలు చూశారో చెప్పండి. అప్పుడు మీకు ఎలా అనిపించింది?

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



అ) కింది పేరాను చదవండి. దీనికి సరైన పేరు సూచించండి. ప్రశ్నలు రాయండి.





ప్రతి మనిషీ జీవించడానికి ఆహారం అవసరం. అందుకే 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అన్నారు. అన్నం దొరకనివారికి ఆకలి బాధ, అన్నం విలువ తెలుస్తుంది. మనం వృథాగా పడేసే అన్నం కూడా దొరకక అల్లాడిపోయే పేదవాళ్ళు ఎందరో ఉన్నారు. ఒకప్పుడు వేడుకలు జరిగినప్పుడు అవసరమైనంత మేరకే ఆహార పదార్థాలు వండి, సహపంక్తి భోజనాలు పెట్టేవారు. స్వయంగా వడ్డిస్తూ ఎవరికి ఎంత ఆహారం అవసరం ఉంటుందో అడిగి వడ్డించేవారు. దానితో అన్నం వృథా అయ్యేది కాదు. కాని నేడు 'బఫే' పద్ధతిలో భోజనాలు పెడుతున్నారు. దాంతో ఆహార పదార్థాలు చాలా వృథా అవుతున్నాయి. అన్నం వృథా చేయడంపై ఈ మధ్య జరిపిన ఒక సర్వేలో 'మన దేశంలో జరిగే వేడుకల్లో ఇరవై శాతం వండిన ఆహారాన్ని వృథాగా పడేస్తున్నారు.' అని తేలింది. దీనివల్ల అనేక పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయి. పరిసరాలు కలుషితమైపోయి రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి. అంతేకాక ఈ కుళ్ళిన ఆహారపదార్థాలు తినడంవల్ల అనేక పశువులూ చనిపోతున్నాయి. కాబట్టి ఆహారాన్ని వృథా చేయకూడదు.

© SCERT not to be republished

ఆ) **పాఠం చదివి వరిపండించే విధానాన్ని వరసక్రమంలో రాయండి.**

**ఉదా:** పొలం చుట్టూ గట్లు వేస్తారు, ............., .............., ...............

ఇ) **పాఠం చదవండి. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అని ఎవరు ఎవరితో అన్నారు?
2. రైతులు నారుమడిని ఏ విధంగా తయారుచేస్తారు?
3. వరిచేలో కలుపుమొక్కలు తీయకపోతే ఏం జరుగుతుంది?
4. తాను తింటున్న అన్నం మరింత తియ్యగా, కమ్మగా మారిపోయిందని బాబు అన్నాడు కదా! ఈ మాటలు ఏ సందర్భంలోనివి?
5. బాబుకు కిందపడిన మెతుకులు ఎందుకు విలువైనవిగా కనిపించాయి?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



అ) అమ్మ చెబుతున్నప్పుడు "ఆ దృశ్యాలు కళ్ళముందు కనిపిస్తున్నట్లు ఉంది" అని బాబు అన్నాడు కదా! నీకెప్పుడెప్పుడు అలా అనిపించింది. ఒకదాని గురించి రాయండి.

ఆ) చాలామందికి తినడానికి అన్నం దొరకడం లేదు. దానికి గల కారణాలు ఏమై ఉంటాయో రాయండి.

ఇ) "రైతు మనకు తిండిపెట్టే దేవుడు" దీన్ని నువ్వెలా సమర్థిస్తావు? వివరించు.

ఈ) వరి పండించే విధానాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

ఉ) "అన్నం"... పాఠంలోని విషయాన్ని మనకు ఎవరు చెబుతున్నారు? వారి గురించి ఐదు వాక్యాలు రాయండి.

ఊ) ఆహారం వృథా ఎలా జరుగుతున్నది? వృథాను అరికట్టడానికి మనం ఏం చేయాలి.

## IV పదజాలం



అ) **ఇంత వరకు మీరు నేర్చుకున్న పాఠాల్లోని సంయుక్తాక్షరాలున్న పదాలు రాయండి. వాటిలో ఏవైనా ఐదు పదాలతో సొంతవాక్యాలు రాయండి.**

ఆ) **కింది పదాలు గమనించండి. ఒకే పదానికి వేరువేరు సందర్భాలలో వేరువేరు అర్థాలు వచ్చే మరికొన్ని పదాలు రాయండి. వాటిని ఉపయోగించి వాక్యాలు రాయండి.**

**ఉదా:** పెరుగు: 1. రవి వేసిన మొక్క <u>పెరుగు</u>తోంది.
2. రాజు <u>పెరుగుకలిపిన</u> అన్నంతో భోజనంచేశాడు.

రాగి : 1. <u>రాగి</u> చెంబుతో మంచినీరు పోశాడు.
2. రైతు <u>రాగి</u>పంట వేశాడు

అడుగు :

రాయి :

పాలు :

©SCERT Not to be republished

ఇ) **కింది పదాలను ఒకే వాక్యంలో ఉంచి సొంతవాక్యాలు రాయండి.**


1. నాన్న, పొలం, అన్నం ..........................................
2. వరిచేను, ఎరువు, కలుపు ..........................................
3. దప్పు, పైరు, పిట్టలు ..........................................
4. వరికుప్ప, నూర్పిడి, ధాన్యం ..........................................
5. రైతు, పంట, పండుగ ..........................................

ఈ) **కింది పదాలను వరస క్రమంలో ఉంచి రాయండి.**

**ఉదా:** నూర్పిడి, కలుపు, ధాన్యం, నాటు — <u>నాటు, కలుపు, నూర్పిడి, ధాన్యం</u>

1. బియ్యం, వడ్లు, బువ్వ, మిల్లు ................................
2. ప్రయాణం, టిక్కెట్టు, బస్సు, బస్స్టాండు ................................
3. ఇల్లు, పునాది, కప్పు, గోడ ................................
4. మేఘం, నీరు, ఆవిరి, వర్షం ................................
5. నీరు, తాడు, బావి, బక్కెట్టు ................................

## V సృజనాత్మకత



అ) అన్నం గొప్పదనాన్ని తెలుసుకున్నారు కదా! అన్నాన్నే కాకుండా ఏ ఆహార పదార్థాలు వృథా చేయగూడదు. ఈ విషయాన్ని తెలియజేసేలా నినాదాలు రాయండి.


## \VI ప్రశంస



అ) 'రైతు దేశానికి వెన్నెముక' అని అంటారు కదా! రైతు గొప్పదనాన్ని ప్రశంసిస్తూ ఒక పేరా రాయండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం

అ) **కింది వాక్యాలను చదవండి.**



1. గోపి గుర్రంకళ్ళెన్ని చేత్తో పట్టుకున్నాడు.
2. దివ్య 'ఎలుకవీరుడు' కథ చదువుతున్నది.
3. లక్ష్మణ్ మొక్కలు నాటాడు.
4. రాజుగారు పండితులను సత్కరించారు.

ఆ) **పై వాక్యాలకు సంబంధించిన ప్రశ్నార్థక వాక్యాలను చదవండి.**

1. గుర్రంకళ్ళెన్ని <u>ఎవరు</u> పట్టుకున్నారు?
2. ఎలుకవీరుడు కథను <u>ఎవరు</u> చదువుతున్నారు?

© SCERT not to be republished

3. మొక్కలు <u>ఎవరు</u> నాటారు?

4. పండితులను <u>ఎవరు</u> సత్కరించారు?

**పిల్లలూ! పై వాక్యాలలో ఏ ప్రశ్నార్థక పదం ఉందో గమనించండి. ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానాలు ఏవో చెప్పండి. ఇలా 'ఎవరు' అనే పదానికి సమాధానం వచ్చేవాటిని 'కర్త' అంటారు.**

1. గోపి <u>దేన్ని</u> పట్టుకున్నాడు?
2. దివ్య <u>దేన్ని</u> చదువుతున్నది?
3. లక్ష్మణ్ <u>వేటిని</u> నాటాడు?
4. రాజుగారు <u>ఎవరిని</u> సత్కరించారు?

- ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానాలు ఏవో చెప్పండి. మీరు చెప్పిన మాటలను అనగా ఎవరిని, దేనిని అనే పదాలకు సమాధానంగా వచ్చేపదాలను 'కర్మ' అంటారు.
- పై వాక్యాలలో పనిని తెలియచేసే పదాలు ఏవి? వీటిని ఏమంటారు?

ఇ) **కింది వాక్యాలను చదవండి. కర్త, కర్మ, క్రియలను గుర్తించి రాయండి.**

1. యాదయ్య సౌజన్యకు బహుమతి ఇచ్చాడు.
2. తాబేలు కుందేలును ఓడించింది.
3. సైనానెహ్వాల్ బాడ్మింటన్ ఆటలో చైనా దేశపు క్రీడాకారిణిని ఓడించింది. ఆమె పతకం సాధించింది.

### ప్రాజెక్టు పని

మీ గ్రామంలో / వాడలో / బంధువుల ఇళ్ళలో జరిగే ఏదైనా కార్యక్రమాలకు వెళ్ళండి. అక్కడ ఆహార పదార్థాలు ఏ విధంగా వృథా అవుతున్నాయో పరిశీలించండి. దీనివల్ల జరిగే నష్టాల గురించి నివేదిక రాసి ప్రదర్శించండి.

### నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | నా అనుభూతులను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | పాఠం ఆధారంగా వరి పండించే విధానాన్ని క్రమపద్ధతిలో రాయగలను. | ఔను/కాదు |
| 3. | వరి పండించే విధానాన్ని, రైతు గొప్పదనం గురించి సొంత మాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | ఆహారం వృథా చేయకూడదని నినాదాలు రాయగలను. | ఔను/కాదు |


**అన్నం పరబ్రహ్మ స్వరూపం. ఆహారాన్ని వృథా చేయగూడదు.**

© SCERT not to be republished

రెండో యూనిట్

# 7. జెండా వెంకయ్య

కింది చిత్రం చూడండి.





**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రంలోని వాళ్ళు ఎవరై ఉంటారు? వాళ్ళ చేతుల్లో ఏం ఉంది?
- వాళ్ళందరూ జెండాను ఎందుకలా తీసుకెళ్తున్నారు?
- మనదేశ జెండా గురించి మీకు తెలిసినది చెప్పండి.




**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.



బ్రిటిష్ జెండా భారత జాతీయ పతాకమెలా అవుతుందనే ప్రశ్న దేశప్రజల్లో, నేతల్లో ఉదయించింది. అందుకోసం మన జాతీయతకు అనువైన పతాకం రూపొందించుకోవాలని తీర్మానించారు. ఆ జెండాను ఎవరు తయారు చేశారో పాఠం చదివి తెలుసుకోండి.



"స్వాతంత్ర్యం - వర్ధిల్లాలి" అంటూ బీహార్‌లోని కళాశాల విద్యార్థులు మువ్వన్నెల పతాకం చేతబూని ఊరేగింపులు నిర్వహిస్తున్నారు. బ్రిటిషు వారు ఊరేగింపును నిలిపే ప్రయత్నం చేశారు. కాని ఆ జనసముద్రాన్ని నిరోధించడం వారివల్ల కాలేదు.

"కాల్చండి" అంటూ బ్రిటిషు అధికారి ఆజ్ఞాపించాడు. ఒక్కసారిగా "ఢాం .... ఢాం" అని తుపాకులు పేలాయి.



అంతే పోలీసు కాల్పుల్లో జగపతి రామానంద్ అనే వ్యక్తి నేలకొరిగాడు. అయితే ఆ వ్యక్తి చేతిలో మువ్వన్నెల జెండా రెపరెపలాడుతోంది. తన ప్రాణం కన్నా మిన్నగా జెండాను గౌరవిస్తూ దాన్ని నేలకొరగనీయలేదు. "వందేమాతరం" అంటూ నేలకొరుగుతున్న పతాకాన్ని వెంట ఉన్న విద్యార్థులు చేతబూనారు. పోలీసులమీద తిరగబడ్డారు. దేశవ్యాప్తంగా జెండాలను పట్టుకొని స్వాతంత్ర్య ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు.

ఒకసారి అలహాబాద్‌లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించడానికి ఉద్యమకారులు ప్రయత్నించారు. దీన్ని బ్రిటిషువారు అడ్డుకున్నారు. ఆ సమయంలో లాల్‌బహదూర్‌శాస్త్రి స్త్రీ వేషధారణతో పోలీసుల కన్నుగప్పి జెండాను ఎగురవేసి అందరినీ ఆశ్చర్యపరచాడు. ఇలా స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి పోసింది మన మువ్వన్నెల పతాకం.

స్వాతంత్ర్యోద్యమ తొలిరోజుల్లో మనదేశానికి ప్రత్యేకంగా జాతీయపతాకం లేదు. కాని పూర్వంనుంచీ మన దేశంలోని అనేక రాజ్యాలలో రాజులకు ప్రత్యేక చిహ్నాలతో పతాకాలుండేవి. బ్రిటిషువారు మన దేశాన్ని ఆక్రమించిన తరవాత వారు రూపొందించుకున్న జెండా ఎగరవేశారు. బ్రిటిషు జెండా భారత జాతీయపతాకమెలా అవుతుందనే ప్రశ్న దేశప్రజల్లో, నేతల్లో ఉదయించింది. అందుకోసం మన జాతీయతకు అనువైన పతాకం రూపొందించుకోవాలని తీర్మానించారు. దాని ప్రకారం పలువురు నాయకులు వివిధ రూపాలలో రకరకాల పతాకాలను రూపొందించారు.



1905లో స్వామి వివేకానంద శిష్యురాలైన 'సిస్టర్ నివేదిత" ఈ పతాకాన్ని రూపకల్పన చేశారు.





దీన్ని స్ఫూర్తిగా తీసుకొని రూపొందించిన జెండాను తొలిసారిగా 1906 ఆగస్టు 7న కొల్‌కత్తాలోని పార్సిబగాన్ వద్ద ఎగరవేశారు.




తరవాత జాతీయ పతాకానికి మరికొన్ని మార్పులు చేశారు. 22ఆగస్టు 1907న జర్మనీలోని స్టెడ్‌గార్డ్‌లో జరిగిన రెండవ జాతీయ కాంగ్రెస్ సమావేశంలో, స్వాతంత్ర్య పోరాట యోధురాలైన "మేడమ్ బిక్కెజి రుస్తామ్ కామా" దీన్ని ఎగరవేశారు.

చాల మార్పులకు లోనైన మూడో పతాకాన్ని 1917లో రూపొందించారు. దీన్ని డాక్టర్ అనిబిసెంట్, లోకమాన్య బాలగంగాధర్ తిలక్‌లు ఎగరవేశారు.






తరవాత 31మార్చి 1921లో విజయవాడలో అఖిల భారత కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఆ సందర్భంలో గాంధీజీ సూచన మేరకు పింగళి వెంకయ్యగారు ఒక పతాకాన్ని రూపొందించారు. గాంధీజీ స్వయంగా వెంకయ్యగారిని ప్రశంసించి, ఆ పతాకాన్నే ఆ సమావేశంలో ఎగరవేశారు.

తర్వాత 1931లో కరాచిలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సమావేశంలో జెండా స్వరూపాన్ని నిర్ణయించారు. ఇది కూడా జాతీయజెండా హోదాకు నోచుకోలేదు.





ఆ తరువాత కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో మధ్యలో రాట్నం గుర్తుతో రూపొందించిన జెండాను 1931 ఆగస్టు 6న భారత జాతీయ కాంగ్రెస్ ఆమోదించింది. అదే నెల 31న ఆ జెండాను ఎగరవేశారు.

© SCERT not to be republished



ఎంతోమంది దేశభక్తులు పలురకాల జెండాలను రూపొందించారు. స్థిరమైన జాతీయ పతాకాన్ని ఎంపిక చేసేందుకు గాంధీజీ ఒక కమిటీని నియమించారు. వీరు వివిధ జెండాలను అధ్యయనం చేశారు. కొద్ది మార్పులతో పింగళి వెంకయ్యగారు రూపొందించిన పతాకానికి 1947 జూలై 22న ఆమోద ముద్రవేశారు. దేశ సమగ్రతకు, సమైక్యతకు ప్రతీకఅయిన మన జాతీయపతాకంలో మూడు రంగులున్నాయి. మధ్యలో రాట్నానికి బదులు సారనాథ్ స్థూపంలోని అశోకుని ధర్మచక్రం ఉంచారు. జవహర్‌లాల్ నెహ్రూ గారు దీన్ని తొలిసారి ఆవిష్కరించారు. ఇదే ఇప్పటి మన జాతీయ పతాకం.

పింగళి వెంకయ్య రూపొందించిన మన జాతీయ పతాకంలో కాషాయం రంగు ధైర్యానికి , త్యాగానికి, దేశభక్తికీ ప్రతీక. తెలుపురంగు శాంతికీ, సత్యానికీ చిహ్నం. ఆకుపచ్చరంగు నమ్మకానికీ, సమృద్ధికీ, భూమికి సంకేతం. జెండా మధ్యలో నీలిరంగు గల అశోకుని ధర్మచక్రం ఉంది. దీనిలో గల 24 ఆకులు, 24 గంటలకు, క్రమశిక్షణకు, ధర్మానికీ, న్యాయానికీ సంకేతం. ఇది సూర్యబింబానికి సూచిక.

జాతీయ పతాకానికి సంబంధించి "బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్" కొన్ని నిబంధనలను ఖరారు చేసింది. ఈ జెండా పొడవు, వెడల్పులు 3:2 నిష్పత్తిలో ఉండాలి. ఖాదీ లేదా చేనేత వస్త్రంతో దీన్ని తయారుచేయాలి. సూర్యోదయం తర్వాత జెండాను ఎగురవేయాలి. సూర్యాస్తమయం లోపల జెండాను అవనతం చేయాలి. జాతీయ సంతాపదినాలలో స్తంభానికి సగం ఎత్తులో మాత్రమే ఎగరవేయాలి.

జాతిఖ్యాతిని ఇనుమడింపజేసిన మన జాతీయపతాక రూపకల్పనలో పింగళి వెంకయ్య గారి కృషి మరువలేనిది. అందుకే వీరు "జెండా వెంకయ్య"గా ప్రసిద్ధి చెందారు.

వెంకయ్యగారు 1876 సం. ఆగస్టు 2వ తేదీన కృష్ణాజిల్లా, భట్లపెనుమర్రులో జన్మించారు. వీరి తండ్రి హనుమంతరావు. పింగళి వెంకయ్య బందరు హిందూ హైస్కూల్‌లో చదువు పూర్తి చేశారు. తన 19 ఏళ్ళ ప్రాయంలోనే సైన్యంలో చేరి ఆఫ్రికా వెళ్ళారు. ఆఫ్రికాలో జరుగుతున్న బోయర్ యుద్ధంలో వెంకయ్యగారు పాల్గొన్నారు. వారు ఆఫ్రికాలో ఉన్నప్పుడు మహాత్మాగాంధీజీతో పరిచయం ఏర్పడింది. గాంధీజీ స్ఫూర్తితో మనదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.

ఈయన స్వాతంత్ర్య సమరయోధులు మాత్రమే కాదు వ్యవసాయశాస్త్రవేత్త, బహుభాషాకోవిదులు, నిస్వార్థ రాజకీయవేత్త, నిరాడంబరుడు కూడా! ఒక సందర్భంలో కొందరు మిత్రులు వెంకయ్యగారిని మీరు భారతజాతికి ఎనలేని సేవ చేశారు కదా! దీనికి మీకు లభించిన పారితోషికం ఏమిటి?" అని ప్రశ్నించారు. వెంకయ్యగారు చిరునవ్వు నవ్వి, "గాంధీజీ ఏ పారితోషికంకోసం ఈ సేవ చేశారు? కొల్లాయితోనే ఉల్లాసంగా జీవితం గడుపుతున్నారు. నిస్వార్థ సేవకు పారితోషికాలుండవు. సేవచేయడమే కొన్ని జీవితాలకు పారితోషికం. నేనూ అలాంటి సేవే చేశాను. ఇలాంటి పనులతో నేను ఆనందం పొందుతాను." అని వినమ్రతతో సమాధానమిచ్చారు. ఇది వారి గొప్పతనానికి నిదర్శనం.

మువ్వన్నెల పతాక రూపకర్త అయిన పింగళి వెంకయ్యగారు మన తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణం. వారి మార్గంలో పయనిస్తూ దేశం నాకేమిచ్చిందని కాకుండా దేశానికి నేనేమిచ్చాను అని ఆలోచిస్తూ దేశ సేవలో, ప్రజల సేవలో, గ్రామ సేవలో మనమందరం పయనిద్దాం.

**– మూలం: సి.సి.ఆర్.టి, చక్రధ్వజ్**

©SCERT not to be republished

## ఇవి చేయగలరా?

### I వినడం, ఆలోచించి చెప్పడం



అ) పాఠం చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారో చెప్పండి.

ఆ) జాతీయజెండాను ఎక్కడెక్కడ, ఎప్పుడెప్పుడు ఎగరవేస్తారో చెప్పండి.

ఇ) మీ గ్రామంలో/ వాడలో / కాలనీలో ఎవరు ఏవిధంగా సేవలు చేస్తున్నారో చెప్పండి.

ఈ) మీకు తెలిసిన జెండా పాటలు పాడండి.

### II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం




అ) పాఠం చదవండి. కింది పట్టికను పూరించండి.

| సంవత్సరం | జరిగిన సంఘటన |
|---|---|
| ఉదా: 1905 | స్వామి వివేకానంద శిష్యురాలైన 'సిస్టర్ నివేదిత" ఒక పతాకాన్ని రూపకల్పన చేశారు. |

ఆ) కింది పేరా చదవండి. గీతగీసిన పదాన్ని సరియైన చోట ఉంచి అర్థవంతంగా రాయండి.

ఒకసారి <u>ఆశ్చర్యపరచారు</u> త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించటానికి <u>జెండా</u> ప్రయత్నించారు. దీన్ని బ్రిటిషువాళ్ళు అడ్డుకున్నారు. ఆ సమయంలో <u>అలహాబాద్‌లో</u> స్త్రీవేషాన్ని ధరించి పోలీసుల కన్నుకప్పి జెండా ఎగురవేసి అందర్నీ <u>లాల్‌బహదూర్‌శాస్త్రి</u> ఇలా స్వాతంత్ర్య <u>ఉద్యమకారులు</u> ఊపిరిపోసింది మన <u>ఉద్యమానికి.</u>


ఇ) పాఠం చదివి కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.



1. లాల్‌బహదూర్‌శాస్త్రి స్త్రీవేషాన్ని ఎందుకు ధరించారు?
2. మనదేశంలోని నేతలు, ప్రజలు ప్రత్యేక పతాకం ఏర్పాటు చేసుకోవాలని ఎందుకు అనుకున్నారు?
3. తొలి జాతీయ పతాకాన్ని ఎప్పుడు, ఎక్కడ ఎగరవేశారు?
4. జగపతి రామానంద్ నేలకొరిగినప్పుడు జరిగిన సంఘటనను రాయండి.
5. విజయవాడలో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో గాంధీజీ పింగళి వెంకయ్యను మెచ్చుకున్నారు. ఎందుకు?
6. జాతీయ జెండాను ఎగరవేసినప్పుడు పాటించాల్సిన నియమాలు తెలపండి.

© SCERT not to be republished

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



అ) ప్రతి దేశానికీ ఒక జెండా ఉంటుంది కదా! దీని ప్రాధాన్యం ఏమిటి?

ఆ) జాతీయజెండా రూపొందించబడిన క్రమాన్ని సొంతమాటల్లో రాయండి.

ఇ) 'స్వాతంత్ర్యం' అంటే మీరు ఏమి అర్థం చేసుకున్నారు. స్వాతంత్ర్య జెండాను ఎక్కడెక్కడ ఎగురవేస్తారు?

ఈ) పింగళి వెంకయ్యగారి గురించి సొంతమాటల్లో రాయండి.

ఉ) మీరు ఇతరులకోసం ఏమైనా పనులు చేశారా ? అలా చేసినపుడు మీ కెలా అనిపించిందో రాయండి.


## IV పదజాలం



(అ) కింది ఆధారాల ద్వారా పట్టిక పూరించండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | | 3 | | 4 | |
| | | | | | |
| | | | | | |
| | 2 | | | | 5 |
| 7 | | | | 9 | |
| | 8 | | | | |

© SCERT not to be republished



| నిలువు | అడ్డం |
|---|---|
| 1. జెండాకు అడుగుభాగం రంగు. | 1. జెండాకు మరోపేరు. |
| 2. పతాకం మధ్యలో ఉండే రంగు. | 2. మన రాష్ట్రభాష. |
| 3. జొన్నలో తినే భాగం. | 4. విదేశాలలో మన జాతీయ పతాకాన్ని ఎగరవేసిన తొలి వనిత పేరులోని చివరి రెండు అక్షరాలు. |
| 4. జెండా పై భాగం రంగు. | 7. దేవుడి పూజకు ఉపయోగించేవి. |
| 5. జెండా రూపొందించిన తెలుగువాడు. | 8. చింతకాయ రుచి. |
| | 9. కోతికి ఉండేది. |

ఆ) **కింది పదాలకు వచనం మార్చి వాటిని సొంతవాక్యాలలో ఉపయోగించి రాయండి.**

1. జెండా :.... ...............................................
2. గీతాలు : ..................................................
3. గ్రంథాలు : ..................................................
4. వీధి : ..................................................
5. నేతలు : ..................................................
6. దేశం : ..................................................

ఇ) **జెండా పండుగను పాఠశాలలో జరుపుకోవడానికి ఏ ఏ వస్తువులు ఉపయోగిస్తారో రాయండి.**

## V సృజనాత్మకత



అ) దేశభక్తిని పెంపొందించే నినాదాలు తయారుచేయండి. రాయండి.

ఆ) మీ పాఠశాలలో జరుపుకొనే జెండా పండుగకు మీ తల్లిదండ్రులను, గ్రామస్థులను ఆహ్వానిస్తూ ఆహ్వానపత్రికలను తయారుచేయండి.


## VI ప్రశంస



అ) వివిధ భాషలలో జెండాను, జెండా ఆవిష్కరణలను ఏమంటారో తెలుసుకొని రాయండి.

ఆ) పింగళి వెంకయ్యగారు 'దేశానికి సేవచేయడమే జీవితానికి పారితోషికం' అన్నారు కదా! అలాగే మీ పాఠశాలకు వివిధ సేవాసంస్థలు/ స్వచ్ఛంద సంస్థలు/ వ్యక్తులు వసతుల కల్పన, పుస్తకాలు అందచేయడం వంటి సేవాకార్యక్రమాలు చేపట్టారు. మీరు వారు చేసిన సేవలకు అభినందనలు తెలపడానికి గ్రీటింగ్ కార్డులను లేదా అభినందన పత్రాలు తయారు చేయండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



అ) **కింది వాక్యాలను చదవండి. వాటిలోని పదాలలో కర్త, కర్మ, క్రియలను గుర్తించి పట్టికను పూరించండి.**

1. విద్యార్థులు ఊరేగింపులు నిర్వహిస్తున్నారు.
2. తాతయ్య నేహాను సర్కసుకు తీసుకొని వెళ్ళాడు.
3. లాల్‌బహదూర్‌శాస్త్రి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించాడు.
4. కవిత గేయాన్ని రాసింది.
5. అమ్మ పాపాయికి పాలు ఇచ్చింది.

© SCERT not to be republished

6. కృష్ణ మామిడి పండ్లు తెచ్చాడు.

7. మంగళ శుభలేఖను చదివింది.

8. సందీప్ నానమ్మను కథలు చెప్పమని అడిగాడు.

| కర్త | కర్మ | క్రియ |
|---|---|---|
| | | |

ఆ) కింది పట్టిక ఆధారంగా వాక్యాలు రాయండి. వాటిలో 'కర్త, కర్మ, క్రియ'లను గుర్తించండి.

| | | |
|---|---|---|
| రంజిత | పాలను | కాపాడుకొందాం |
| నిరోషా | పూలను | ఇస్తాడు |
| మనం | నాట్యం | ఇస్తుంది |
| ఆవు | వెలుగులను | చూసింది |
| సూర్యుడు | ప్రకృతిని | తెచ్చింది |

© SCERT not to be republished

## ప్రాజెక్టు పని

- వివిధ దేశాలకు సంబంధించిన వాటి జాతీయ పతాకాలను సేకరించండి. మన జాతీయ పతాకానికి వాటికి గల పోలికలు భేదాలు చెప్పండి.
- పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలలో స్వాతంత్ర్యోద్యమ విలువలను తెలిపే కథలను చదవండి. వాటి ఆధారంగా మీ తరగతిలో మాట్లాడండి.

## నేనివి చేయగలనా?

1. జాతీయ జెండాను గురించి, ఎప్పుడెప్పుడు జాతీయ జెండాను ఎగరవేస్తారో చెప్పగలను. ఔను/కాదు
2. పాఠం చదివి ఏ సంవత్సరంలో ఏ సంఘటన జరిగిందో పట్టిక తయారు చేయగలను. ఔను/కాదు
3. పింగళి వెంకయ్యగారి గురించి, జెండా గురించి సొంతమాటల్లో రాయగలను. ఔను/కాదు
4. ఆహ్వాన పత్రికలను తయారు చేయగలను. ఔను/కాదు

నిరాడంబరతే మానవునికి వెలలేని ఆభరణం.

- మణీబెన్

రెండో యూనిట్

# 8. మనసుంటే మార్గం ఉంది


కింది చిత్రం చూడండి.



© not to be republished

ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- పై చిత్రంలో ఏ పోటీలు జరుగుతున్నాయి?
- చిత్రంలోని వ్యక్తుల్లో ఏం తేడాలు గమనించారు?
- చిత్రంలో కాళ్లు లేకుండా పరుగెత్తే వ్యక్తిని చూస్తే మీకేమనిపిస్తుంది?



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

అన్ని అవయవాలు సరిగా ఉన్నవారు కూడా చేయలేని పనులు ఎన్నో ఉన్నాయి. మరి చేతుల్లేని వారు ఏం చేయగలరు ? అని అనుకొంటాం. కానీ చేతుల్లేకున్నా పట్టుదలతో తాను అనుకున్నది సాధించిందామె. మనసుంటే మార్గం ఉంటుంది. ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసం ముందు ఆ దేవుడైనా తల వంచాల్సిందే. ఇంతకూ ఎవరామె ? ఏం చేసింది ? పాఠం చదివి తెలుసుకోండి.

సరూర్‌నగర్,

07-09-2012.

ప్రియమైన లక్ష్మీ,!

ఎలా ఉన్నావు? ఇక్కడ మేమంతా క్షేమం. నీకు గుర్తుందా! మేము ఆంధ్రప్రదేశ్‌కు రాక ముందు గుజరాత్‌లోని సూరత్‌లో ఉండే వాళ్లం. మొన్న దసరా సెలవులకు మా ఊరు వెళ్లాం. అదే రాజ్‌కోట్ గ్రామానికి. అక్కడ మా నాన్నమ్మ ఉంది. సాయంత్రం అయ్యేసరికి స్నేహితులం అందరం కలిశాం. మా కాలనీలోని పిల్లలం అంతా కలిసి మట్టిలో గీతలు గీసి కుంటుడు ఆటలు, కొబ్బరాకులతో పీకలు చేసి పీపీ.... ఊదడాలు, పరుగెడుతూ నేల-బండ, దాగుడు మూతలు ఇలా రకరకాల ఆటలు ఆడాం. జ్యోత్స్న కూడా మాతో కలిసి ఆడేది. మేము పాటలు పాడితే మాతో కలిసి పాడేది. తాడాట, బంతాట వంటి ఆటలు ఆడేటప్పుడు మాత్రం ఒక పక్కగా కూర్చునేది. నీకు జ్యోత్స్న గురించి చెప్పలేదు కదూ! మా స్నేహితురాలు జ్యోత్స్న మనందరిలా కాదు. చాలా ప్రత్యేకమైన నేస్తం. ఎందుకో తెలుసా? తనకు చేతులు లేవు. ఐతేనేం! కాళ్ళు మాత్రం బాగా పని చేస్తాయి. జ్యోత్స్నకు చాలా పట్టుదల. “నేనెందుకు అందరిలా చేయలేక పోతున్నాను”? అని అనుకునేది, కానీ ఎక్కడా వెనుకడుగు వేసేది కాదు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే మనం చేతులతో చేసే పనులన్నీ జ్యోత్స్న కాళ్ళతో చేయడం నేర్చుకుంది. నువ్వు జ్యోత్స్నను చూస్తే ఆశ్చర్యపోతావు. జ్యోత్స్న బియ్యంలో రాళ్ళు ఏరడం, ఇతరులకు తల దువ్వడం, కూరగాయలు తరగడం, బట్టలుతకడం, పలక మీద రాయడం వంటి పనులన్నీ కాళ్ళతోనే చేస్తుంది. జ్యోత్స్న ఇలా పదో తరగతి వరకు చదివింది. నాకు జ్యోత్స్నలోని పట్టుదలే చాలా నచ్చుతుంది. ఏది చేయాలనుకుంటే అది నేర్చుకునే వరకూ విడిచిపెట్టదు.



© SCERT not to be republished



© SCERT not to be republished

జ్యోత్స్న ఇంట్లో వాళ్ళ అమ్మా, అక్క రకరకాల కుట్లు, అల్లికలూ చేసేవారు. వాళ్ళు చేస్తున్న పనులను జ్యోత్స్న ఎంతో శ్రద్ధగా గమనించేది. ఎప్పుడు నేర్చుకుందో తెలియదుగాని జ్యోత్స్న కూడా సూది పట్టుకుంది. అందంగా దుస్తులపై డిజైన్లు కుట్టేది. దుస్తులమీద అందంగా ఎంబ్రాయిడరీ చేయడం అంత సులభమైన పని కాదు కానీ మనసుంటే మార్గముంటుంది కదా! ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసం ముందు ఆ దేవుడైనా తలవంచాల్సిందే.

అతి తక్కువ కాలంలోనే జ్యోత్స్న మా ఊరిలోనే ప్రముఖ ఎంబ్రాయిడరీ కళాకారిణి అయిపోయింది. ఏ ఏ వస్త్రానికి ఎలాంటి దారాలు, పూసలు వాడాలో జ్యోత్స్నకు తెలిసినంతగా ఎవరికీ తెలియదు. ఆమె తయారు చేసినవన్నీ ప్రదర్శనకు కూడా పెట్టారు. మా గ్రామంతోబాటు లక్నో, బెంగాల్లో కూడా ఆమె చేసిన దుస్తులు అమ్ముడయ్యేవి. వాటికి మంచి గిరాకీ కూడా ఉండేది. సంప్రదాయ డిజైన్లకు ఆధునికతను జోడించే జ్యోత్స్న పనితనాన్ని అందరూ మెచ్చుకునేవారు. జ్యోత్స్న కాళ్లు అలా అలసట అనేది లేకుండా ఏదో ఒక పని చేస్తూనే ఉంటాయి. జ్యోత్స్న కాళ్లు ఆగవు. ఆమె ఎదుగుదలకు అవి సహకరిస్తూనే ఉన్నాయి.

నిజంగా జ్యోత్స్న లాంటి మిత్రురాలు నాకు ఉండడం చాలా గర్వంగా అనిపిస్తుంది. నాకు అన్నీ బాగున్నా నేను జ్యోత్స్నలాగా పేరు సంపాదించుకోలేదు కదా! ఈసారి జ్యోత్స్నని మన ఊరికి తీసుకువస్తాను. మీ కందరికీ పరిచయం చేస్తాను. మనం ఆమెని చూసి ఎన్నో నేర్చుకోవాలి. మనస్నేహితులందరినీ అడిగానని చెప్పు. మీ అమ్మానాన్నలకు నా నమస్కారాలు తెలియజెయ్యి. త్వరలో కలుద్దాం.

మీ

శాంతి

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



అ) లేఖలో ఎవరి గురించి ఉంది? లేఖలు ఎప్పుడు రాస్తారో చెప్పండి.

ఆ) లేఖ చదవగానే మీకు ఎటువంటి అనుభూతి కలిగిందో మీ సొంత మాటల్లో చెప్పండి.

ఇ) జ్యోత్స్న లాంటి వాళ్ళను చూసినప్పుడు మీకేమనిపిస్తుందో చెప్పండి.

ఈ) పట్టుదల, ఆత్మవిశ్వాసంతో జ్యోత్స్న గొప్ప కళాకారిణి అయింది కదా! మీకు ఏ ఏ విషయాల్లో పట్టుదల ఉంది? వివరించండి.

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



**అ) కింది వాక్యాలు చదవండి. పాఠం ఆధారంగా సరైన వాటికి '✓' పెట్టండి. తప్పుగా ఉన్న వాటికి '✗' పెట్టండి.**

1. జ్యోత్స్న లేఖ రాసింది. ( )
2. జ్యోత్స్న రాజ్‌కోట్ గ్రామంలో ఉంటుంది. ( )
3. కాళ్ళు కదపలేక జ్యోత్స్న బాధపడేది. ( )
4. సంప్రదాయక డిజైన్లకు ఆధునికత జోడించడం జ్యోత్స్న ప్రత్యేకత. ( )
5. పట్టుదల, ఆత్మవిశ్వాసానికి మారుపేరు జ్యోత్స్న. ( )

**ఆ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. జ్యోత్స్న కాళ్ళతో ఏమేమి పనులు చేసేది?
2. "జ్యోత్స్న తనకు ప్రత్యేకమైన నేస్తం" అని శాంతి ఎందుకంది?
3. "ఆమె ఎదుగుదలకు అవి సహకరిస్తూనే ఉన్నాయి". ఈ వాక్యం ఎవరి గురించి చెబుతోంది? ఈ వాక్యం అర్థం ఏమిటి?
4. జ్యోత్స్నలో మీకు ఏమి నచ్చింది? ఎందుకు?



**ఇ) కింది వాక్యాలు చదవండి. అవి జ్యోత్స్న, శాంతిలలో ఎవరికి సంబంధించినవో వారి పేర్లు పక్కన రాయండి.**

1. నేనెందుకు అందరిలాగా చేయలేకపోతున్నాను. ....................
2. దసరా సెలవులకు మా ఊరు రాజ్‌కోట్ వెళ్ళాం. ....................
3. తన పట్టుదల నాకు నచ్చుతుంది. ....................
4. మనసుంటే మార్గం ఉంటుంది కదా! ....................
5. ఎంతో శ్రద్ధగా గమనించేది. ....................

© SCERT not to be republished

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



అ) జ్యోత్స్న మీకు ఎదురైతే మీరు ఏమేమి ప్రశ్నలు అడగాలనుకుంటున్నారు?

ఆ) ఈ లేఖ చదివాక మీ ఆలోచనలో ఎటువంటి మార్పు వచ్చింది?

ఇ) జ్యోత్స్న కథ చదివారు కదా! తను పట్టుదలతో చేతులతో చేయలేని పనులన్నీ కాళ్ళతోనే చేసింది. మీరు జ్యోత్స్నలా పట్టుదలతో ఏం చేయాలనుకుంటున్నారు? ఏమవుదామని అనుకుంటున్నారు?

## IV పదజాలం



**అ) కింది పదాలను చూడండి. ఒకటి కన్నా ఎక్కువగా అదే అర్థాలు వచ్చే పదాలు రాయండి. పదం, దాని పర్యాయపదం ఒకే వాక్యంలో వచ్చేలా వాక్యాలు రాయండి.**


ఉదా: 1. నేస్తం = మిత్రుడు, స్నేహితుడు


2. ప్రముఖమైన =

3. దుస్తులు =

4. ఎదుగుదల =

**ఆ) కింద జ్యోత్స్నకు సంబంధించిన పదాలు ఉన్నాయి. ఐతే మీకు సంబంధించిన పదాలు రాయండి.**




**ఇ) జ్యోత్స్న ప్రత్యేకతలు కలిగిన అమ్మాయి. మీ స్నేహితులలో కూడా ఏవో కొన్ని ప్రత్యేకతలు ఉంటాయి. వాటిని కింది పట్టికలో రాయండి.**

| మీ స్నేహితుల పేర్లు | వారిలోని ప్రత్యేకతలు |
|---|---|
| | |

© SCERT not to be republished

ఈ) జ్యోత్స్న తయారు చేసిన దుస్తులకు మంచి గిరాకీ ఉంది. ఇలా నాణ్యమైన వస్తువులకు అవసరమున్న వాటికి మార్కెట్‌లో గిరాకీ ఉంటుంది. ఇలా గిరాకీ ఉండే వస్తువులేవో రాయండి.

ఉ) "నిజంగా జ్యోత్స్న లాంటి మిత్రురాలు నాకు ఉండడం చాలా గర్వంగా అనిపిస్తుంది". ఇలా 'నిజంగా' అనే పదంతో మొదలుపెట్టి వాక్యాలు రాయండి.

## V సృజనాత్మకత



**అ) జ్యోత్స్న గురించి తెలుసుకున్నారు కదా! జ్యోత్స్న గురించి విన్నాక మీకు కలిగిన అనుభూతులను తెలుపుతూ జ్యోత్స్నకు ఉత్తరం రాయండి.**

ప్రియమైన జ్యోత్స్నకు,

..............................................................................................

**ఆ) జ్యోత్స్నని తన ఊరికి తీసుకువచ్చి అందరికీ పరిచయం చేస్తానని శాంతి అంది కదా ! జ్యోత్స్న గొప్పతనాన్ని తెలిపేలా ఎలా పరిచయం చేస్తుందో చెప్పండి. కింది వాక్యాలను పొడిగిస్తూ రాయండి.**

ఇదిగో! ఈమె నా స్నేహితురాలు జ్యోత్స్న ..................................


## VI ప్రశంస



అ) జ్యోత్స్నను మీకు పరిచయం చేస్తే మీరు తను సాధించిన విజయాన్ని ఎలా అభినందిస్తారు? జ్యోత్స్న నుండి మనం నేర్చుకోవాల్సినవి ఏమిటి ?

ఆ) "నాకు అన్నీ బాగున్నా నేను జ్యోత్స్న అంత పేరు సంపాదించుకోలేదు కదా!" అని శాంతి అంది కదా! దీన్ని బట్టి మీరు ఏమి అర్థం చేసుకున్నారు?

## VII భాషను గురించి తెలుసుకుందాం



**అ) కింది వాక్యాలను చదవండి. వాటిలోని క్రియా పదాలను గుర్తించండి. అవి ఏ రకమైన క్రియా పదాలో చెప్పండి.**

1. అపర్ణ సినిమా చూసింది.
2. అపర్ణ సినిమా చూస్తూ, పండు తింటున్నది.
3. అపర్ణ సినిమా చూసింది. పండు తిన్నది.

పై మూడు వాక్యాలలోని క్రియా పదాలను గుర్తించారు కదా! మొదటి వాక్యంలో ఒకే ఒక సమాపక క్రియ (చూసింది) ఉంది కదా! ఇలా **ఒకే ఒక సమాపక క్రియ కలిగిన వాక్యాలను సామాన్య వాక్యాలు** అంటారు. ఇలాంటి వాక్యాలను రెండు వాక్యాలుగా విభజించడానికి వీలుండదు.

© SCERT not to be republished

- రెండో వాక్యంలో 'చూస్తూ' అనే ఒక అసమాపక క్రియ, 'తింటుంది' అనే ఒక సమాపక క్రియ ఉన్నాయి కదా! ఇలా ఒకటి లేక అంతకన్నా ఎక్కువ అసమాపక క్రియలు ఉండి తప్పనిసరిగా ఒకే ఒక సమాపక క్రియఉన్న వాక్యాలను **'సంశ్లిష్ట వాక్యాలు'** అంటారు.
- మూడో వాక్యంలో 'చూసింది, తిన్నది' అనే రెండు సమాపక క్రియా పదాలు ఉన్నాయి. ఇలా రెండు అంతకంటే ఎక్కువ సమాపక క్రియాపదాలు కలిగి, స్వతంత్ర వాక్యాలుగా ఉన్న వాక్యాలను **'సంయుక్త వాక్యాలు'** అంటారు.

**ఆ) కింది వాక్యాలను చదవండి. సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను గుర్తించండి.**

1. లలిత పాట పాడింది. ........................
2. శారద టిఫిన్ తిన్నది. కాఫీ తాగింది. ........................
3. బలరాం సంతకు వెళ్ళి, కూరగాయలు తెచ్చాడు. ........................
4. వివేకానందుడు షికాగోలో ఉపన్యసించాడు. ........................
5. సౌజన్య చాలా తెలివైనది, చురుకైనది. ........................
6. రాజు నరహరిని డబ్బులు అడిగి, తీసుకున్నాడు. ........................
7. ఆవులు గట్టు ఎక్కి, గడ్డి మేశాయి. ........................
8. కృష్ణ బాగా చదివాడు. మంచి పేరు తెచ్చుకున్నాడు........................

©SCERT not to be republished

## ప్రాజెక్టు పని

వార్తాపత్రికలు, పుస్తకాలు, ఇంటర్నెట్ ... వంటి వాటి ఆధారంగా 'జ్యోత్స్న' లాంటి వారు సాధించిన విజయాల గురించి సేకరించండి. వారిగురించి మీ తరగతిలో చెప్పండి. వారి ద్వారా మనం ఏం నేర్చుకోవాలో, ఎలా స్ఫూర్తి పొందాలో తెలపండి.

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | జ్యోత్స్న గురించి సొంతమాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | లేఖలను ధారాళంగా చదవగలను. అర్థం చేసుకోగలను. | ఔను/కాదు |
| 3. | జ్యోత్స్న లాగా పట్టుదలతో నేను సాధించాలనుకొన్న విషయాలను సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | నా అనుభూతులను తెలుపుతూ జ్యోత్స్నకు లేఖ రాయగలను. | ఔను/కాదు |

**చదువురానివారికి చదువు నేర్పడం, వికలాంగులకు సాయపడటం, తోటివారికి అన్నదానం చేయడమనేదే దేవుడి పూజలు.**
**- జ్యోతిరావుపులె**

చదువు ఆనందించు

# సూక్ష్మబుద్ధి

ఓ మారుమూల గ్రామంలో ముగ్గురు అన్నదమ్ములు ఉండేవారు. వారికి ఏ ఆస్తి లేదు. కేవలం తమ సూక్ష్మబుద్ధితో, పరిశీలనా శక్తితో తెలివిగా పొట్టపోసుకుంటున్నారు. తమ తెలివితేటలను రాజుగారి ముందు ప్రదర్శించి, ఆయనను మెప్పించి కొలువులో ఏవైనా ఉద్యోగాలు సంపాదించాలన్న ఆలోచన వారికి కలిగింది.

వెంటనే వాళ్ళు రాజధాని నగరం బయలుదేరారు. మధ్యాహ్నం వరకు నడచి దారిపక్కనున్న ఒక కొలను దగ్గర చెట్టుకింద విశ్రాంతి తీసుకొంటున్నారు. అంతలో గుర్రం మీద ఒక వ్యాపారి అక్కడికి వచ్చాడు. అతడు అన్నదమ్ముల వంక చూస్తూ "మీరు నా ఒంటెను చూశారా?" అని అడిగాడు.

వెంటనే అన్నదమ్ముల్లో మొదటివాడు "అది చాలా పెద్ద ఒంటె కదూ!" అన్నాడు. "దానిమీద ఒక ఆడమనిషి, చిన్న బిడ్డా ఎక్కి ఉన్నారు కదూ!" అన్నాడు రెండోవాడు. "దాని కుడికన్ను గుడ్డిది కదూ!" అన్నాడు మూడోవాడు.

వ్యాపారి అవునని వెంటనే గుర్రం దిగివచ్చి "మీరు నా ఒంటెను చూశారు కదా! దానిమీద ఉన్నవారు నా భార్యా, నా కూతురూను. దయచేసి ఒంటె ఎటువైపు వెళ్ళిందో చెప్పండి." అని అడిగాడు.

"మేము నీ ఒంటెను చూడలేదు. కానీ కాస్త వేగంగా ఇటువైపు వెళితే అది మీకు దొరకవచ్చు" అన్నారు అన్నదమ్ములు.

"మీరు అబద్ధం చెబుతున్నారు. మర్యాదగా నా ఒంటెను, నా భార్యా బిడ్డను ఎక్కడ దాచారో చెప్పండి. లేదంటే మీమీద రాజుగారికి ఫిర్యాదు చేస్తాను?." అంటూ వ్యాపారి గద్దించాడు.

అన్నదమ్ములు ఏమాత్రం తొణక్కుండా "మా పరిశీలనా శక్తితో గమనించిన విషయాలను మాత్రమే నీతో చెప్పాం. కావాలంటే నీ వెంట రాజుగారి సమక్షానికి రావడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు" అన్నారు.


వ్యాపారి అన్నదమ్ములను రాజుగారి ముందు నిలబెట్టి జరిగింది చెప్పాడు.

రాజుగారు అన్నదమ్ముల వంక చూస్తూ" ఒంటెను చూడకుండా దానికి సంబంధించిన వివరాలన్నీ ఎలా చెప్పగలిగారు?" అని అడిగారు.

"మాకున్న సూక్ష్మబుద్ధితో పరిశీలించి, ప్రతి విషయాన్ని తెలుసుకోగలం మహారాజా!" అన్నారు అన్నదమ్ములు.

రాజు కుతూహలం ఆపుకోలేక "ఒంటెను కళ్ళతో చూడకుండా దాని వివరాలు ఎలా చెప్పగలిగారు?" అని అడిగారు.

"దారిలో పాదాల గుర్తులను బట్టి, అవి భూమిలో దిగబడిన స్థాయిని బట్టి ఆ దారిలో ఒక భారీ ఒంటె వెళ్ళిందని గుర్తించాం. ఒకచోట ఒంటె కూర్చున్న గుర్తులు, దానిమీదినుంచి ఒక స్త్రీ, చిన్న బిడ్డా కిందికి దిగినట్లుగా వాళ్ళ పాదాల గుర్తులూ ఉన్నాయి." అన్నారు అన్నదమ్ములు.



"అంతా బాగానే ఉంది కానీ ఆ ఒంటెకు కుడి కన్నే కనబడదని ఎలా చెప్పగలిగారు?"

"దారి పొడవునా ఆ ఒంటె ఎడమవైపున ఉన్న గడ్డి పరకలను మాత్రమే కొరుకుతూ వచ్చింది. దాంతో దానికి కుడి కన్ను కనిపించదని అర్థమైంది."

సభ కరతాళ ధ్వనులతో మారుమోగింది. రాజుగారు అన్నదమ్ముల వంక సంభ్రమంగా చూస్తూ "మీ సూక్ష్మబుద్ధి అమోఘమైంది. మీరు అసాధారణ ప్రతిభావంతులు" అంటూ వారికి తన కొలువులో తగిన ఉద్యోగాలిచ్చాడు.

© SCERT not to be republished

మూడో యూనిట్


# 9. సీతాకోకచిలుకలు

కింది చిత్రం చూడండి.



### ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- చిత్రంలో ఏమేమి ఉన్నాయి. వీటిని ఎక్కడెక్కడ చూశారు?
- మీకు ఇష్టమైన పక్షి గురించి చెప్పండి.
- రంగు రంగుల పక్షులను చూస్తుంటే మీకు ఏమనిపిస్తుంది?



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.





సీతాకోకచిలుకలు చూడు
ఎన్నో రంగుల రెక్కలు చూడు
సూర్యుని తెల్లని కాంతిని మరిగే
నింగి లోతుల నీలాలద్దీ
ఏడూ రంగుల ఇంద్రధనుస్సులో
పొరలీ కరగీ జలకాలాడీ
ఇన్ని రంగులూ తెచ్చుకొన్నవో!

పచ్చని రంగుల గన్నేరులతో
ఎర్రని రంగుల కరవీరంతో
కనక చేలముల కనకాంబరతో
మెత్తని లాలిమ గులాబిపూలతో
ఎన్నో రంగుల పూల చెలిమితో
ఎన్నో రంగుల రెక్కల దాల్చెనో

కన్నులకెంతో విందొనరించే
శోభల కూర్చే సీతాచిలుకలు
సీతాకోకచిలుకల రంగులు
మనిషి కుంచెతో వేయజాలనివి!
చూచిన కన్నులకెన్నో వెలుగులు ....

ఆవంతైనా విశ్రమించకే
చంచలమై కదలాడును నింగిని!
సీతమ్మనె అవి వెదకుచుందునో -
మనసున బెంగల మరిమరి కుందునో
నడయాడే హరివిల్లు సొగసులవి
గలగల దుమికే ధారల సొరులు
సీతాకోకచిలుకకు మారులు!

© SCERT not to be republished





సీతాకోకచిలుకల చూడు
ఎన్నో రంగుల రెక్కల చూడు
అంతే-పట్టగ అ(ర్రట్లాడకు
మోటు వేళ్ళతో పట్టుకుంటివో
ముక్క ముక్కలై రాలును రెక్కలు ...
రెక్కలెంతగా నాజూకో-మరి
ముట్టిన వెంటనె పోవును రంగులు!

ఆకసమంటే ఎగిరే రెక్కలు
తరగని బింకం కనులకు చాలదె?
అందాలొలికే రంగులు చాలవె?
ముట్టుకు ముట్టుకు ఆ సుకుమారిని
మిన్నుల నెడబాయని చెలికత్తెని!
ఇంద్రధనువులై ఎగిరే చిలుకలు ...
పూలరంగులై ఎగిరే తరగలు ...

సీతాకోకచిలుకలు చూడు!
ఎన్నో రంగుల రెక్కలు చూడు!
గుండె నిండుగా కొత్త వెలుతురులు
కదలాడే ఒక అద్భుత దృశ్యం ....
అదే చాలు పదివేల సంతసము!
పసి మనసులలో ప్రసవ సౌరభము!!

- ఆవంత్స సోమసుందర్

© SCERT not to be republished

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



అ) గేయాన్ని రాగంతో పాడండి. అభినయంచేయండి.

ఆ) ఈ గేయం దేనిగురించి ఉంది? కవి ఏమని చెప్పాడు?

ఇ) రంగు రంగుల సీతాకోకచిలుకలు, పూలను చూసినప్పుడు మీకేమనిపిస్తుంది?

ఈ) సీతాకోకచిలుకను చూస్తే ఎంతో అందంగా ముద్దుగా ఉంటుంది కదా! ప్రకృతిలో ఇలా చూడగానే మనకు ఆనందం కల్గించేవి ఇంకా ఏమేమి ఉంటాయి?

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం




అ) గేయం చదవండి. సీతాకోకచిలుకలు ఎవరి నుండి ఏమేమి తెచ్చుకున్నాయో రాయండి.

| ఎవరి నుండి | ఏమి తెచ్చుకుంది? |
|---|---|
| | |

ఆ) కవి సీతాకోకచిలుకను గేయంలో వేటివేటితో పోల్చాడో రాయండి.

ఉదా: ఇంద్రధనుస్సు .................... ....................

.................... .................... ....................



ఇ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. సీతాకోకచిలుకలకు రంగులెలా వచ్చాయని కవి గేయంలో చెప్పాడు?
2. సీతాకోకచిలుకలను ఎలా పిలవాలి?
3. సీతాకోకచిలుకల రంగులు ఎలాంటివి?
4. సీతాకోకచిలుకల సొగసులు ఎలా ఉన్నాయని కవి చెబుతున్నాడు?
5. సీతాకోకచిలుకలను ఎందుకు పట్టుకోగూడదు?

ఈ) కింది పేరాను చదవండి. వీలైనన్ని ప్రశ్నలను తయారు చేయండి.

ప్రకృతిలో అందమైనవి పువ్వులు. వాటికి సరిజోడి అన్నట్లు రంగురంగుల్లో సీతాకోకచిలుకలు అలరిస్తాయి. సీతాకోకచిలుకలు పచ్చదనం ఉన్న చోటనే మనుగడ సాగిస్తాయి. సీతాకోకచిలుకలకు రుచిచూసే అవయవ నిర్మాణం కాళ్లలో ఉంటుంది. ఇవి పువ్వులపై వాలి మకరందాన్ని పీల్చుకుంటాయి. సీతాకోకచిలుకలు ప్రధానంగా గులాబీ, ఎరుపు, పసుపు రంగుల్లో ఉండే పూలకు ఆకర్షితమవుతాయి.

© SCERT not to be republished

ప్రపంచంలో మొత్తం ఇరవైఐదువేల రకాల సీతాకోకచిలుకలు ఉన్నాయి. మన దేశంలో పదిహేనువందల రకాలు, మన రాష్ట్రంలో రెండువందల రకాలు ఉన్నాయి. మన దేశంలో విభిన్న రకాల శీతోష్ణస్థితులు ఉండడం వల్ల వివిధ రంగుల్లో, వివిధ పరిమాణాలలో సీతాకోకచిలుకలు దర్శనమిస్తాయి.

**ఉదా:** 1. సీతాకోకచిలుకలు ఎక్కడ మనుగడ సాగిస్తాయి?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



అ) సీతాకోకచిలుక గురించి మీ సొంత మాటల్లో రాయండి.

ఆ) సీతాకోకచిలుకను ఇంద్రధనుస్సుతో పోల్చారు కదా! ఇలా ఎందుకు పోల్చి ఉంటారు?


ఇ) సీతాకోకచిలుకల రంగును మనిషి కుంచెలతో వేయలేమని కవి చెప్పారు కదా! అలా ఎందుకు అని ఉంటాడు?

ఈ) "సీతాకోకచిలుకలను చూడడం ఒక అద్భుత దృశ్యం" అని కవి మాటలను సమర్థిస్తూ ఐదు వాక్యాలు రాయండి.

© SCERT not to be republished

## IV పదజాలం







అ) సీతాకోకచిలుకకు, రామచిలుకకు మధ్య పోలికలు, భేదాలు రాయండి.

| | సీతాకోకచిలుక | రామచిలుక |
|---|---|---|
| పోలికలు | **ఉదా:** రెక్కలుంటాయి | రెక్కలుంటాయి |
| | ..................... | ..................... |
| | ..................... | ..................... |
| | ..................... | ..................... |
| భేదాలు | **ఉదా:** ఇది కీటకం | ఇది పక్షి |
| | ..................... | ..................... |
| | ..................... | ..................... |
| | ..................... | ..................... |



ఆ) "ఇంద్రధనుస్సు" ను హరివిల్లు అని కూడా అంటారు. "ఇంద్రధనుస్సు" కు సంబంధించిన పదాలు రాయండి.

**ఇ) కింది పట్టికలో రంగుల పేర్లు రాయండి. ఆ రంగులతో ఉండే వస్తువులు / పదార్థాలు / పూల పేర్లు రాయండి.**

| | రంగు | పూలు | వస్తువులు/పదార్థాలు |
|---|---|---|---|
| **ఉదా:** | తెలుపు | మల్లె, లిల్లీ | పాలు, కాగితం, సున్నం |

**ఈ) ప్రకృతిలో చాలావాటిని వర్ణించి చెప్పేటప్పుడు రకరకాల పదాలను ఉపయోగించి వర్ణిస్తుంటారు. అలాంటి వర్ణన పదాలను రాయండి.**

**ఉదా:** నల్ల నల్లని మబ్బులు

రంగు రంగుల సీతాకోకచిలుకలు

## V సృజనాత్మకత



**అ) కింది సూచనల ఆధారంగా చిత్రాన్ని గీయండి. రంగులు వేయండి. చిత్రం గురించి, చిత్రంలోని వాటిని వర్ణిస్తూ రాయండి.**

ఒక పూలతోట. తోటలో రకరకాల పూల మొక్కలు. పూలపై వాలిన సీతాకోకచిలుకలు. ఎగురుతున్న పక్షులు. పచ్చని పచ్చిక. పక్కన చెట్లు, చెట్ల పై రామచిలుకలు.

**ఆ) "సీతాకోకచిలుకలు చూడు**

**ఎన్నో రంగుల రెక్కలు చూడు" .......... గేయం చదివారు కదా!**

గేయంలోని పదాలు ఆధారంగా రామచిలుకల గురించి గేయం/కవిత రాయండి. దాని బొమ్మ గీయండి.


## VI ప్రశంస



అ) సీతాకోకచిలుకల వంటివి మన ప్రకృతిలో ఎన్నో కీటకాలు, పక్షులు ఉన్నాయి. సెల్‌ఫోన్ టవర్లు, అధికవేడి, మనం వాడే పురుగు మందులు, వాతావరణ కాలుష్యం వల్ల ఇవన్నీ నశించి పోతున్నాయి. వేసవి కాలంలో పక్షులకు తాగడానికి నీరు దొరకక చనిపోతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని పక్షులు, కీటకాలను కాపాడటానికి మీరైతే ఏం చేస్తారు? సొంతమాటల్లో రాయండి.

© SCERT not to be republished

## VII భాషను గురించి తెలుసుకుందాం



అ) కింది క్రియాపదాలు ఆధారంగా వాక్యాలు రాయండి. అవి ఏ వాక్యాలో రాయండి.

(నడిచారు, పరిచింది, అమ్ముతున్నారు)

..............................................................................................

..............................................................................................

ఆ) కింది క్రియాపదాలు ఆధారంగా సంశ్లిష్ట వాక్యాలు రాయండి.

1. పడి, మొలకెత్తాయి   2. కోసి, అల్లింది   3. తెచ్చి, పరిచాడు

..............................................................................................

..............................................................................................

ఇ) కింది క్రియాపదాలు ఆధారంగా సంయుక్త వాక్యాలు రాయండి.

(చూసింది, నవ్వింది), (పరీక్షించాడు, చేశాడు) (కొన్నాడు, అమ్మాడు)

..............................................................................................

..............................................................................................

© SCERT not to be republished

### ప్రాజెక్టు పని

దినపత్రికలలో, వారపత్రికలలో ప్రచురించే అందమైన, ప్రకృతి సంబంధమైన చిత్రాలను అంటే సూర్యోదయం, సూర్యాస్తమయం, తోటలు, సెలయేళ్లు, పక్షులు, వాగులు వంటి వాటి చిత్రాలను సేకరించండి. వాటిని గురించి వర్ణిస్తూ రాయండి. దాని గురించి తరగతి గదిలో మాట్లాడండి, ప్రదర్శించండి.

### నేనివి చేయగలనా?


| | | |
|---|---|---|
| 1. | గేయాన్ని రాగంతో పాడగలను. అభినయం చేయగలను. | ఔను/కాదు |
| 2. | గేయాన్ని ధారాళంగా చదవగలను. సీతాకోకచిలుకలను కవి వేటితో పోల్చాడో చెప్పగలను. | ఔను/కాదు |
| 3. | సీతాకోకచిలుకల గురించి సొంత మాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | గేయంలోని పదాల ఆధారంగా గేయం/కవితలను రాయగలను. | ఔను/కాదు |

సమస్త ప్రాణికోటి యెడల దయ, కరుణ కలిగి ఉండటమే నిజమైన ధర్మం. నిజమైన మతం.
- గౌతమ బుద్ధుడు

చదువు

ఆనందించు

# ఎండ



పొద్దున పొద్దున వచ్చే ఎండ
శిఖరాలను మెరిపించే ఎండ
ఇంటికప్పుపై పరిచిన ఎండ
నేలను అంతా నిండిన ఎండ

చెట్లూ, చేమలు, మైదానాల్లో
పొలాలు, ఇసుకా, పంటచేలపై
కొమ్మ కొమ్మపై ఆగుతు తూగుతు
అలసీ సొలసిన మత్తులో ఎండ!

చలిలోనూ నులివెచ్చని ఎండ
ఎండకాలమున మండే ఎండ
ఒంటిని మాడ్చే కాల్చే ఎండ
మబ్బుల మాటున సిగ్గరి ఎండ

పువ్వు పువ్వులో – మొగ్గ మొగ్గలో
మెల్లమెల్లగా వీథి వీథిలో
కిటికీపై అది ఎప్పుడు వాలెనో
ఇంటిలో దూరెను తుంటరి ఎండ

నడకలు మాని కిటికీ తెరిచిన
ఏమీ చెప్పక – తిరిగిన, ఊగిన
గాలిలోని ప్రతి ఔషధ కణమున
తనకు తానుగా ఒదిగిన ఎండ!


సూర్యుడు రాగా – వచ్చెను ఎండ
దినమంతా తన గోడుతో ఎండ
చీకటిపడగా ఎటు నిద్రింతని
అలసి సొలసి అటుపోయిన ఎండ!

© SCERT not to be republished

మూడో యూనిట్


# 10. నీడఖరీదు

కింది చిత్రం చూడండి.




## ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- చిత్రంలోని వ్యక్తులు ఏమి మాట్లాడుకుంటున్నారు?
- చిత్రం చూసి కథను ఊహించి చెప్పండి?
- రెండవ చిత్రంలో కొబ్బరికాయను పట్టుకొని వేలాడుతున్న వ్యక్తిని చూస్తే మీకేమనిపిస్తుంది? ఆయన ఎలాంటి వాడై ఉంటాడు?



### పిల్లలూ! ఇలా చేయండి.

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

ఈ చెట్టు నాది. ఈ చెట్టు నీడ కూడా నాదే ! అన్న ముసలాయనతో "క్షమించండి, ఈ చెట్టు నీడను నాకు అమ్ముతారా?" అని నమ్రతగా శివయ్య అడిగాడు. ఇంతకీ శివయ్య ఎవరు? చెట్టు నీడను ముసలాయన అమ్మాడా? నీడను కూడా అమ్ముకునే వారుంటారా? ఏం జరిగిందో తెలుసుకోవాలని ఉందా? ఐతే పాఠం చదవండి. మీకే తెలుస్తుంది.

ఆ రోజు బడికి సెలవు కావడంతో పిల్లలందరూ ఊరి చివర చింతచెట్టు కింద ఆటలాడుకుంటున్నారు. కొందరు చెట్టు ఎక్కుతూ దిగుతూ కోతికొమ్మచ్చి ఆడుతున్నారు. "చింతకాయ పులుపు చెట్టెక్కి దులుపు" అంటూ చింతచెట్టు కొమ్మల్ని ఊపుతూ చింతకాయలు రాలుస్తున్నారు మరికొందరు.



చింతచెట్టుకు దగ్గరగా పెద్ద ఇల్లు ఉంది. ఆ ఇల్లు పిసినారి పాపయ్యది. పిల్లికి బిచ్చం పెట్టని పాపయ్యకు ఎవరి పొడా గిట్టదు. ఎప్పుడూ రుసరుసలాడుతూ ముఖం చిట్లించుకుంటూ ఉంటాడు. ఈ విషయం అక్కడ ఆడే పిల్లలకు కూడా తెలుసు. అందుకే పిసినారి పాపయ్య కంట పడకుండా ఆడుకుంటూనే ఉంటారు. ఆ రోజూ అదే తంతు. పిల్లల కేరింతలు విన్నాడో లేదో "ఎవర్రా అది, నా చింతచెట్టు కిందే ఆడతారా? ఎంత ధైర్యం మీకు? ఉండండి! మీ పని చెప్తాను" అని అరుస్తూ పిల్లల్ని పట్టుకోవడానికి పరిగెత్తాడు. పిల్లలు దొరికితేనా? ఈయన మాట వినిపించిందో లేదో పిల్లలంతా కాలికి బుద్ధిచెప్పారు.

ఇలా ఉండగా ఒకరోజు, పొరుగూరు నుండి శివయ్య అనే యువకుడు ఆ దారిన వెళ్తూ అలసటతో చింతచెట్టు కింద కూర్చున్నాడు. ఆ రోజు కూడా యథావిధిగా పిల్లలు రావడం, ఆడుకోవడం, పిసినారి పాపయ్య నిప్పులు చెరుగుతూ పరుగెత్తుకొని రావడం జరిగింది. పిల్లలంతా పరుగో! పరుగు!

పాపయ్య చెట్టు కిందకు వచ్చాడు. పిల్లలు లేరు. కానీ చెట్టు నీడలో శివయ్య కన్పించాడు. అలిసిపోయి ఉన్నాడేమో శివయ్యకు కునుకు పట్టింది. నిద్రిస్తున్న శివయ్య పాపయ్యను గమనించలేదు.

పాపయ్య కోపంతో “ఎవర్రా నువ్వు? పరాయి వాళ్ళ చెట్టు నీడలో కూర్చుని కునుకు తీస్తున్నావ్! లే! లేచిపో!” అని గట్టిగా కేకలేస్తూ అరిచాడు.

ఆ కేకలకు శివయ్య తుళ్ళిపడి లేచాడు.

“అయ్యా! క్షమించండి. ఏమంటున్నారు? మరోసారి సెలవియ్యండి!” అన్నాడు.

“ఏం! నేనన్నది చెవికెక్కలేదా? పరాయివాళ్ళ చెట్టు నీడలో హాయిగా కూర్చుని కునుకుతీస్తున్నావ్!” అని అన్నాడు.

శివయ్యకు ముసలాయన ప్రవర్తన విచిత్రంగా అనిపించింది. “పరాయివాళ్ళ చెట్టు నీడేమిటండీ?” అని అడిగాడు శివయ్య.

“ఇది నా చెట్టు. ఈ నీడ నా చెట్టు నీడ! ఊ... నడు .... బైటికి నడు” అంటూ ముసలాయన మళ్ళీ శివయ్యమీద గట్టిగా అరిచాడు.

“ఈ చెట్టు ఊరందరిదీ కదా!” అన్నాడు యువకుడు.

“ఎవరన్నారామాట? మా తాత ఈ చెట్టును వేశాడు. అంచేత ఈ చెట్టు నాది. ఇహ ఇక్కణ్ణించి దయచెయ్యి!” అంటూ ముసలాయన కస్సుమన్నాడు. “అదేమిటండీ! దారిన వెళ్తూ సేదదీరడం తప్పా! రోడ్డు పక్కన చెట్లు బాటసారులకు నీడనిస్తాయనే కదా! మహానుభావులు చెట్లను నాటేది. మీరు మరీ విచిత్రంగా మాట్లాడుతున్నారు!” అని శివయ్య విస్తుపోతూ అన్నాడు.

ఈ మాటలు పిసినారి పాపయ్య చెవికెక్కితే కదా! “ఇదేమీ నీ జాగీరు కాదు. ఉత్తిపుణ్యానికే చెట్టు కింద కూర్చుని ఇంకా నాకే నీతులు చెబుతున్నావా? లే... లే! నడు! మర్యాదగా ఇక్కడినుంచి వెళ్ళు!” అని ముసలాయన అన్నాడు. ఈ మాటలకు శివయ్య మనస్సు చివుక్కుమంది. ముసలాయన ఎలాంటివాడో అర్థమైంది. ఎలాగైనా పిసినారి పాపయ్యకు బుద్ధి చెప్పాలనుకున్నాడు.

“అలాగా ఈ చెట్టు మీదాండీ! క్షమించండి. ఈ చెట్టు నీడను నాకు అమ్ముతారా? నేను కొనుక్కుంటాను.” అని శివయ్య ఎంతో నమ్రతగా ముసలాయనని అడిగాడు.

ఈ మాటలు విన్న పిసినారి పాపయ్యకు శివయ్య అమాయకుడిలా కన్పించాడు. “చెట్టు నీడను కొనుక్కుంటావా? ఓ... తప్పకుండా అమ్ముతాను, ఎంత ఇస్తావు?” అని వస్తున్న నవ్వును లోలోపలే అణుచుకుంటూ అన్నాడు పాపయ్య.

“మీరే చెప్పండి” అని శివయ్య అన్నాడు.

“వెయ్యి రూపాయలిస్తావా? ఈ చెట్టు నీడ నీదైపోతుంది” అన్నాడు పాపయ్య”. “అమ్మో! వెయ్యి రూపాయలే! చాలా ఎక్కువ” అని అన్నాడు శివయ్య!. “నీడంటే మాటలా? ఎండ తీవ్రంగా ఉందని పడుకున్నావు. ఎంత చల్లగా, హాయిగా ఉంటుందో చూశావా మరి! వెయ్యి రూపాయలిస్తేనే నీడ నీదవుతుంది. లేకుంటే లేదు. ఎంత మంది ఉన్నారో ఈ నీడను కొనుక్కోడానికి” అని పిసినారి పాపయ్య అన్నాడు.


సరేనని శివయ్య వెయ్యి రూపాయలు తీసి ముసలాయనకు ఇచ్చాడు. నవ్వుతూ వెళ్ళి చెట్టు నీడలో పడుకున్నాడు.

© SCERT not to be republished

“చెట్టు నీడను కొనుక్కునే తెలివితక్కువ దద్దమ్మ కూడా ఒకడుంటాడా?” అని తన అదృష్టానికి తానే మురిసిపోతూ ఇంట్లోకి వెళ్ళాడు పాపయ్య.

కాసేపటికి సూర్యుడి దిశ మారింది దాంతో పాటే చెట్టు నీడ కూడా జరగసాగింది. అలా.... అలా... ఆ నీడ ముసలాయన ఇంటి ఆవరణ వరకు జరిగింది. కాసేపయ్యాక శివయ్య లేచి నిల్చున్నాడు. చెట్టు నీడ పడ్డ ఇంటి ఆవరణలోకి వెళ్లి కూర్చున్నాడు.

“శివయ్యా! ఇక్కడికి వచ్చావేమిటి? ఇలా



ఇంకొకరి ఇంటి ఆవరణలోకి వచ్చి కూర్చోవచ్చా? నడు .... అవతలికి నడు” అన్నాడు ముసలాయన.

“అదేమిటండీ అలా అంటారు! నేను మీరు అమ్మిన చెట్టు నీడలోనే కూర్చున్నాను!” అన్నాడు శివయ్య.

పిసినారి పాపయ్యకు కోపం నషాళానికి అంటింది. “నా ఇంటి ఆవరణలోకి రావద్దన్నానా! ఎన్నిసార్లు చెప్పాలి? పో... అవతలికి!” ముసలాయన మళ్లీ గట్టిగా కేకలు వేశాడు.

“మీరే బయటకు వెళ్లాలండీ! మీరు ఈ చెట్టు నీడను నాకు అమ్మారు కదా! ఆ నీడ ఎక్కడ పడితే అక్కడికి వెళ్లి కూర్చోడానికి నాకు హక్కు ఉంది.” ఎంతో నెమ్మదిగా చెప్పాడు శివయ్య.

ముసలాయన తెల్లబోయాడు. లోలోపల సణుక్కుంటూ, గొణుక్కుంటూ విసవిసా ఇంట్లోకి వెళ్లాడు.

శివయ్య చెట్టు నీడతో పాటు జరుగుతూ ముసలాయన ఇంటి వరండాలోకి వెళ్ళాడు. ఆ తర్వాత చావడి గదిలోకి ప్రవేశించాడు.

“పో! బయటికి పో! నా ఇంట్లోంచి బైటికి పో”! అంటు గట్టిగా చిందులుతొక్కాడు ముసలాయన.

శివయ్య చిరునవ్వులు చిందిస్తూ కూర్చున్న చోట నుంచి లేవలేదు. చెట్టునీడ దిశ మారి పాపయ్య తోట మీద కూడా పడింది. శివయ్య తోటలోకి వెళ్లి నీడ పడిన చోటులోని కూరగాయలన్నీ కోసుకోవడం మొదలు పెట్టాడు.

ఇది చూసి పిసినారి పాపయ్య లబోదిబోమని కన్నీరుమున్నీరుగా ఏడ్వడం మొదలు పెట్టాడు. మర్నాడు, ఆ తర్వాత రోజు, ఇలా ప్రతిరోజు శివయ్య చెట్టు నీడతో పాటు జరుగుతూ పడుకుంటూ, కూర్చుంటూ పిసినారి పాపయ్య ఇంట్లోకి వెళ్తూనే ఉన్నాడు. తోటలోని కూరగాయలు కోసుకొని వెళ్తూనే ఉన్నాడు.

ఆఖరికి ఓ రోజున ముసలాయన ఇక ఉండబట్టలేక “బాబూ! నా చెట్టు నీడని నాకు ఇచ్చెయ్యి” నీ వెయ్యి

రూపాయలు నీకు ఇచ్చేస్తాను" అని అన్నాడు.



"ఇంత చక్కటి చెట్టు నీడని అమ్మే ఉద్దేశం నాకు లేదండీ! నా నీడ దగ్గరికి మీరు రాకండి. వెళ్లిపోండి ఇక్కణ్ణించి!" అన్నాడు శివయ్య. ఇక లాభం లేదనుకొని పాపయ్య ఊళ్లోవాళ్ళకు ఈ విషయం చెప్పాడు. ఇది విన్న ఊరి వారందరూ పిసినారి పాపయ్యకు తగిన శాస్తి జరిగిందన్నారే తప్ప ఎవ్వరూ సహాయం చేయడానికి ముందుకు రాలేదు.

"పిసినారి గారూ! చెట్టునీడ అమ్మకందారూ! ఇంకేదన్నా చెట్టునీడ ఉంటే మాక్కూడా అమ్ముతారా? మేమూ కొనుక్కుంటాం" అంటూ ఆట పట్టించడం మొదలు పెట్టారు.

చివరకు పిసినారి పాపయ్య ఊరిపెద్దకు ఫిర్యాదు చేశాడు. ఊరిపెద్ద శివయ్యను పిలిపించాడు. శివయ్య జరిగిందంతా వివరించాడు. శివయ్య చేసిన పని సరైనదేనని తీర్పు చెప్పాడు ఊరిపెద్ద.

తీర్పు విన్న పిసినారి పాపయ్య తన తప్పు తెలుసుకొని పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. ఇది చూసి పిసినారి పాపయ్యలో మార్పు వచ్చిందని గ్రహించిన శివయ్య "పాపయ్య గారూ! చెట్టూ మీదే! నీడా మీదే! మీలో మార్పు కోసమే ఇదంతా చేశాను" అని అన్నాడు.



పిసినారి పాపయ్య శివయ్యకు వెయ్యి రూపాయలు తిరిగి ఇచ్చివేసి కృతజ్ఞతలు చెప్పాడు. అప్పటి నుండి చెట్టు నీడలో ఎవరు ఎప్పుడు కూర్చున్నా ఏమీ అనేవాడు కాదు. తాగడానికి నీళ్ళిచ్చేవాడు, భోజనం కూడా పెట్టేవాడు. పిల్లలందరూ ఆటలాడుతుంటే తనూ వారితో కలిసి ఆడుతూ పిల్లవాడైపోయేవాడు పాపయ్య.

© SCERT not to be republished

# ఇవి చేయండి

## I    వినడం, ఆలోచించి చెప్పడం



అ) పాఠంపేరు వినగానే మీకేమనిపించింది? చదివిన తరవాత మీకెలా అనిపించింది?

ఆ) పాఠంపేరు కథకు తగినట్లుగా ఉన్నదా? ఎందుకు? మీరైతే ఏ పేరు పెడతారు?

ఇ) పిల్లలు ఆడుకుంటుంటే పాపయ్య వాళ్ళను తరిమేశాడు కదా! పాపయ్య లాంటి వాళ్లు మీకెదురైన సందర్భాలను గురించి చెప్పండి.

ఈ) పిసినారి పాపయ్య మాటలకు శివయ్య మనస్సు చివుక్కుమంది కదా? "మనస్సు చివుక్కుమంది" అంటే ఏమిటి? ఈ వాక్యాన్ని ఎప్పుడెప్పుడు ఎలా వాడతారో చెప్పండి. ఇతరుల మనస్సు చివుక్కుమనకుండా ఉండాలంటే మనం ఎదుటివారితో ఎలా ప్రవర్తించాలి?

ఉ) ఈ కథను సొంతమాటల్లో చెప్పండి.

## II    ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



అ) **పిసినారి పాపయ్య ప్రవర్తనను, స్వభావాన్ని తెలిపే పదజాలాన్ని పాఠంలో గుర్తించండి. ఆ పదాలున్న వాక్యాలను చదవండి.**

**ఉదా:** 1. పిల్లికి బిచ్చం పెట్టని      2. ఎవరి పొడా గిట్టని

ఆ) **కింది పేరా చదవండి. ఖాళీలలో పదాలను ఊహించి రాయండి.**






నవ్వు మనిషి ఆరోగ్యానికి సూచిక. నవ్వడం ఒక భోగం, నవ్వక పోవడం ఒక ................ అన్నారు. అందుకే ................తూ బతకాలిరా తమ్ముడూ అన్నాడో కవి. అంటే పెద్దగా ................ కాదు. వెకిలిగా................ అంతకన్నా కాదు. నవ్వులో అనేక రకాలు ఉన్నాయి. చిరుహాసం, మంద ................, దరహాసం ఇలా ఎన్నో ................ ఉన్నాయి. సందర్భోచితంగా ................ వల్ల ప్రమాదం రాదు. అపార్థం చేసుకోరు. నవ్వు నాలుగు విధాలుగా ................ అనే సామెత కూడా ఉంది. ఒక్కొక్కప్పుడు ఈ ................ అనేక అనర్థాలకు దారితీస్తాయి. కాబట్టి వెకిలి ................ ఎగతాళి నవ్వులు పనికిరావు. ఎల్లప్పుడూ చిరు ................ చిందిస్తూ ఎదుటివారి మనస్సు నొప్పించకుండా ................ కాలంగడపాలి.

© SCERT not to be republished

ఇ) పాఠం చదివి కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. పిల్లల్ని చూసిన పిసినారి పాపయ్య ఏం చేశాడు?
2. శివయ్య మనస్సు ఎందుకు చివుక్కుమంది? ఏం చేయాలనుకున్నాడు?
3. పిసినారి పాపయ్య ప్రవర్తన చూసి శివయ్య ఏమనుకున్నాడు?
4. శివయ్య పిసినారి పాపయ్యకు ఎలా బుద్ధి చెప్పాడు?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



అ) పాపయ్యను అందరూ 'పిసినారి పాపయ్య' అనడం సరైనదేనా? ఎందుకు?

ఆ) పిసినారి పాపయ్య స్వభావం గురించి మీ సొంతమాటల్లో రాయండి.

ఇ) శివయ్యను "చెట్టునీడను కొనుక్కునే తెలివితక్కువ దద్దమ్మ" అని పిసినారి పాపయ్య అనుకున్నాడు కదా! దీనిమీద మీ అభిప్రాయం ఏమిటి?

ఈ) శివయ్య పిసినారి పాపయ్యకు బుద్ధిచెప్పాడు కదా! మీరైతే పాపయ్యకు ఎలా బుద్ధి చెబుతారో రాయండి.

ఉ) శివయ్యను సమర్థిస్తూ ఊరిపెద్ద ఇచ్చిన తీర్పు సరైందేనా? ఎందుకు?

ఊ) పిసినారి పాపయ్యలో మార్పు వచ్చిందని ఎలా చెప్పగలవు? దీనికి గల కారణం ఏమిటి?

## IV పదజాలం



అ) చింతచెట్టుకు సంబంధించిన పదాలు రాయండి. ఒక్కో పదాన్ని ఉపయోగించి వాక్యాలు రాయండి.

.................. ......................................................

ఆ) చింతకాయ పులుపు కదా! పుల్లగా ఉండే వాటిపేర్లు రాయండి.

................... ................... ...................

ఈ) ఎటు నుంచి చదివినా ఒకేలా ఉండే పదాలు రాయండి. వాటి ఆధారంగా వాక్యాలు రాయండి.

**ఉదా:** పులుపు .................. .................. ..................

ఉ) ఈ కింది పదాలను సొంతవాక్యాలలో రాయండి.

| | | |
|---|---|---|
| 1. పిల్లికి బిచ్చం పెట్టు | 2. రుసరుసలాడు | 3. ముఖం చిట్లించుకొని |
| 4. కాలికి బుద్ధి చెప్పు | 5. నిప్పులు చెరగు | 6. చెవికెక్కడం |
| 7. ఉత్తపుణ్యానికి | 8. చిందులు తొక్కడం | 9. నషాళానికంటడం |

© SCERT not to be republished

## V సృజనాత్మకత



అ) పాఠాన్ని సంభాషణల రూపంలో రాయండి. నాటకీకరణ చేయండి.

ఆ) పిల్లలు చింతచెట్టు కింద ఆటలాడుకునే సన్నివేశాన్ని, పాపయ్య తరిమికొట్టే సన్నివేశాన్ని వర్ణించి రాయండి. చిత్రాలు గీయండి.


## VI ప్రశంస



అ) శివయ్య ఎండలో తిరిగి అలసిపోయి చెట్టునీడకు వచ్చినపుడు చెట్టు చల్లని నీడనిచ్చి హాయినిచ్చింది కదా! ఆ నీడనిచ్చిన చెట్టు మేలును ప్రశంసిస్తూ రాయండి.

ఆ) నీడనిచ్చే చెట్ల పేర్లు రాయండి. వాటిని ఇతర భాషల్లో ఏమని పిలుస్తారో తెలుసుకొని రాయండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



అ) కింది వాక్యాలను చదవండి. క్రియాపదాల కింద గీత గీయండి.

1. పిల్లలు చెట్టు కింద ఆడుకొంటున్నారు. 2. శివయ్య నిద్రపోతున్నాడు.

3. శ్రీనాథుడు గొప్ప కవి. 4. అరకు లోయ అందమైనది.

1, 2 వాక్యాలకు, 3, 4 వాక్యాలకు గల భేదమేమిటి?

**3, 4 వాక్యాలలో క్రియాపదం లేకపోయినా పూర్తి అర్థాన్ని ఇస్తున్నాయి కదా! ఇలాంటి వాటిని 'క్రియారహిత' వాక్యాలు అంటారు.**

మరికొన్ని క్రియారహిత వాక్యాలు రాయండి.

**ఉదా:** 1. సీతయ్య అమాయకుడు.

2. మా ఊరు రామాపురం.

### ప్రాజెక్టు పని

పిల్లలూ! మీ గ్రంథాలయంనుంచి హాస్యకథలను సేకరించండి. చదవండి. మీకు నచ్చిన హాస్యకథను సొంతమాటల్లో రాసి, చిత్రాలు గీసి ప్రదర్శించండి.

### నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | ఈ కథను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | పాఠాన్ని ధారాళంగా చదవగలను. వ్యక్తుల స్వభావాన్ని తెలిపే వాక్యాలను పాఠంలో గుర్తించగలను. | ఔను/కాదు |
| 3. | కథను సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | సన్నివేశ చిత్రంగీసి రంగులు వేయగలను. దాని గురించి రాయగలను. | ఔను/కాదు |

భారతీయులుగా జీవించడం అలవరచుకోండి. స్వదేశీ భావనలు పెంచుకోండి.
- సరోజినీ నాయుడు

©SCERT not to be republished

మూడో యూనిట్

# 11. ప్రయత్నిస్తే...

కింది చిత్రం చూడండి.



© SCERT not to be republished

**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రంలోని పిల్లలు ఏమి చేస్తున్నారు?
- ఇలా మీరు తయారు చేసినవాటి గురించి చెప్పండి.
- మీరు తయారు చేసినవి ఎవరెవరికి చూపించారు. వారు ఏమన్నారో చెప్పండి.

**పిల్లలూ! ఇలా చేయండి.**



- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

**ఆ అమ్మాయి తపన బాగుంది. తను చేసినదాన్ని పదిమందికి చూపించాలనే ఆరాటం బాగుంది. తను అనుకున్నది పూర్తయ్యేంతవరకూ నిరీక్షించడం, ముందుకురావడం బాగుంది. ఇంతకూ ఆ అమ్మాయి ఎవరు? ఏం చేసిందో పాఠం చదవండి.**

క్లాసంతా ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారింది. బంట్రోతు ఏదో కాగితం తెచ్చి ఉపాధ్యాయుడికి అందించాడు. ఆయన ఆ కాగితాన్ని చదువుతున్నారు. పిల్లలందరూ అది ఏమై ఉంటుందో? అనే ఉత్కంఠతో చూస్తున్నారు. ఉపాధ్యాయుడు ఆ కాగితం మీద సంతకం పెట్టి ఇచ్చారు. పిల్లల వైపు చూశారు. పిల్లల వదనాలు చూసే సరికి ఆయనకు నవ్వు వచ్చింది.

"చూడండి. మన ఊరి ఉన్నతపాఠశాలలో పిల్లల ప్రతిభాపాటవాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో మీరు వేసే చిత్రాలుగానీ, మీరు తయారుచేసే బొమ్మలుగానీ పెట్టవచ్చు. అంతేకాదు ఇతర పాఠశాలల నుంచి కూడా అక్కడికి పిల్లలు వస్తారు. అలాగే ఆ రోజు ఆటల పోటీలు, పాటల పోటీలు, వ్యాసరచన పోటీలు కూడా ఉంటాయి. బహుమతులు ఇస్తారు. ఇంకా పిల్లల నాటికలుంటాయి. మీలో ఎవరికైనా ఆసక్తి ఉంటే వాటిలో పాల్గొనవచ్చు. మన బడినుంచి కూడా ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొంటారనే ఆలోచనతో మీకు ఈ విషయం తెలియజెయ్యమని కాగితం పంపించారు. అందరికీ అర్థమైంది కదా!" అన్నారాయన. ఇంటికి వచ్చిన శర్మిలకు ఉపాధ్యాయుడి మాటలే గుర్తుకువస్తున్నాయి. తనకు ఏదైనా చెయ్యాలనే కోరిక ఉంది. దేన్నైనా తయారు చేయాలంటే పదిహేను రూపాయల దాకా అవుతుంది. అమ్మను అడిగితే అంత డబ్బు ఇవ్వదు. మరి బొమ్మలు ఎలా తయారు చేయడం? శర్మిలను ఈ సమస్య పీడిస్తున్నది. పక్కింటి సునీత ఆ సమస్యను క్షణాల్లో తేల్చేసింది.



సునీత సలహా ప్రకారం శర్మిల రెండు రూపాయలతో ఓ స్పాంజిని తీసుకుంది. సునీత తన జడకు తగిలించుకునే రబ్బరు బ్యాండులు ఇచ్చింది. వాటిని స్పాంజికి తలమీద రెండు, కింద రెండు తగిలించింది. ఒకటి తలకింది భాగాన తగిలించింది. రెండు బొట్టు బిళ్లల్ని కళ్ళ దగ్గర, ఒకటి నోటి దగ్గర అంటించింది. 'పిల్లి' బొమ్మ తయారయింది. వెంటనే ఓ పాలిథిన్ కవర్లో బొమ్మను ఉంచి అందులో తన పేరు రాసిన కాగితం పెట్టి పిన్ చేసింది. ఆ బొమ్మను తీసుకువెళ్లి గోడకు తగిలించింది. బాగానే ఉన్నట్లు అనిపించింది.

©SCERT not to be republished

ఉన్నతపాఠశాలలో నిర్వహించే ప్రదర్శనకు శర్మిల తన బొమ్మను తీసుకొని వెళ్లింది. శర్మిలకు తోడుగా సునీత కూడా వచ్చింది. ఆ ప్రాంతమంతా కోలాహలంగా ఉంది. శర్మిల అటూ ఇటూ తిరుగుతుంది. ఆమె చేతిలో చిన్న సంచీ ఉంది. దాంట్లో తాను చేసిన పిల్లి బొమ్మను తెచ్చింది. ఉన్నతపాఠశాలలోని ఓ తరగతి గదిని ప్రదర్శనకోసం కేటాయించారు. ఆ గది బయట ఓ గుడ్డ మీద 'స్వాగతం' అని రాసి ఉంది. పిల్లలంతా రంగు రంగుల కాగితాలు అంటిస్తున్నారు. ద్వారానికి రిబ్బను కట్టే కార్యక్రమంలో ఉన్నారు. ముఖ్య అతిథి వచ్చి రిబ్బన్ కత్తిరించిన తరవాత ప్రదర్శన ప్రారంభమైంది. అప్పటికే చాలామంది తమతమ చిత్రాలను అక్కడికి చేర్చారు. ఎవరికి వారు హడావుడిగా తిరుగుతున్నారు. అంత పెద్ద ప్రదర్శనలో ఈ పిల్లి బొమ్మను పెడతారా! అనే సందేహం సునీతకు కలిగింది. ఎవరిని అడగాలో తెలియడం లేదు. ఎవరూ మాట్లాడడం లేదు.

"శర్మిలా ... నీ బొమ్మను పెట్టుకోరేమో!" అన్నది సునీత.

"ఎందుకు పెట్టుకోరు? పెట్టుకుంటారు" అన్నది శర్మిల దృఢంగా.

"ఏమో! ఆ గదంతా నిండిపోయిందనుకుంటా! బయట కూడా ప్రదర్శనకు బొమ్మలు పెడుతున్నారు."

"అయినా పర్వాలేదు" అంటూ అక్కడకు వెళ్లింది.

"ఏవండీ, మేం కూడా ఓ బొమ్మ తెచ్చాం. లోపల తగిలించరా!" అని శర్మిల అంది.

"ఏం బొమ్మ తెచ్చావ్? ఏదీ చూపించు" అన్నాడతను.

శర్మిల కొద్దిగా బిడియంతో తను చేసిన బొమ్మను సంచిలో నుండి తీసింది.

"ఏమిటది?" అన్నాడతను.

"పిల్లిబొమ్మ" అంది శర్మిల.

"ఇది పిల్లి బొమ్మనా!" చేతిలో ఉన్న రంగుల కాగితం పక్కన పెట్టి నవ్వాడు.

"నీ పిల్లి మ్యావ్ మ్యావ్ అంటుందా?..... పాలు తాగుతుందా?" అని మరీమరీ నవ్వాడు.




© SCERT not to be republished

"ఈ ప్రదర్శనలో పెద్ద పెద్ద బొమ్మలున్నాయి. నాయకుల చిత్రపటాలున్నాయి. ఇంకా చందమామ ఉంది. భూమి ఉంది. వాటన్నింటి మధ్య నీ పిల్లిని పెట్టుకోరుగానీ! నువ్వో పని చెయ్యి. ఈ పిల్లిని చక్కగా నీ సంచిలో పెట్టుకో! ఈ ప్రదర్శనను చూసి వెళ్ళు!" అని తిరిగి కాగితాలు అంటించుకోవడం ఆరంభించాడు.

శర్మిల ముఖంలో ఓ క్షణం బాధ కనిపించింది. తన బొమ్మకేసి ఓసారి చూసుకొని సంచిలో పెట్టుకుంది. వెనక్కి తిరిగింది.

"మనం ఎలాగైనా ఈ బొమ్మను ప్రదర్శనలో పెట్టాలి" అంటూనే పరుగెత్తింది శర్మిల. సునీత నిర్ఘాంతపోయి చూస్తున్నది. అటువైపుగా వస్తున్న ఉపాధ్యాయుణ్ణి చూసింది. ఆయన్ని ఆపి శర్మిల ఇలా అడిగింది.

"సార్.... నేను అయిదో తరగతి చదువుతున్నాను. మేం ఏమైనా బొమ్మలు చేస్తే ప్రదర్శనలో పెడతామని మా బడిలో చెప్పారు. ఇప్పుడేమో నేను పిల్లిబొమ్మను చేసుకొస్తే పెట్టనంటున్నారండీ!" అని చెప్పింది.



ఆయన శర్మిలను ఓసారి చూసి చెప్పారు. "అయితే ఓ పని చెయ్యమ్మా! అదిగో అక్కడ ప్రధానోపాధ్యాయులు ఉన్నారు. ఆయన దగ్గరకు వెళ్ళి చెప్పు. ఆయన చెబితే తప్పకుండా పెడతారు" అని వెళ్ళిపోయారు.

శర్మిల ప్రధానోపాధ్యాయుడి గది లోపలికి వెళ్ళింది. ఆయన పెద్దగా ఎవరికో ఏదో చెబుతున్నారు. కొందరు నిలబడి ఉన్నారు. మరికొందరు కూర్చొని వింటున్నారు. వారెవరూ శర్మిలను గమనించలేదు. అప్పుడే లోపలికి వచ్చిన తెలుగుపండితుడు "నువ్వెందుకొచ్చావమ్మా?" అని శర్మిలతో అన్నాడు. అప్పుడు అందరూ ఆమె వైపు చూశారు. "నేను ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడాలి" అంది శర్మిల. ఇది విన్న ప్రధానోపాధ్యాయుడు "ఆ అమ్మాయిని ఇలా పంపించు" అన్నారు. శర్మిల ముందుకు వెళ్లింది. "ఏం కావాలమ్మా" అన్నారాయన.

"మా బడి నుండి బొమ్మలు చేసుకువస్తే ప్రదర్శనలో పెడతామని మొన్న నోటీసు పంపారు కదండీ! ఇప్పుడేమో నేను తెస్తే పెట్టనంటున్నారు." అంది శర్మిల.

ఇది విని ఆయన, "ఇదిగో దుర్గయ్యా! ఈ అమ్మాయి చేసిన బొమ్మను ప్రదర్శనలో పెట్టమన్నానని చెప్పు" అని చెప్పాడు.

"అలాగే" అంటూ అతను శర్మిలను వెంటబెట్టుకొని ప్రదర్శన జరిగే హాలు దగ్గరకెళ్లి "ఇదిగో ఈ అమ్మాయి బొమ్మను పెట్టమని పెద్దసారు చెప్పారు" అని చెప్పాడు.

ప్రదర్శన ప్రారంభమైంది. లోపల ఓ అద్భుత ప్రపంచం. రకరకాల పక్షులు, అడవులు.... శాస్త్రజ్ఞులు, సూర్యుడు, సూర్యుని చుట్టూ తిరిగే గ్రహాలు... ఆదిమ మానవుడి చిత్రాలు! ఎటు చూసినా ధగధగలు,



చిత్రాలు, ఎక్కడెక్కడినుంచో సేకరించినవి.వాటన్నింటి నడుమ ఓ పిల్లి! ఓ మూలన వేలాడదీశారు. ప్రదర్శనలో మిగతావాటిని చూసినట్లుగానే పిల్లి బొమ్మను కూడా అందరూ ఆసక్తిగా చూశారు. "ఎంత బావుందో?" ఎవరు తయారు చేశారు? చాలా బాగా తయారు చేశారు" అని చూసినవాళ్ళు అందరూ అనుకున్నారు.

ప్రదర్శన అయిపోగానే సభ ఆరంభమయింది. ప్రధానోపాధ్యాయుడు గారు మాట్లాడుతున్నారు. "మనం ఓ పని చేయడం ప్రధానం. మనం చేసే పనిమీద మనకు గౌరవం ఉండాలి. ఇందాక నా దగ్గరకో అమ్మాయి వచ్చింది. ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నది. పిల్లిబొమ్మ చేసుకొస్తే మన వాళ్ళకు నచ్చలేదు. దాన్ని పెట్టవద్దన్నారట! మరి ఆ అమ్మాయి ఊరుకుందా! నేరుగా నాదగ్గరికి వచ్చింది. నా బొమ్మ పెట్టరా? అని అడిగింది. నిజమే! ఆ బొమ్మ గొప్పది కాకపోవచ్చు! అంతగా బాగుండక పోవచ్చు! మరి ఏం బాగుంది? ఆ అమ్మాయి తపన బాగుంది. తను చేసినదాన్ని పదిమందికి చూపించాలనే ఆరాటం బాగుంది. తను అనుకున్నది పూర్తయ్యేంత వరకూ నిరీక్షించడం, ముందుకు రావడం బాగుంది. ఈనాటి విద్యార్థులకు కావలసిందిదే." అని మాట్లాడారు. ప్రదర్శనలో ఎంపికైనవాటికి బహుమతులు ఇచ్చారు. శర్మిలకు ప్రత్యేక బహుమతి వచ్చింది.



మరునటి రోజు శర్మిల వాళ్ళ పాఠశాలలో కూడా ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసింది. 'పిల్లి' బొమ్మను తయారుచేసి, ప్రదర్శించడానికి పట్టుదలగా ప్రయత్నించినందుకు శర్మిలను అందరూ అభినందించారు.

©SCERT not to be republished

– మూలం: 'బాలజ్యోతి'

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



అ) ప్రదర్శనను ఇంగ్లీషులో "ఎగ్జిబిషన్" అని అంటారు. పిల్లల ప్రదర్శనే కాకుండా ఇంకా ఏ ఏ ఎగ్జిబిషన్‌ల గురించి మీకు తెలుసో చెప్పండి.

ఆ) "ప్రయత్నిస్తే...." అని పాఠం పేరు ఉంది కదా! పాఠంలో ఎవరు ప్రయత్నం చేశారు? ఏం ప్రయత్నం చేశారు? మీ మాటల్లో చెప్పండి.

ఇ) మీ పాఠశాల తరపున ఇలాంటి ప్రదర్శనలకు ఎప్పుడైనా ఎవరైనా వెళ్ళారా? ఒకవేళ మీరే వెళ్లాల్సి వస్తే ఏమేం చేసుకొని వెళ్తారు?

ఈ) పాఠం విన్నారు కదా! పాఠంద్వారా మీరు ఏం గ్రహించారో చెప్పండి.

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



అ) **పాఠం చదవండి. పాఠం ఆధారంగా కింది అంశాలు చదివి ఏ ఏ పేరాలలో వాటి వివరాలు ఉన్నాయో రాయండి.**

| అంశం | పేరా సంఖ్య |
|---|---|
| 1. ప్రదర్శన గురించి వచ్చిన నోటీసు వివరాలు. | |
| 2. ప్రదర్శనకు ఏమి తీసుకెళ్లాలా అని శర్మిల ఆలోచించడం. | |
| 3. శర్మిల పిల్లి బొమ్మను తయారు చేసిన విధం. | |
| 4. ప్రదర్శన ఏర్పాట్లు. | |
| 5. శర్మిల తెచ్చిన బొమ్మను ఎగతాళి చేయడం. | |
| 6. శర్మిల తన బొమ్మను ప్రదర్శించడానికి అవకాశం ఇమ్మని అడగడం. | |
| 7. శర్మిలను ప్రదర్శన నిర్వహించే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అభినందించడం. | |



ఆ) **పాఠం చదవండి. ఈ కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. శర్మిల పిల్లిబొమ్మను ఎలా తయారుచేసింది?
2. పాఠశాలకు వచ్చిన నోటీసులో ఏముంది?
3. శర్మిల ప్రధానోపాధ్యాయుడి దగ్గరకు ఎందుకు వెళ్ళింది?

© SCERT not to be republished

4. శర్మిల గురించి ప్రదర్శన జరిగిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏమని అభినందించారు?
5. ప్రదర్శన స్థలం దగ్గర సందడి ఎలా ఉంది?
6. పాఠంలో శర్మిల పట్టుదలను తెలిపే సంఘటనలు ఏమేమి ఉన్నాయి?

**ఇ) కింది పేరా చదవండి. సరైన జవాబులు రాయండి.**



ఎగ్జిబిషన్‌లకు పెట్టింది పేరు భాగ్యనగరం. అంటే హైదరాబాదు నగరం. ప్రతి సంవత్సరం జనవరి ఒకటో తేదీ నుండి ఫిబ్రవరి 15వ తేది వరకు ఒక పెద్ద ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. దీన్ని నాంపల్లిలోని గ్రౌండ్‌లో ఏర్పాటుచేస్తారు. దీన్నే "వాణిజ్య ప్రదర్శన, నుమాయిష్" అని కూడా అంటారు. ఈ ఎగ్జిబిషన్‌లో మన రాష్ట్రంలో తయారయే బట్టలు, చేనేత ఉత్పత్తులు, ఆహార పదార్థాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, టి.వి.లు, ఫ్రిజ్‌లు .... ఇలా ఒకటేమిటి ఎన్నోరకాల వాణిజ్య ఉత్పత్తులను కూడా ప్రదర్శనకు పెడతారు. వీటిని మనం కొనుక్కోవచ్చు కూడా! ఈ ప్రదర్శనలో ఇతర రాష్ట్రాల నుంచి కూడా వాణిజ్య ఉత్పత్తులను తెచ్చి అమ్మడానికి, ప్రదర్శనకు ఉంచుతారు. పిల్లలకోసం జెయింట్ వీల్స్, పడవ ఉయ్యాలలు... రకరకాల బొమ్మల ఉయ్యాలలు ఉంటాయి. పిల్లలకు బోలెడంత కాలక్షేపం.



1. వాణిజ్యప్రదర్శనను ఎక్కడ నిర్వహిస్తారు?
2. ప్రదర్శనను ఎప్పటినుంచి ఎప్పటివరకు నిర్వహిస్తారు?
3. దీంట్లో ఏమేమి ప్రదర్శనకు ఉంటాయి?
4. పిల్లలు ఎగ్జిబిషన్‌కు వెళ్లామని ఎందుకు కోరుకుంటారు?
5. పై పేరాకు శీర్షిక రాయండి.

## III ఆలోచించి సొంత మాటల్లో రాయడం (స్వీయరచన)



అ) పాఠశాలలో ప్రదర్శనను ఏర్పాటు చేయడం వల్ల ఉపయోగాలు ఏమిటో రాయండి.

ఆ) ప్రదర్శనలో శర్మిల పిల్లిబొమ్మను తయారుచేసి పెట్టింది కదా! మీరైతే ఎలాంటి బొమ్మలను, ఏ విధంగా తయారుచేసి పెడతారో రాయండి.

ఇ) 'ప్రదర్శన/ఎగ్జిబిషన్ ఒక అద్భుత ప్రపంచం' ఎందుకో రాయండి.

ఈ) నేటి విద్యార్థులు అనుకున్నది సాధించాలంటే వాళ్లకు ఎటువంటి లక్షణాలు ఉండాలి?

ఉ) పాఠం చదివారు కదా! శర్మిల గురించి మీ సొంతమాటల్లో రాయండి.

© SCERT not to be republished

## IV పదజాలం



అ) ప్రదర్శనలో ఆటల పోటీలు, పాటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు కదా! ఇంకా ఏ ఏ అంశాలలో పోటీలు నిర్వహించవచ్చో రాయండి.

ఆ) సంబంధం ఉన్న పదం కింద గీత గీయండి. పదం, సంబంధం ఉన్న పదాలతో వాక్యాన్ని రాయండి.

**ఉదా:** కాగితం : బంతి పుస్తకం నాగలి

తరగతి గదిలో కొందరు విద్యార్థులు పుస్తకాలు సర్దుకొంటే, మరికొందరు చిత్తుకాగితాలు లేకుండా శుభ్రం చేస్తున్నారు.

| | | | | |
|---|---|---|---|---|
| 1. కళ్ళు | : | తడక | నడక | కాటుక |
| 2. అడవులు | : | నలత | కలప | నడక |
| 3. పిల్లి | : | గీతలు | మీసాలు | వాతలు |
| 4. బహుమతి | : | దుప్పట్లు | చప్పట్లు | తిట్లు |

ఇ) పాఠంలోని కొన్ని పదాలు కింద ఉన్నాయి. వాటిని ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

**ఉదా:** ఆసక్తి : పాఠశాలలో వేసిన పిల్లల నాటకాన్ని అందరూ ఆసక్తిగా చూశారు.

1. ఉత్కంఠ 2. హడావుడి 3. బిడియం 4. నిర్ఘాంతపోవు
5. తపన 6. నిరీక్షణ 7. అభినందన 8. దృఢంగా

## V సృజనాత్మకత



అ) సాధారణంగా సెలవుల్లో గానీ లేదా జాతరల సందర్భంగా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తారు. దీంట్లో రకరకాల దుకాణాలు ఉంటాయి. పిల్లల కోసం జెయింట్ వీల్స్, టవర్, పద్మవ్యూహం, ఆటలు వంటివి ఉంటాయి. మీ గ్రామంలో కూడా సంక్రాంతి సెలవుల్లో ఇలాంటి ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలోని వారికి దీని గురించి తెలియజేయడానికి ఒక పోస్టర్‌ను తయారు చేయండి. ఈ పోస్టర్‌లో కింది వివరాలు ఉండాలి.

నిర్వహణ తేదీలు, నిర్వహణ స్థలం, సందర్శన సమయం, పిల్లలకూ, పెద్దలకు టికెట్ ధర, పిల్లలకోసం ఏర్పాటు చేసేవి, ఆకర్షణీయమైన ఇతర అంశాలు.

©SCERT not to be republished

## VI ప్రశంస




అ) శర్మిల పిల్లి బొమ్మను తయారు చేసింది కదా! మనలో చాలామంది చాలా పనులు నైపుణ్యంతో చేయగలరు. కొంతమంది క్రికెట్ బాగా ఆడగలరు. కొందరు నాటకాలు బాగా వేయగలరు. కొందరు బాగా పాటలు పాడగలరు. కొంతమంది రకరకాల వస్తువులను తయారుచేయగలరు. మీ తరగతిలో కూడా ఇలాంటి వాళ్ళుంటారు. వారిలో ఎవరెవరు ఏమేమి బాగా చేయగలుగుతారో రాయండి. మీరు ఏవేవి బాగా చేయగలరు?

| పేరు | ఏమి బాగా చేయగలరు? |
|---|---|
| | |

## VII భాషను గురించి తెలుసుకుందాం

అ) కింది పట్టిక ఆధారంగా క్రియారహిత వాక్యాలను రాయండి.



| | | |
|---|---|---|
| పాపయ్య | మంచి | మాటకారి |
| జ్యోతి | భలే | పిసినారి |
| శివయ్య | చాలా | కవి |
| వాల్మీకి | తియ్యనైన | పండు |
| మామిడి | తోక | బెత్తెడు |
| గొర్రె | గొప్ప | చురుకైనది |

**ఉదా:** పాపయ్య చాలా పిసినారి.

### ప్రాజెక్టు పని

జనవరి మాసంలో హైదరాబాద్‌లో ఎగ్జిబిషన్ పెడతారు. ఈ వివరాలను వార్తాపత్రికల ద్వారా లేదా ఇంటర్నెట్ ఆధారంగా సేకరించండి. మీ మిత్రులకు మీరు సేకరించిన విషయాలను తెలియజేయండి.

### నేనివి చేయగలనా?

1. ఎగ్జిబిషన్ గురించి సొంతమాటల్లో చెప్పగలను. ఔను/కాదు
2. పాఠాన్ని ధారాళంగా చదవగలను. పాఠంలో ఏ పేరాలో ఏముందో చెప్పగలను. ఔను/కాదు
3. అనుకొన్నది సాధించడానికి ఏం చేయాలో సొంతమాటల్లో రాయగలను. ఔను/కాదు
4. ఇచ్చిన ఆధారాలతో పోస్టరును తయారు చేయగలను. ఔను/కాదు

**కొద్ది భావాలుగల గొప్పవాళ్ళకంటే, గొప్పభావాలు కలిగిన కొద్దివాళ్ళ వల్లే దేశం అభివృద్ధి చెందుతుంది.** **- స్వామి రామతీర్థ**

© SCERT not to be republished

మూడో
యూనిట్

# 12. సంక్రాంతి

కింది చిత్రం చూడండి.



## ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారో చెప్పండి.
- చిత్రంలో మీకు తెలిసిన వాటి గురించి చెప్పండి.
- ఈ చిత్రం ఏ పండుగను తెలియజేస్తుంది? ఈ పండుగను మీరు ఎలా జరుపుకుంటారు?



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

**సంక్రాంతి శుభవేళ తెలుగు సంస్కృతి వివిధ రూపాల్లో ప్రత్యక్షమౌతుంది. సజీవ చైతన్యమై సరస విన్యాసాలతో మనోహరంగా తొణికిసలాడుతుంది. ఎటు చూసినా ఉత్సాహం ఉరకలు వేస్తూ కనిపిస్తుంది. తెలుగువారు ఎంతో వైభవంగా జరుపుకొనే పండుగల్లో సంక్రాంతి ఒకటి. ఇది తెలుగుదనానికి ప్రతీక అయిన పర్వం.**

రైతుల కృషి ఫలితం అయిన పంట ధాన్యలక్ష్మి రూపంలో ఇళ్లకు చేరి నట్టింట పీటవేస్తుంది. ఈ ఆనందాన్ని ఎదనిండా నింపుకొని అనురాగ బంధాల మధ్య అందరూ ఎంతో శ్రద్ధగా ఈ పండుగను జరుపుకొంటారు. ఇది రైతన్నలకు పంటల పండుగైతే, మగువలకు ముగ్గుల పండుగ. కన్నెపిల్లలకు గొబ్బిపండుగైతే, ఇక సర్వజనావళికేమో భోజనాల పండుగ.

భోగి, సంక్రాంతి, కనుము అనే పేర్లతో ముచ్చటగా మూడు రోజుల పాటు జరిగే ఈ పండుగ సంరంభం, దాదాపు నెల ముందుగానే ఇంటి ముంగిళ్లలో కొలువు తీరుతుంది. హరిదాసు రాక ఇప్పటి నుంచే ప్రారంభమవుతుంది. తొలికోడి కూతతో మేల్కొని స్నానం చేసి, నుదుట తిరుమణి తిరుచూర్ణం దిద్దుకొని, ఒకచేత తంబుర, మరొక చేత చిడతలు పట్టుకొని, శిరం మీద అక్షయపాత్ర తొణక్కుండా నిలిపి రంగభజన చేస్తూ, మేల్కొలుపులు పాడుతూ, హరిదాసులు వీథివీథులా తిరుగుతారు.

కుర్రకారు ఉత్సాహం నెలముందు నుంచే ఉరకలు వేస్తుంది. గాలిపటాలు వీధుల్లో ఎగరవేస్తూ కనిపిస్తారు.



రాబోయే భోగికి అందరికంటె ఎక్కువ ఎత్తున భోగిమంటలు వేయాలని కట్టెలను, పనికిరాని పాత వస్తువులను, పిడకలు మొదలైన సామగ్రిని పోగుచేస్తారు. రైతులు పొలాల్లో ధాన్యరాశుల దగ్గర కాపలాకాస్తూ, రాత్రివేళల్లో గుడ్డి వెన్నెల్లో అచ్చమైన తెనుగుతనం గుబాళించే జానపద గేయాలను ఆలపిస్తూంటారు.

ఇక స్త్రీలేమో ప్రతిదినం వేకువ సమయాన్నే లేచి, ఇళ్ళ ముంగిట కళ్ళాపి చల్లి, గొబ్బెమ్మలను పెట్టి, రకరకాల రంగవల్లుల్ని అందంగా తీరుస్తారు. తమలోని కళాతృష్ణను గృహాలంకరణ ద్వారా ప్రదర్శిస్తారు. ఒకరోజు వేసిన ముగ్గును మరోరోజు వేయకుండా జాగ్రత్తపడతారు. ఈ రోజుల్లో ప్రతి గృహిణీ ఒక చిత్రకారిణి. ప్రతి గృహం ఒక చిత్రశాల. వీరు వేసే ముగ్గుల్లో ముఖ్యంగా రథంముగ్గు సూర్యగమనానికి సంకేతం.

వీథుల్లో పూర్వం ముగ్గుల్ని బియ్యం పిండితో వేసేవారు. అది పిపీలికాది సూక్ష్మజీవులకు ఆహారం కావాలనే భూతదయా దృష్టి కాబోలు.




పండుగ మొదటి రోజు భోగి. ఈ రోజు పెందలకడనే లేచి భోగిమంట వేస్తారు. దీంతో భోగిపీడ విరగడవుతుందని, ఆ మంటల్ని చూసేవారికి మేలు కలుగుతుందని పెద్దలంటారు. కుటుంబ సభ్యులంతా తలస్నానం చేసి కొత్తబట్టలు కట్టుకొని కళకళలాడుతూ కనిపిస్తారు. స్త్రీలు మట్టితో చేసిన అమ్మవారిని గౌరమ్మగా భావిస్తూ పూజిస్తారు. సాయంకాలం పిల్లల్ని బాగా సింగారించి వారి నెత్తిమీద రేగుపండ్లు, పప్పులు, బొరుగులు, చెరుకుముక్కలు, చిల్లర డబ్బులు వగైరా తల చుట్టూ తిప్పి కలిపి పోస్తారు. మహిళలను పేరంటానికి పిలిచి చక్కెరతో చేసిన చిన్న చిన్న బొమ్మల్ని, కుంకుమ భరిణల్ని తాంబూలంతోపాటు కానుకగా ఇస్తారు. ఈ మూన్నాళ్ళు బొమ్మలు కొలువు పెట్టి ఎంతో వేడుక చేస్తారు.



భోగినాడు పాలు పొంగించే విధానం భలే పసందుగా ఉంటుంది. నట్టిల్లు చక్కగా అలికి, చతురస్రాకారంగా ముగ్గులు వేసి, నాలుగు వైపుల నాలుగు గురుగులు (చిన్న పిడతలు) పెడతారు. వాటి చుట్టూ దారాలు తిప్పి నడుమ పిడకల్ని పేర్చుతారు. నవధాన్యాలు చుట్టూ పోస్తారు. ఆ పిడకల మీద పాలగిన్నె పెట్టి నిప్పు ముట్టిస్తారు. పాలు తూర్పు వైపు పొంగితే శుభంగా భావిస్తారు. అందుకే ఇంటిల్లిపాదీ పాలెటువైపు పొంగుతాయో అని ఆసక్తిగా ఎదురుచూస్తూ కూర్చుంటారు.

బాలికలు గుమ్మడిపూలతో, పసుపు కుంకుమలతో గొబ్బిపూజ చేస్తారు. ముగ్గుల్లో గోమయంతో చేసిన మూడు గొబ్బిళ్లను, శ్రీకృష్ణుడు, గోమాత, గోవర్ధనగిరి అని నమ్ముతారు. గొబ్బివ్రతం చేస్తూ శుభాలిమ్మని పాటలు పాడుతారు. గొబ్బి దేవతను మహాలక్ష్మి స్వరూపంగా కూడా స్తుతిస్తారు. పల్లెల్లో ఈ పాటలు ఎక్కువగా వినిపిస్తాయి.

ప్రముఖ వాగ్గేయకారుడైన అన్నమాచార్యుల వారు కూడా



**కొలనుదేవరకు గొబ్బియల్లో**
**యదుకులస్వామికి గొబ్బియల్లో**
**కొండ గొడుగుగా గోవులు కాచిన**
**కొండొక శిశువుకు గొబ్బియల్లో**

అంటూ మృదు పదజాలంతో గొబ్బి ప్రస్తావన తెచ్చారు. ఇలాంటి గొబ్బి పాటల్లో పౌరాణిక గాథలకే కాక, కథాగేయాలకు కూడా స్థానం ఉంది.

© SCERT not to be republished









భోగి పండుగకు మర్నాడు సంక్రాంతి. సంక్రాంతి అంటే సూర్యుడు ధనూరాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించడం. దీన్నే 'మకర సంక్రాంతి' అని అంటారు. సూర్య పరిభ్రమణం ఉత్తరదిశగా మొదలుకావడంతో దీన్ని 'ఉత్తరాయణ పుణ్యకాలం' అని కూడా అంటారు.

గోదావరి, కృష్ణ, తుంగభద్ర వంటి నదీ తీరప్రాంతాల వారు ఈ రోజున నదీస్నానానికి వెళతారు. ఈ రోజు సూర్యుణ్ణి పూజిస్తారు. సర్వజీవకోటికీ మూలాధారమైన ఆహారోత్పత్తికి కారకుడైన సూర్యుణ్ణి ఒక మహత్తర శక్తిగా భావిస్తూ ఆరాధించడం అనాదిగా వస్తున్న ఆచారం.

సంక్రాంతి నాడు పొంగలి చేసే పాత్రకు చెరుకు, అల్లం కొమ్ముల్ని కడతారు. ఆ పొంగల్ని చెరుకుగడలు, పండ్లు, పాలతో పాటు నైవేద్యంగా పెడతారు. ఆనపకాయ కూర, పాయసం, దోసబజ్జి, వంకాయకూర, సజ్జరొట్టెలు, గుమ్మడిపులుసు, మినుముల వంటలు ఆహారంగా తీసుకుంటారు. అట్లే తెలంగాణ ప్రాంతంలో సకినాలు, అరిసెలు, నువ్వులతో చేసిన లడ్డూలు, బూరెలు వంటివి ప్రత్యేకంగా తయారుచేస్తారు.

ఇక పండుగ మూడో రోజు 'కనుము'. దీన్నే 'పశువుల పండుగ' అని కూడా అంటారు. కర్షకులు తమకు వ్యవసాయంలో తోడ్పడిన పశువుల్ని శుభ్రపరచి, వాటి కొమ్ముల్ని అలంకరిస్తారు. వాటి మెడలో పూలదండలు వేసి గంటలు కడతారు. కాళ్లకు చిరుగజ్జెలు వేస్తారు. కొమ్ములకు రంగులు పూస్తారు. ఈ విధంగా ఆవుల్ని, గేదెల్ని, భూమి దున్నే ఎద్దుల్ని ఆదరించి ఆరాధించడం వాటిపట్ల కృతజ్ఞత చూపడానికే.

భోగినాడు పెట్టిన గౌరమ్మను కనుమునాడు సాయంకాలం, మహిళలు, బాలికలు కలిసి తీసుకొని వెళ్ళి, ఊరి చివరున్న నీటిలో జలక్రీడలాడిస్తారు. నీటిలో వత్తులు వెలిగించిన దీపాలను వదులుతూ పాటలు పాడతారు. ఏటికి వెళ్లేటప్పుడు పులిహోర, పెరుగన్నం వంటి వంటకాలను తీసుకొని వెళ్లి, గౌరమ్మను నీటిలో కలిపిన తరవాత అందరూ ఆరగిస్తారు.



ఈ రోజున ఏటిగట్టున బొమ్మలు అమ్ముకునేవారు, రంగుల రాట్నం ఆడించేవాళ్ళు, పిల్లల దృష్టిని ఆకర్షిస్తారు. పిల్లల ఆటలతో, పెద్దల మాటలతో ఆ ప్రాంతమంతా ఎంతో సందడిగా చూడముచ్చటగా ఉంటుంది. ఇలా తెలుగు వెలుగుల సంక్రాంతి సంరంభాలకు ఆనందోత్సాహాలతో స్వాగతం పలుకుదాం.

– డా॥ఆశావాది ప్రకాశరావు

© SCERT not to be republished

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



అ) మీకు తెలిసిన పండుగల పేర్లు చెప్పండి. అవి ఎప్పుడు జరుపుకొంటారో చెప్పండి.

ఆ) సంక్రాంతి మూడు రోజుల పండుగ కదా! మీ ప్రాంతంలో ఈ పండుగను ఎలా జరుపుకొంటారో చెప్పండి. పాఠంలో తెలిపిన విధానంతో పోల్చండి.

ఇ) కనుము పండుగను పశువుల పండుగ అంటారు కదా! మరి పశువులను మనం ఎందుకు పూజించాలి? చెప్పండి.

ఈ) పండుగ జరుపుకొనేటప్పుడు మీరు పొందే అనుభూతులను చెప్పండి.

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



అ) పాఠం ఆధారంగా కింది పట్టికను పూరించండి.

| పేరా సంఖ్య | పేరాలోని కీలక పదాలు | పేరాకు శీర్షిక |
|---|---|---|
| రెండో పేరా | | |
| నాల్గో పేరా | | |
| ఆరో పేరా | | |
| ఎనిమిదో పేరా | | |
| చివరి పేరా | | |

ఆ) పాఠం చదవండి. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. భోగి పండుగ నాడు ఏమి చేస్తారు?
2. అన్నమాచార్యులు గొబ్బిళ్ళను గురించి ఏమి చెప్పారు?
3. సంక్రాంతి ఏ రోజున వస్తుంది? దీన్ని ఎందుకు పుణ్యకాలం అంటారు?
4. కనుమ పండుగ నాడు ఏమి చేస్తారు?





ఇ) కింది పేరా చదవండి సరైన సమాధానాలు గుర్తించండి.

మన రాష్ట్రంలో సంక్రాంతి పండుగను అన్ని ప్రాంతాలవారూ జరుపుకొంటారు. అయితే ఆయా ప్రాంతాలలోని ఆచారవ్యవహారాలు, పండుగ జరుపుకునే విధానంలో కొంత వైవిధ్యం ఉంటుంది. నదుల సమీపంలో నివసించే వాళ్లు మకర సంక్రాంతిని పర్వదినంగా భావించి నదీస్నానాలు చేస్తారు. తెలంగాణ

© SCERT not to be republished



ప్రాంతంలో సంక్రాంతికి చక్కిలాలు తయారుచేస్తారు. వీటినే "సకినాలు" అని కూడా అంటారు. వీటిని బియ్యంతో చేస్తారు. బియ్యాన్ని నీటిలో నానబెట్టి, ఆరబెట్టి పిండిగా పట్టిస్తారు. దానికి నువ్వులు, వాము తగినంత ఉప్పును నీటిని కలిపి ముద్దగా చేస్తారు. ఈ ముద్ద జిగటగా ఉంటుంది. దీన్ని గుండ్రంగా చక్రాలలాగా బట్ట మీద చుడతారు. వీటిని నూనెలో వేయిస్తారు. సకినాలతోపాటే ఇతర ప్రాంతాలలో చేసినట్లుగానే అరిసెలు కూడా చేస్తారు. కనుము పండుగ రోజున మహిళలంతా నువ్వులు, బెల్లంతో పొడిగా చేసి "తీపి తిని తియ్యగా మాట్లాడు, నువ్వులు తిని నూరేళ్లు బతుకు" అని బంధుమిత్రులకు పంచుతారు. దీంతోపాటే నోములుగా చిన్న చిన్న బొమ్మలు, వస్తువులను పంచుతారు. ఇది మన సంస్కృతి.

1. పై పేరాలో ఏ అంశాలను గురించి తెలియజేశారు?
2. పై పేరాకు ఎందుకు? ఎలా ? అనే పదాలు ఉండేలా మూడు ప్రశ్నలు తయారు చేయండి.

## \III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



అ) సంక్రాంతి పండుగను పంటల పండుగని కూడా భావిస్తారు. ఎందుకు?

ఆ) "సంక్రాంతి" ప్రాధాన్యాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

ఇ) మీరు జరుపుకొనే పండుగలలో మీకు ఇష్టమైన పండుగ గురించి రాయండి.

ఈ) పండుగ ఏదైనా దానివల్ల మనుషుల మధ్య సంబంధాలు పెరగడం, ఒకరికొకరు సహకరించడం, పండుగను కలిసి జరుపుకోవడం, ఆనందంగా గడపడం ముఖ్యమైనవి. ఇలాంటివి ఇంకా ఏ ఏ పండుగల్లో చోటు చేసుకుంటాయో ఆలోచించి రాయండి.

## IV పదజాలం



**అ) కింది పట్టికను పూరించండి.**

| పండుగ పేరు | చేసే ముఖ్యమైన పనులు |
|---|---|
| రంజాన్ | |
| క్రిస్మస్ | |
| గురుపూర్ణిమ | |

© SCERT not to be republished

ఆ) కింది గళ్లలో పండుగల పేర్లను గుర్తించండి. ఒక్కొక్క పండుగతో ఒక వాక్యం రాయండి. అట్లాగే విభిన్న మతాల వారు జరుపుకొనే పండుగల పేర్లు వచ్చేలా ఒక మంచి వాక్యం తయారు చేయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ద | క్రా | వి | ది | మ | పా |
| హో | య | జా | ళి | ద్ | తి |
| దీ | చ | స | గా | క్రి | క |
| రం | ఉ | న్ | బ | న | క్రీ |
| సం | వ | నా | స్ | ష్ట | రా |

## V సృజనాత్మకత



అ) సాధారణంగా పండుగ రోజుల్లో, వేడుకల్లో ఎక్కువగా నూనెతో చేసిన వంటకాలను, ఫాస్ట్‌ఫుడ్స్‌ను తింటుంటారు. వీటివల్ల కలిగే నష్టాలను తెలుపుతూ ఒక వ్యాసాన్ని, కింది ఆధారాలతో రాయండి. దాన్ని పాఠశాల అసెంబ్లీలో వినిపించండి. ఇలా మాట్లాడటం కోసం రాసుకునే వ్యాసాన్ని "ప్రసంగవ్యాసం" అంటారు.

1. ఆరోగ్యానికి మంచిది కాదు
2. అపరిశుభ్రమైనది
3. పోషకాలు ఏ మాత్రం ఉండవు
4. ఘాటైన మసాలాలు ఉంటాయి
5. చాలా ఖర్చుతో కూడుకున్నది

ఆ) పండుగకు ఇంటికి రమ్మని ఫోన్ సంభాషణను పొడిగించండి.

గోపి : ..............................................................

రాము : చాలా బాగున్నాను.

గోపి : ..............................................................

రాము : మాకు రేపటి నుంచి సంక్రాంతి సెలవులు ఇచ్చారు.

గోపి : ..............................................................

రాము : సరే! వస్తాను.

## VI ప్రశంస

అ) పండుగలను బంధువులు, స్నేహితులతో కలిసి జరుపుకొంటే బాగుంటుందని తెలియజేస్తూ మీ మిత్రునికి ఒక లేఖ రాయండి.




ఆ) ఇతర మతాలకు చెందిన మీ మిత్రులు ఏ ఏ పండుగలు జరుపుకొంటారో తెలుసుకోండి. ఆ పండుగల విశేషాలకు అభినందిస్తూ గ్రీటింగ్ కార్డును తయారు చేయండి.

© SCERT not to be republished

## VII భాషను గురించి తెలుసుకుందాం

### అ) కింది వాక్యాలను చదవండి. గీత గీసిన అక్షరాలను, పదాలను గుర్తించండి.



1. పాలు, సేమ్యాతో పాయసం చేస్తారు.
2. మీ కోసం నేను బొమ్మలు తెచ్చాను.
3. శివ గురించి వాళ్ళ అమ్మ బడికి వెళ్ళింది.
4. సుష్మితకు ప్రజ్ఞ చాక్లెట్లు ఇచ్చింది.
5. హనుమంతుడు రాముడి యొక్క దూతగా లంకకు వెళ్ళాడు.

పై వాక్యాలలో గీత గీసిన అక్షరాలను, పదాలను గమనించారు కదా! ఇవి లేకుంటే వాక్యాలు పూర్తి అర్థాన్ని ఇవ్వడం లేదు కదా! అంటే ఇవి వాక్యంలో పదాల మధ్య సంబంధాన్ని ఏర్పరుస్తున్నాయి. ఇలాంటి అక్షరాలను, పదాలను **'విభక్తులు'** అంటారు.

### ఆ) కింది వాక్యాలను చదవండి. విభక్తుల కింద గీత గీయండి.

1. నిఖిల్ వాళ్ళ పెద్దమ్మతో ఊరికి వెళ్లాడు.
2. తొలికోడికూతతో మేల్కొంటారు.
4. మహిళలను పేరంటానికి పిలిచి తాంబూలాలు ఇస్తారు.
5. ముగ్గులలో గొబ్బిళ్ళు పెడతారు.

© SCERT not to be republished

### ప్రాజెక్టు పని

సంక్రాంతి పండుగకోసం ముగ్గులు వేస్తారు కదా! రకరకాల ముగ్గుల చిత్రాలు సేకరించండి. వాటిలో మీ కిష్టమైనవి గీయండి. రంగులు వేయండి. తరగతిలో ప్రదర్శించండి.


### నేనివి చేయగలనా?

| | |
|---|---|
| 1. సంక్రాంతి పండుగ గురించి చెప్పగలను. | ఔను/కాదు |
| 2. పాఠంలో పేరాలలోని కీలక పదాలను గుర్తించగలను. పేరాకు శీర్షికలు రాయగలను. | ఔను/కాదు |
| 3. సంక్రాంతి పండుగ ప్రాధాన్యం గురించి సొంత మాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. ఇచ్చిన ఆధారాలతో ప్రసంగవ్యాసాన్ని రాయగలను. | ఔను/కాదు |

మతాలు వేరు కావచ్చుగాని అవి ప్రతిపాదించే సత్యం ఒక్కటే.
**- మౌలాన అబుల్ కలాం ఆజాద్**

చదువు ఆనందించు


# క్రిస్మస్



ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్న పండుగలలో క్రిస్మస్ పండుగ ఒకటి. ఈ పండుగ క్రైస్తవులకు అతిపెద్ద పండుగ. ఇది ప్రతి సంవత్సరం డిసెంబర్ 25వ తేదీన జరుపుకుంటారు. ఈ పండుగను క్రిస్మస్ ఈవ్, క్రిస్మస్, బాక్సింగ్ దినం అనే మూడు రోజులుగా జరుపుకుంటారు. ఇవి ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో 24, 25, 26 తేదీలనాడు వస్తాయి.

సంప్రదాయ కథనాల ప్రకారం జీసస్ ఒక పశువులశాలలో, పశువుల మధ్య పుట్టాడని, జన్మించగానే ఆయన తల్లి మేరీ మాత ఆయనను వస్త్రాలతో చుట్టి వారున్న ధర్మశాలలో ఖాళీ లేనందున పశువుల కొట్టంలోనే ఉంచవలసి వచ్చిందని 'బైబిలు' చెబుతోంది. ఆయన పుట్టిన రోజు రాత్రి ఆఊరికి పక్కనున్న పొలాల్లో కొందరు పశువుల కాపర్లు తమ గొర్రెల మందలను కాపలా కాస్తున్నారు. అప్పుడు ఒక దేవదూత ఆకాశం నుంచి వారి ముందుకు దిగి వచ్చాడు. ఆ దూత చుట్టూ ఉన్న వెలుగుకు గొర్రెల కాపరులు భయపడ్డారు. దేవదూత వాళ్ళతో "భయపడకండి ఇదిగో! మీకొక సంతోషకరమైన శుభవార్త. ఇవ్వాళ బెత్లహేంలోని ఒక పశువుల పాకలో లోకరక్షకుడు పుట్టాడు. ఆయన అందరికీ ప్రభువు. ఒక పసికందు పొత్తిగుడ్డలో చుట్టబడి పశువుల తొట్టెలో పడుకుని ఉంటాడు. ఇదే మీకు ఆనవాలు". దేవదూత ఇలా చెబుతుండగా పొలమంతా దేవదూతలతో నిండిపోయింది. వాళ్లంతా దేవునికి స్తుతి గీతాలు పాడి మాయమయ్యారు. గొర్రెల కాపరులు హుటాహుటిన వెళ్ళి దేవదూత చెప్పిన పశువుల పాకకు చేరుకున్నారు. అక్కడ పశువుల తొట్టెలో పడుకుని ఉన్న శిశువును చూశారు.





అలా 2000 సంవత్సరాల కిందట డిసెంబర్ 24వ తేదీ అర్ధరాత్రి ఏసుక్రీస్తు జన్మించాడు. అందుచేత ఆ మరునాడు అంటే డిసెంబర్ 25వ తేదీ క్రిస్మస్ పండుగని జరుపుకుంటున్నారు.


ఈ పండుగకు క్రైస్తవులు తమ ఇళ్ళను, చర్చిలను అలంకరిస్తారు. వెదురుబద్దలతో, రంగు కాగితాలతో ఒక పెద్ద నక్షత్రాన్ని తయారుచేసి ఇంటికప్పు మీద ఎత్తులో పెడతారు. రాత్రివేళ దీపాలంకరణలతో ఇళ్ళు, చర్చిలు అందంగా ఉంటాయి. ప్రతీఇంట్లోనూ ఒక క్రిస్మస్ చెట్టును ఏర్పాటు చేస్తారు. ఇది ఈ పండుగ ప్రత్యేకత. ఈ చెట్టును రంగురంగుల కాగితాలతోనూ, కాగితపు నక్షత్రాలతోనూ, చిరుగంటలతోనూ, చిన్నచిన్న గాజు గోళాలతోనూ అలంకరిస్తారు. మరొక విశేషం ఉంది. క్రిస్మస్ కిందటి రాత్రి శాంతాక్లాజ్ (ఫాదర్ క్రిస్మస్) ఆకాశం నుండి ధ్రువపు జింకలు లాగే బండిలో వచ్చి పిల్లలకు బహుమతులు ఇస్తాడని నమ్ముతారు. క్రిస్మస్ రోజున బంధువుల ఇళ్ళకు, మిత్రుల ఇళ్ళకు వెళ్ళి ప్రేమాభిమానాలతో క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతారు.



# 13. రామన్న కథ

నాలుగో యూనిట్

కింది చిత్రం చూడండి.



## ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- చిత్రంలోని పరిసరాలు ఎలా ఉన్నాయో చెప్పండి.
- మీ ఇంటి పరిసరాలను గురించి చెప్పండి.
- చిత్రంలోని వంటి ప్రాంతాల్లో ఉండేవారి గురించి ఊహించండి. వారి జీవితం ఎలా ఉంటుంది?



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

**రామన్నకు చదువుకోవాలని ఎంత కోరికగా ఉన్నా పిల్లలను చూసుకుంటూ చదువుకోవడం అతని వల్ల కావడం లేదు. ఇంతకూ రామన్న ఎవరు? రామన్న ఏం చేస్తుంటాడు? రామన్న లాంటి వారి గురించి మీకు తెలుసా? పాఠం చదివి తెలుసుకోండి.**

తెల్లవారింది.. నిద్ర లేచాడు రామన్న. గదినిండా కమ్ముకుని ఉన్న పొగ ఒక్కసారిగా కళ్ళలోకి ప్రవేశించడంతో కళ్ళుమండసాగాయి. అమ్మలేచి వంట చేస్తోందని అర్థమైంది రామన్నకు.

తన మీద చెయ్యివేసుకొని పడుకొన్న తమ్ముడు ప్రకాశ్‌ను పక్కకు జరిపి లేచి కూచున్నాడు. అవతలి పక్కనే పడుకున్న చెల్లెళ్ళు చంద్రమ్మ, రాజేశ్వరి ఇంకా లేవలేదు. వంటింట్లో అమ్మ, అమ్మ చంకలో చిన్నతమ్ముడు పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

రాత్రి మిగిలిపోయిన గైహికం (హోంవర్క్) పూర్తి చేద్దామని ఇంటిముందున్న గద్దెమీద కూచున్నాడు. ముందరే ప్రవహిస్తున్న మురుగుకాలవలోంచి దుర్వాసన ముక్కుకు తాకడంతో ముక్కు మూసుకున్నాడు. దాన్ని భరించడం కష్టమనిపించింది.

"మన ఇల్లు ఇక్కడే ఎందుకుంది?" అని నాన్నను ఎన్నోసార్లు అడిగాడు, కానీ ఏనాడూ అతనికి జవాబు దొరకలేదు. అదొక మురికివాడ. నగరంలో వెలిసిన పరిశ్రమలు, మనుషుల వ్యర్థాలను మోసుకుపోతుందా కాలవ. దానికి తోడు ఫ్యాక్టరీలు విడిచిన పొగ ఆ మురికివాడ మీద కమ్ముకుని ఉంటుంది.

చుట్టూ ఉన్న ఫ్యాక్టరీలలో వేలాది జనం పనిచేస్తున్నారు. వాళ్ళంతా పల్లెటూళ్లనుండి వలసవచ్చినవాళ్ళే. వాళ్లందరూ నివసించేది ఆ మురికివాడల్లోనే. 'అసలు ఈ మురికివాడలు ఎందుకు ఉంటాయో?' అని ప్రశ్నించుకున్నాడు రామన్న.



గైహికం మొదలుపెట్టబోయేంతలో వాళ్ళమ్మ పిలిచి చంటిగాడిని ఎత్తుకోమని చెప్పింది. వాడు విపరీతంగా ఏడవసాగాడు. వాడిని సముదాయించడం రామన్నవల్ల కావడంలేదు. చేయాల్సిన హోంవర్క్ చాలా ఉంది. ఎలాగో కొంత గైహికాన్ని పూర్తి చేసి అమ్మ పిలవడంతో లేచాడు రామన్న. ఇంకా చేయాల్సినది ఉంది

రామన్న పూర్తిపేరు రామచందర్. కానీ అందరూ 'రామన్న' అనే పిలుస్తారు. అతని తండ్రి కర్మాగారంలో దినసరి కార్మికుడు.

© SCERT not to be republished

రామన్నకు చదువుకోవాలని ఎంత కోరికగా ఉన్నా చిన్న పిల్లలను చూసుకుంటూ చదువుకోవడం అతని వల్ల కావడంలేదు.

అమ్మ నీళ్ళు తీసుకు రమ్మని చెప్పడంతో ప్లాస్టిక్‌బిందె తీసుకుని వీధి కుళాయి దగ్గరకు చేరుకున్నాడు. అక్కడ పరిస్థితి చూసి అతని గుండె బేజారైంది.

ఆ వాడకు ఉన్నది ఆ కుళాయి ఒక్కటే. చాలామంది నీళ్ళకోసం 'క్యూ' కట్టిఉన్నారు. రోజూ పొద్దున, సాయంత్రం గంటసేపు మాత్రమే నీళ్ళు వదులుతారు.

"మన ఇంట్లో కుళాయి ఎందుకు లేదు? అందరూ వీధి కుళాయిలోనే నీళ్ళు ఎందుకు తెచ్చుకోవాలి?" అని ఆలోచించసాగాడు రామన్న.

"ఏరా తమ్ముడూ! నీళ్ళకోసం వచ్చావా?" అని పలకరించింది విజయక్క.



విజయక్క రామన్న ఇంటిపక్కనే ఉంటుంది. చాలా మంచిది. చదువంటే ప్రాణమిచ్చే రామన్న అంటే విజయకు చాలా ఇష్టం.

"అవునక్కా! అమ్మ వంటపనిలో ఉంది. నన్ను నీళ్ళకోసం పంపింది. నాకేమో బడికి టైం అవుతోంది" అన్నాడు రామన్న.

అప్పుడే విజయక్క వంతు వచ్చింది. తనకు బదులుగా రామన్నను నీళ్ళు పట్టుకోమని తను రామన్న స్థానంలో నిలబడింది.

"అందరూ విజయక్క లాగా మంచివాళ్ళే ఎందుకు ఉండరో?" అనుకున్నాడు రామన్న.

బడికి వెళ్లడానికి తయారవుతున్నాడు రామన్న. తనకు బడిలో ఉచితంగా ఇచ్చిన బట్టలు మాత్రమే ఉన్నాయి. "చాలా మందికి చాలా జతల బట్టలు ఉంటాయట! మరి తనకు ఎందుకు లేవో?" అని చాలాసార్లు అనుకున్నాడు. తనకే కాదు. తన ఇంట్లో ఇద్దరు చెల్లెళ్ళు, ఇద్దరు తమ్ముళ్ళు అందరికీ అంతే.

అతనికి విజయక్క గుర్తుకొచ్చింది. విజయక్క ఇద్దరు పిల్లలకూ మంచి బట్టలు ఉన్నాయి. వాళ్ళిద్దరూ ముద్దుగా, బొద్దుగా ఉంటారు. తమ ఇంట్లో అందరూ బలహీనంగా రోగాలూ రొష్టులతో మూలుగుతూ, మూలుగుతూ ఉంటారు.

'వాళ్ళకూ తమ తండ్రికి వచ్చినంతే జీతం వస్తుంది. కానీ ఎందుకింత తేడా?' అని ప్రశ్నించుకున్నాడు. సమాధానం తట్టలేదు.

"ఏరా అన్నం తినకుండా కూచున్నావు. బడికి వెళ్ళవా?" అని అమ్మ అనడంతో ఆలోచనల్లోంచి బయటకు వచ్చాడు.

అన్నం వడ్డిస్తున్న అమ్మను చూశాడు. "అమ్మ ఎప్పుడూ నీరసంగా ఉంటుంది. కొంచెం పనిచేస్తేనే అలసిపోతుంది. ఎందుకో?" అర్థం కాలేదు.

అన్నంలో కలుపుకోవడానికి పచ్చిమిరపకాయల కారం మాత్రం ఉంది. అదీ రాత్రి నూరింది. కూరగాయలు లేక ఏమీ వండలేదు.

బడిలో చదివిన పోషకాహార పాఠం గుర్తుకువచ్చింది. మనం తినే ఆహారంలో కేరెట్, పాలకూర, టమాటా, బంగాళాదుంపలు, పాలు, పెరుగు, వెన్న, బియ్యం, రాగులు, గోధుమలు, పప్పులు, గుడ్లు, మాంసం, నెయ్యిలతో పాటు నిమ్మకాయల ముక్కలు, బొప్పాయి, అరటిపళ్ళు వంటివి ఉండాలట! పోషకాహారం రోజూ తీసుకోవాలట!

"ఇన్ని పదార్థాలా? తమకు ఎక్కడినుండి వస్తాయి?" అనుకున్నాడు.



మిరపకాయ కారం కలుపుకొని ముద్దనోట్లో పెట్టుకోగానే కారం మంటకు కళ్ళనుంచి నీళ్ళు కారాయి. ఎలాగో తిని నీళ్ళు తాగి బడికి బయలుదేరాడు.

చాలా దూరంలో ఉన్న బడికి వెళ్ళాలంటే బస్సులో వెళ్ళాలి.

రామన్న బస్టాండ్‌లో నిలబడ్డాడు. రెండు బస్సులు వచ్చాయి, కానీ జనంతో కిక్కిరిసి ఉన్నాయి.

'అబ్బా.. ఎక్కడ చూసినా జనమే! విపరీతమైన జనం!. చీమల్లా జనం! వీళ్ళందర్నీ తీసుకువెళ్ళాలంటే ఎన్ని బస్సులు కావాలో?' అనుకున్నాడు రామన్న.

అప్పుడే వచ్చి ఆగిన ఒక బస్సులోకి అతి కష్టంమీద తోసుకుంటూ దూరిపోయాడు. ఆ తోపులాటలో అతని చొక్కా నలిగిపోయింది.

ఎలాగో బడికి చేరుకొన్నాడు. ఆ రోజు పిల్లలందరూ ఉత్సాహంతో ఉన్నారు. కారణం ఆ రోజు బళ్ళో సినిమాప్రదర్శన ఉంది.

'మన పల్లెసీమలు' అనే సినిమాను ప్రదర్శించారు. అందులో పల్లెలే మనకు ఆధారమని, పల్లెల్లోనే వ్యవసాయంచేసి పంటలు పండిస్తారని, అయితే ఈనాడు పల్లెల్లో వ్యవసాయంచేసేవారి సంఖ్య తగ్గిపోతోందని చూపించారు. అదే విధంగా గ్రామాల్లో నీటిఎద్దడివల్ల, వర్షాలు పడకపోవడంవల్ల రైతులకు నష్టాలు వస్తున్నాయని చూపారు. వర్షాభావాన్ని అధిగమించడానికి చెట్లు నాటాలనీ, నీటిని పొదుపు చేయాలనీ చూపారు. లేదంటే పల్లెల్లో సాగునీరు, తాగేనీరూ లభ్యంకాని పరిస్థితి ఏర్పడుతుందని ఆ సినిమా ద్వారా సందేశమిచ్చారు.

సినిమాలో చెప్పింది శ్రద్ధగా విన్నాడు రామన్న. అతనికి ఒక్కసారి తమ కుటుంబ పరిస్థితులు కళ్ళముందు కదలాడాయి.

తమది ఇరుకు ఇల్లు. ఉన్నవారికి ఏ మాత్రం సరిపోదు. మంచి తిండీ లేదు, మంచి బట్టలూ లేవు. మిగతావారిలో కూడా విజయక్క లాంటి ఒకరిద్దరు తప్ప సుఖంగా ఉన్నవాళ్ళెవరూ లేరు.

దీనికి తోడు ఎవరికీ చదువు రాదు. తమ ఇంట్లో తాను ఒక్కడే చదువుతున్నాడు.

తాము ఉంటున్న ప్రాంతంలోని ఇళ్ళు కిక్కిరిసిఉన్నాయి. అక్కడ పారిశుద్ధ్యం లేదు. ఇటువంటి ప్రాంతాలను "మురికివాడలు" అని అంటున్నారు. నగరంలో ఇంచుమించు ఇలాంటి పరిస్థితులే ఉన్న మురికివాడలు చాలాచోట్ల ఉన్నాయి.

మురికివాడల్లో అక్కడ ఉన్నవాళ్ళే కాకుండా, ఇంకా ఎంతోమంది పల్లెల నుంచి అక్కడికి వస్తున్నారు. వాళ్ళందరికీ ఇళ్ళు కావాలి. తమ వాడ పక్కన పెద్ద చెరువు ఉంది. అందులో సగం ఇళ్ళు లేచాయి. మిగిలిన సగం ఫ్యాక్టరీలలోనుంచి వచ్చే మురుగు, కాలుష్యాలతో నిండిపోయింది. దుర్గంధాన్ని, కీటకాలనీ, దోమలను వ్యాపింపజేస్తూ సర్వరోగాలకూ కారణమవుతోంది.


వాతావరణం కలుషితమైపోతోంది. మంచినీటి కొరత ఏర్పడుతోంది. ఇలా రామన్న బుర్రలో ఎన్నో ఆలోచనలు! ఇంతలో బడి వదిలారు. ఆలోచిస్తూనే రామన్న ఇంటికి బయలుదేరాడు. భవిష్యత్తులో తను ఏం చేయాలో నిశ్చయించుకొన్నాడు.

**మూలం:** పూలపొట్లాలు, బాలల అకాడమీ

© SCERT not to be republished

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



అ) రామన్న కథ విన్నారుకదా! రామన్న కథ ద్వారా మీరేం తెలుసుకున్నారు?

ఆ) పట్టణాలలో మురికివాడల గురించి తెలుసుకున్నారు కదా! మురికి వాడల్లో ఏ ఏ సమస్యలు ఉంటాయి?

ఇ) గ్రామాలనుండి పట్టణాలకు వలసలు రావడంవల్ల పట్టణ జనాభా పెరిగి, మురికివాడలు ఏర్పడుతున్నాయని తెలుసుకున్నారు కదా! ఇలా జరగకుండా ఉండాలంటే ఏం జరగాలి?

ఈ) పట్టణాల్లో నీటి సమస్యలాగా ఇంకా ఏ ఏ సమస్యలు ఉంటాయి?

ఉ) రామన్నలాంటి పిల్లల ఇంటి వద్ద ఇంటి పరిస్థితులు ఎలా ఉంటాయి. ఊహించండి. ఇలాంటి పరిస్థితులు ఎందుకుంటాయి? చర్చించండి.

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



అ) అందరికీ కొన్ని బలమైన కోరికలు ఉంటాయి. వాటిని ఆకాంక్షలు అంటారు. కొంతమంది పిల్లల ఆకాంక్షల వివరాలు కింది పట్టికలో ఉన్నాయి. వాటిని చదవండి. పాఠం ఆధారంగా రామన్నకుకూడా ఈ ఆకాంక్షలు ఉన్నాయా? ఉంటే ‘✓’ పెట్టండి.

| ఆకాంక్షలు | రామన్న ఆకాంక్షలు | మీ ఆకాంక్షలు |
|---|---|---|
| 1. జ్వరం, జలుబు, తలనొప్పి వంటి జబ్బులు తగ్గిపోవాలనీ, లేదా జబ్బులు కాకుండా ఉండడం. | | |
| 2. మంచి బట్టలు తొడుక్కోవడం. | | |
| 3. అమ్మానాన్న, ఉపాధ్యాయులు నాతో ప్రేమపూర్వకంగా మాట్లాడడం. | | |
| 4. నాకు బాగా చదువురావడం. | | |
| 5. ఇంటా, బైటా, బడిలో ఆడుకోవడానికి, అవకాశం, సదుపాయం ఉండడం. | | |
| 6. బొమ్మలు గీస్తే నన్ను అందరూ మెచ్చుకోవడం. | | |
| 7. ప్రతి ఒక్కరికీ అవసరాలు తీర్చుకోవడానికి సరిపడా పరిస్థితులు, డబ్బులు ఉండడం. | | |
| 8. మతసామరస్యం కలిగి ఉండడం. | | |
| 9. నేను పూర్తిగా అభివృద్ధి చెందే వరకు నా చదువు ఆగకుండా కొనసాగడం. | | |

© SCERT not to be republished

ఆ) రామన్నకు లేచినప్పటినుంచి రాత్రి వరకు రకరకాల ఆలోచనలు. అట్లే తనలో తాను ఎన్నో ప్రశ్నలు వేసుకున్నాడు కదా! పాఠం ఆధారంగా ఆ ప్రశ్నలు రాయండి.

ఇ) పాఠంలో చాలా ప్రశ్నలున్నాయి. అయితే ఒక ప్రశ్న మాత్రం రామన్న అడగలేదు. ఆ ప్రశ్న ఏది? దాన్ని ఎవరు అడిగారు?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



అ) రామన్న గురించి ఐదు వాక్యాలు రాయండి.


ఆ) పాఠం ద్వారా పట్టణం గురించి తెలుసుకున్నారు కదా! పల్లెకు, పట్టణానికి గల తేడాలను రాయండి.

ఇ) రామన్నకు ప్రతిరోజూ తను చూసేవాటిని గురించి ఎన్నో ఆలోచనలు, ప్రశ్నలు తలెత్తేవి కదా! అట్లాగే మీకు వచ్చే ఆలోచనలను, ప్రశ్నలను రాయండి.

ఈ) రామన్న గురించి తెలుసుకున్నారు కదా! రామన్న స్థానంలో మీరే ఉంటే ఏం చేస్తారో చెప్పండి.

ఉ) రామన్న భవిష్యత్తులో ఏమి చేయాలని నిర్ణయించుకొని ఉంటాడో ఊహించి రాయండి.

## IV పదజాలం




**అ) రామన్న ఇంటిని గురించి తెలుసుకున్నారు కదా! దీని ఆధారంగా కింది పట్టికను పూరించండి.**

| వివరాలు | రామన్న గురించి | మీ గురించి |
|---|---|---|
| 1. ఇంట్లో ఉన్నవి | | |
| 2. ఇంటిలోని సభ్యులు | | |
| 3. ఇంటి ముందు వాతావరణం | | |
| 4. నీటి సౌకర్యం | | |
| 5. చదువుకోవడానికి సౌకర్యం | | |
| 6. అమ్మ నాన్నలు | | |

**ఆ) 'పల్లెసీమ'కు సంబంధించిన పదాలను రాయండి.**

© SCERT not to be republished

## V సృజనాత్మకత



అ) పాఠం చివరలో 'రామన్న బుర్రలో ఎన్నో ఆలోచనలు' అని ఉంది కదా! రామన్నలాగ ఏకపాత్రాభినయం చేయండి.

ఆ) 'కాలుష్యభూతం' అర్థం వచ్చేలా ఒక చిత్రాన్ని గీయండి. రంగులు వేయండి. దాని గురించి రాయండి.


## VI ప్రశంస



అ) క్రాంతి అనే స్వచ్ఛంద సంస్థ మురికివాడల్లోని ప్రజలను చైతన్యపరచడానికి కృషి చేస్తూంది. ఇందుకోసం ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతున్నది. ఆ సంస్థను అభినందిస్తూ మీరొక లేఖ రాయండి.

ఆ) రామన్నలాంటి పిల్లలకు మీరైతే ఎలాంటి సహాయం చేస్తారో తెలపండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



**అ) కింది పట్టిక ఆధారంగా వాక్యాలు రాయండి. వాటిలోని విభక్తులను గుర్తించి గీత గీయండి.**

| | | | |
|---|---|---|---|
| సుమిత్ర | హక్కుల | గురించి | వెళ్ళింది |
| లక్ష్మి | పచ్చదనం–పరిశుభ్రత | తో | వెళ్ళాడు |
| ప్రభాకర్ | కూరగాయల | కొరకు | ఆడింది |
| రాణి | పుస్తకం | కు | మాట్లాడింది |
| క్రాంతి | బజారు | లో | ఉపన్యసించింది |
| డేవిడ్ | సినిమా | | రాసింది |

**ఉదా:** సుమిత్ర హక్కుల గురించి మాట్లాడింది.

### ప్రాజెక్టు పని

మీ తరగతి గ్రంథాలయంలోని పుస్తకాలను లేదా వార్తా పత్రికలను చదవండి. కాలుష్యం నివారణకు చేపట్టాల్సిన కార్యక్రమాలను తెలుసుకొని రాయండి. ప్రదర్శించండి.

### నేనివి చేయగలనా ?

| | | |
|---|---|---|
| 1. | రామన్న గురించి, మురికివాడల్లోని సమస్యలను గురించి సొంతమాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | పాఠంలో రామన్న ఆలోచనలను, ప్రశ్నలను గుర్తించగలను . | ఔను/కాదు |
| 3. | పల్లె, పట్నం మధ్య తేడాలను గురించి, రామన్నను గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | కాలుష్య భూతం బొమ్మగీసి దాని గురించి రాయగలను. | ఔను/కాదు |


**భారతీయులుగా జీవించడం అలవరచుకోండి. స్వదేశీ భావనలు పెంచుకోండి.**

© SCERT not to be republished

నాలుగో యూనిట్

# 14. నేను.. మీ ప్రియ నేస్తాన్ని..


కింది చిత్రం చూడండి.



© SCERT not to be republished

**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రంలో ఏమి ఉన్నాయి. అవి ఏమి మాట్లాడుకుంటున్నాయో ఊహించి చెప్పండి.
- చిత్రంలో ఉన్నవాటితో మీరు ఏం చేస్తారు?
- అవి మీతో మాట్లాడితే ఏమని మాట్లాడుతాయో చెప్పండి.



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

పిల్లలూ!

ఇప్పుడు మీ చేతిలో ఉన్నది నేనే. నన్ను చూస్తున్నప్పుడు మీ వదనాల్లో కనిపించే ఆనందం నాకెంతో ఇష్టం. బొమ్మలతో, కథలతో, రకరకాల రాతలతో నిండి ఉన్న నన్ను ఎంతో ఆశ్చర్యంగా, ఆనందంగా రకరకాల హావభావాలతో గమనిస్తూ ఉంటారు. నిరంతరం నాతో మీ సమయాన్ని గడపడానికి వెచ్చిస్తారు. అందుకే నేను మీ ప్రియనేస్తాన్ని! నేను మీకు ఆనందంతోపాటు ప్రపంచంలోని ఎన్నో విషయాలను, విజ్ఞానాన్ని, నూతన ఆవిష్కరణలను అందిస్తూ ఉంటాను.

నేను ఎప్పుడు పుట్టానో? ఎన్ని మార్పులకు లోనై ప్రస్తుతం ఈ రూపంలోకి మారానో ఖచ్చితంగా తెలియదు. ఈ భూమి పుట్టిన తరవాత చాలా ఏళ్ళకు జీవరాశి పుట్టింది. జీవరాశి పుట్టిన చాలా సంవత్సరాలకు మనిషి ఆవిర్భవించాడు. మనిషి పుట్టిన చాలా కాలానికి భాష పుట్టింది. మాటలు, సైగల రూపంలో ఉండే భాషకు కాలక్రమంలో బొమ్మల రూపంలో, అక్షరాల రూపంలో లిపి ఏర్పడింది. లిపి ఏర్పడిన తరవాతనే నేను పుట్టాను.

ప్రాచీన మానవులు రాళ్ళపైన, గోడలపైన సమాచారాన్ని చెక్కేవారు. ఆ తరువాత చాలా కాలానికి తాటాకులమీద ఘంటంతో అక్షరాలను రాసేవారు. అలా రాసిన తాటాకులను కట్టగాకట్టేవారు. వాటిని "తాళపత్రగ్రంథాలు" అనేవారు. పురాణాలు, ఇతిహాసాలు అన్నీ వాటిపైనే రాసేవారు. ఆ తరవాత కాలంలో రాగిరేకులపై కూడా రాసేవారు.

కాలక్రమంలో నా అవసరం పెరగడంతో ఎన్నో అన్వేషణలు చేసి కాగితాన్ని కనుగొన్నారు. నా ప్రయాణంలో కాగితాన్ని కనుక్కోవడం ఒక మైలురాయి అయితే, క్రీ.శ. 1440వ సంవత్సరంలో జాన్ గూటెన్‌బర్గ్ అచ్చుయంత్రాన్ని కనుగొనడం మరో మైలురాయి. అచ్చుయంత్రాన్ని కనుక్కోవడంతో నా రూపురేఖలే మారిపోయాయి. రోజురోజుకూ మార్పులు చెందుతూ రకరకాల బొమ్మలతో, రంగులతో, అక్షరాలతో ఎంతో అందంగా ఆకర్షణీయంగా ప్రస్తుతం మీ ముందు ఇలా ఉన్నాను.

పాఠశాల తెరవగానే మీరు నాకోసం ఎదురుచూస్తారు. నేను మీ చేతుల్లోకి రాగానే నాపైన మీ పేరు రాసుకుని, నేను ఎక్కడ పాడైపోతానో అని అట్టలు వేసి భద్రంగా సంచీలో దాచుకుంటారు. అప్పుడు నాకు ఎంత సంతోషంగా ఉంటుందో! మీకే కాదు సుమా! మీ తాతల, ముత్తాతల కాలం నుంచీ పిల్లలకు, పెద్దలకు అందరికీ కూడా నేను ఆత్మీయనేస్తాన్నే!

నాకు ప్రపంచంలో ఉన్న భాషలన్నీ వచ్చు. నన్ను ఏ భాషలో ముద్రిస్తే ఆ భాషలోనే మాట్లాడతాను. మీకు గమ్మత్తైన విషయం చెప్పనా! మీరేమో నన్ను ఎడమవైపు నుండి కుడివైపునకు చదివితే.. ఉర్దూలో కుడివైపు నుండి ఎడమవైపుకు చదువుతూ వెళతారు. అదే జపాన్, చైనా దేశాల్లో అయితే పైనుండి కిందకు నిలువుగా నన్ను చదువుతారు.

ఈ మధ్యకాలంలో నా వినియోగం బాగా పెరిగింది. పిల్లలకోసం బొమ్మలు, కార్టూన్లు మొదలైనవాటితో నన్ను ముద్రిస్తే, పెద్దవాళ్ళకోసం పత్రికలు, నవలలు మొదలైన రూపాల్లో ముద్రిస్తున్నారు.

© SCERT not to be republished

నాలో ఎన్నో అంశాలను పొందుపరుస్తున్నారు. వాటిలో కథలు, వ్యాసాలు, కవితలు, లేఖలు, నాటికలు, పాఠాలు, సందేశాలు, ప్రసంగాలు, శాస్త్రీయ పరిశోధనాంశాలు, చారిత్రక అంశాలు అబ్బో! రాస్తూ పోతే అదో పెద్ద గ్రంథం అవుతుంది. విన్నారా! 'గ్రంథం' అనేది నా మరోపేరు.

అసలు మానవ జీవన వికాసానికి అద్భుతమైన ఆవిష్కరణలకు, సమస్త సమాచారం చేరవేతకు నేనే కారణం తెలుసా! ఇంకో విషయం చెబుతాను. ఒక అంచనా ప్రకారం తెలిసేది ఏమిటంటే 2010 సంవత్సరం వరకు సుమారు 13 కోట్ల సంఖ్యలో నన్ను ముద్రించారట!

కొంతమంది నన్ను చంటిపాపలాగా జాగ్రత్తగా చూసుకుంటారు. అలమరల్లో భద్రపరుచుకుంటారు. వారికి నేనంటే చాలా ఇష్టం. కొంత మంది నన్ను నిర్లక్ష్యం చేస్తుంటారు. సరిగా చూడక చివరకు తూకానికి అమ్మేస్తూ ఉంటారు. అప్పుడు నాకు ఎంత బాధగా అనిపిస్తుందో చెప్పలేను.

నేను మీకు చాలా చోట్ల అందుబాటులో ఉంటాను. మీ పాఠశాల గ్రంథాలయంలో, ఊరి గ్రంథాలయంలో నేను ఎన్నో రూపాలలో కనిపిస్తాను. కొన్ని ప్రాంతాలలో సంచార గ్రంథాలయాల పేరిట నన్ను ఇంటింటికీ చేరవేస్తారు. కొంత మంది నాపైన మరీ ప్రేమతో వాళ్ళ ఇంటిలోనే నాకొక ప్రత్యేకమైన గదిని కూడా ఏర్పాటు చేసుకుంటారు.

నన్ను చదివిన కారణంగా ఎంతో మంది ప్రభావితులై గొప్ప గొప్ప నాయకులుగా మారారు. నా నుండి ఎంతో స్ఫూర్తిని పొందారు. నా గొప్పదనం గురించి జవాహర్‌లాల్‌నెహ్రూగారు తన కూతురికి లేఖ కూడా రాశాడు. నా మీద అభిమానంతో గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు గ్రంథాలయ ఉద్యమాన్నే చేపట్టారు.

నేను పుట్టినప్పటినుండి ఇప్పటి వరకు నాలో ఎన్ని మార్పులు వచ్చినా నా ప్రాధాన్యం మాత్రం తగ్గలేదు. కంప్యూటర్‌లాంటి ఆధునిక ఆవిష్కరణలో నేను ఇ-బుక్ పేరుతో కొత్త రూపాన్ని కూడా సంతరించుకున్నాను. మీకు తెలుసా? ఏప్రిల్ 23వ తేదీనాడు ప్రపంచ పుస్తక దినోత్సవంగా నిర్వహిస్తారు.

"చిరిగిన చొక్కా అయినా తొడుక్కోగానీ మంచి పుస్తకం కొనుక్కో" అని కందుకూరి వీరేశలింగం పంతులుగారు నా గురించి గొప్పగా చెప్పారు.

చదువు ఆనందాన్ని ఇస్తుంది. ఆలోచనలను రేకెత్తిస్తుంది. కల్పనాశక్తి, సృజనాత్మకతను పెంపొందిస్తుంది. ఎంత ఎక్కువగా చదివితే అంత జ్ఞానం పెరుగుతుంది. దీనివల్ల ఇతర విషయాలను కూడ బాగా అర్థం చేసుకోగలుగుతాము. కావున పిల్లలూ! మీరు వీలైనన్ని పుస్తకాలు, దినపత్రికలు, వార్తాపత్రికలు కథలపుస్తకాలు చదవాలి. మీ బడిలో గ్రంథాలయం నుండి పుస్తకాలను అడిగి తీసుకొని చదవండి. ఆనందించండి.

ప్రియనేస్తాలూ... నన్ను బాగా వినియోగించుకోండి. చదవడం ఒక అలవాటుగా మారాలి. ఆబాలగోపాలానికి నేను ప్రియనేస్తాన్ని. మీకు ఆనందాన్ని, వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించే నన్ను జాగ్రత్తగా దాచుకుంటారు కదూ! ఇక ఉంటా! సెలవ్!

©SCERT not to be republished

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



అ) పాఠంలో మీతో మాట్లాడింది ఎవరు? ఏమేం మాట్లాడింది?

ఆ) మీకు పుస్తకాలంటే ఇష్టమేనా? ఎలాంటి పుస్తకాలంటే ఇష్టం?

ఇ) ఈ పాఠం చదువుతుంటే మీకు ఏ పుస్తకం కళ్ళముందు మెదిలింది? ఆ పుస్తకం గురించి చెప్పండి.

ఈ) పుస్తకాన్ని జాగ్రత్తగా చూసుకోవడానికి మీరేం చేస్తారో వివరించండి.

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



అ) కింది విషయాలకు చెందిన వివరాలు పాఠంలో ఉన్నాయి. ఆ పేరా సంఖ్యను బ్రాకెట్లో రాయండి.

1. భాష పుట్టుక గురించి ( )
2. పుస్తకాలలో ఉండే అంశాలు గురించి ( )
3. వివిధ దేశాల్లో, వివిధ రకాలుగా రాయడం గురించి ( )
4. పుస్తకాలలోని రకాల గురించి ( )
5. గ్రంథాలయాల గురించి ( )

ఆ) కింది పేరా చదవండి. వీలైనన్ని ప్రశ్నలు, జవాబులు రాయండి.



'పుస్తకాలు లేని గది ఆత్మలేని శరీరం వంటిది' అని అన్నాడొక మహనీయుడు. దీనివల్ల పుస్తకం ఎంత ముఖ్యమైనదో మనకు తెలుస్తుంది. పుస్తకాలు చదవడం ద్వారా ఎంతోమంది జీవితాల్లో ఎన్నో మార్పులు వచ్చాయని మనం తెలుసుకొని ఉన్నాం. శరీర పోషణకు తిండి ఎంత అవసరమో బుద్ధిని వికసింపజేయడానికి పుస్తకాలు చదవడం అంత అవసరం. పుస్తకాలు చదవడంవల్ల మంచి చెడులు తెలుస్తాయి. తెలివితేటలు పెరుగుతాయి. చదువుకున్నవాళ్ళు అధిక సంఖ్యలో ఉన్న దేశాలే అభివృద్ధి సాధిస్తున్నాయి. ఎందరో గొప్పవాళ్ళ జీవితాలలోని అనుభవాలను తెలుసుకుని మన జీవితాలను చక్కగా మలచుకొనే అవకాశం పుస్తకాలు చదవడంవల్ల మనకు లభిస్తుంది. మంచిపుస్తకం దగ్గరుంటే మంచి స్నేహితుడు దగ్గరున్నట్లే! అలాంటి పుస్తకాలకు నిలయాలైన గ్రంథాలయాలను అభినవ దేవాలయాలని వర్ణిస్తారు.

© SCERT not to be republished

ఇ) పాఠం ఆధారంగా పుస్తకం తయారైన పరిణామ క్రమాన్ని రాయండి.

భూమి పుట్టుక → ☐ → ☐ → ☐ → ☐ → ☐



ఈ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. పుస్తకాలను ఎలా భద్రపరుచుకోవాలి?
2. పుస్తకాలలో ఏమేం ఉంటాయి?
3. పుస్తకాలు ఎక్కడెక్కడ అందుబాటులో ఉంటాయి?
4. సంచార గ్రంథాలయాలు అని వేటిని అంటారు?
5. తెలుగు, ఉర్దూ, చైనా, జపాన్ భాషల్లోని అక్షరాలు ఏ వైపు నుండి ఏ వైపుకు చదువుతారు?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



అ) పుస్తకాలు చదవడం వల్ల ఎలాంటి లాభాలు ఉంటాయో సొంతమాటల్లో రాయండి.


ఆ) ఇప్పటి వరకు మీరు చదివిన వాటిల్లో మీకు బాగా నచ్చిన పుస్తకం ఏది? ఎందుకు?

ఇ) ఇప్పటివరకు పుస్తకం మీతో మాట్లాడింది కదా! మీరు పుస్తకంతో మాట్లాడితే ఏం మాట్లాడతారు?

ఈ) మీరు సొంతంగా ఇంటిలో గ్రంథాలయం ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి పుస్తకాలు సేకరిస్తారు? ఎందుకు?

ఉ) "చిరిగిన చొక్కా అయినా తొడుక్కో, కాని ఒక మంచి పుస్తకం కొనుక్కో" ఈ మాటలను కందుకూరివారు ఎందుకు అని ఉంటారో ఆలోచించి రాయండి.

## IV పదజాలం



అ) రచనలు చేసేవారిని రచయితలు అంటారు. ఇలా మరికొన్ని పనులు చేసే వివరాలు కింద ఉన్నాయి. వారిని ఏమంటారో రాయండి

ఉదా– రచనలు చేసేవారు <u>రచయితలు</u> 1. కవిత్వం రాసేవారు ..........

2. సంపాదకత్వం చేసేవారు ......  3. ముద్రణ చేసేవారు ...........

4. బొమ్మలు గీసేవారు ............  5. కార్టూన్లు గీసేవారు ...........

6. వార్తలు సేకరించేవారు ........  7. పుస్తకాన్ని సమీక్షించేవారు ...

© SCERT not to be republished

ఆ) అచ్చుయంత్రం కనుక్కోనడంతో పుస్తకం రూపురేఖలే మారిపోయాయి. అట్లాగే కింది వాటి రూపురేఖలు ఎలా మారాయో పట్టికలో రాయండి. ఇలాంటివే మరికొన్ని రాయండి.

| వస్తువులు | ఒకప్పుడు ఎలా ఉండేది? | ఇప్పుడెలా మారింది? |
|---|---|---|
| మనం ఉండే ఇల్లు | | |
| మనం పడుకొనే మంచం | | |
| మనం వంట చేసే పొయ్యి | | |


## V సృజనాత్మకత



ఈ పాఠంలో పుస్తకం తన గురించి తాను చెప్పుకుంది కదా! ఇలా తన గురించి తాను చెప్పుకోవడాన్ని 'ఆత్మకథ' అంటారు. అలాగే ఈ కింది వాటిలో ఏదైనా ఒక అంశాన్ని తీసుకుని అది మాట్లాడుతున్నట్లుగా 'ఆత్మకథ' రాయండి.


1. మనం వేసుకొనే దుస్తులు　　2. పెన్ను　　3. చెప్పులు

## VI ప్రశంస :



మీరు చదివిన ఏదైనా ఒక పుస్తకం గురించి సమీక్ష రాయండి. అనగా దాని పేరు, దాంట్లో ఏ ఏ విషయాలు ఉన్నాయి? దాంట్లో మీకు నచ్చిన విషయాలను, నచ్చని విషయాలు మొదలైనవాటి గురించి వివరాలు రాసి ప్రదర్శించండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



అ) కింది వాక్యాలను చదవండి. కర్తకు ముందు విశేషణ పదాలను చేర్చి రాయండి.

ఉదా: సైనికులు యుద్ధంలో పాల్గొన్నారు.
<u>ధైర్యవంతులైన</u> సైనికులు యుద్ధంలో పాల్గొన్నారు.

1. నక్క సింహం దగ్గరకు వెళ్ళింది. 2. మల్లెలు తోటలో విరబూశాయి.

### ప్రాజెక్టు పని


వివిధ పత్రికలలో మీకు నచ్చిన కథలు, కవితలు, చిత్రాలు, గేయాలు, ఛలోక్తులు (జోకులు) వంటివి సేకరించి వాటిని పుస్తకంగా తయారు చేయండి. ఆ పుస్తకంలోని అన్ని అంశాలు అంటే ముందుమాట, కవర్‌పేజీ చిత్రాలు, పుస్తకానికి పేరు పెట్టడం, విషయ సూచిక మొదలైనవన్నీ మీరే రాయండి. ఆ పుస్తకాన్ని తరగతి గదిలో ప్రదర్శించండి.

© SCERT not to be republished

### నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | పుస్తకం మాతోచెప్పిన విషయాలను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | పాఠాన్ని ధారాళంగా చదవగలను. | |
| | ఇచ్చిన విషయాలకు చెందిన వివరాలను పాఠంలో గుర్తించగలను. | ఔను/కాదు |
| 3. | పుస్తకాల ప్రాధాన్యతను, గొప్పదనం గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | ఎంచుకున్న అంశాలకు ఆత్మకథ రాయగలను. | ఔను/కాదు |

**తల్లి శరీరాన్ని పెంచి పోషిస్తుంది. ఉత్తమ గ్రంథం హృదయాన్ని పోషించి పెంచుతుంది.**
**- రావూరి వేంకట సత్యనారాయణరావు**




# 15. వృథాచేయం

కింది చిత్రం చూడండి.



**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రం చూడండి. ఏమి జరుగుతుందో చెప్పండి.
- పై చిత్రంలో లాగ జరగడం వల్ల ఏమవుతుంది?
- పై చిత్రంలోలా జరగకుండా ఉండాలంటే మనం ఏం చేయాలి?



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

**సాధారణంగా డబ్బును పొదుపు చేయాలని మనకు తెలుసు. అట్లే నీటిని పొదుపుగా వాడాలని కూడా తెలుసు. మరి ఇంకా వేటిని పొదుపుగా వాడాలో కూడా తెలుసుకోవాలి. శైలజ, లక్ష్మి, రాధలు దేని గురించి మాట్లాడుకొన్నారు? ఏమి పొదుపు చేయాలని ప్రతిజ్ఞ చేశారో పాఠం చదవండి. తెలుసుకోండి.**

ఆ రోజు ఆదివారం. శైలజ హడావిడిగా అన్నం తినేసి ఆడుకోవడానికి బయలుదేరింది. ఆమె చూపు గోడపై అతికించిన పెద్ద కాగితం మీద పడింది. ఏమిటా! అని ఆగి ఆసక్తిగా ఆ కాగితంవైపు అలా చూస్తూ ఉంది. అంతలోనే శైలజ స్నేహితులు లక్ష్మి, రాధ, సరిత, అనిరుధ్ వచ్చారు. "ఏమిటి శైలజా! అలా గోడవైపు కన్నార్పకుండా చూస్తున్నావు?" అంది లక్ష్మి. దానికి శైలజ "గోడమీద అతికించిన ఈ పెద్ద కాగితంలో ఏముందోనని చూస్తున్నాను" అంది. అందరూ కలిసి గోడ దగ్గరికి వెళ్లి ఆ కాగితాన్ని చదివారు. అందులో ఇలా ఉంది.

## వినియోగదారులారా!... ఒక్క నిమిషం ఆలోచించండి!

**విద్యుత్తు వినియోగదారులకు విజ్ఞప్తి,**

విద్యుత్తు విలువ మీకు తెలుసు. దాన్ని ఎంత పొదుపుగా వాడుకుంటే అంత మంచిది. లేకపోతే భవిష్యత్తు అంధకారమౌతుంది.

**విద్యుత్ పొదుపు చేయడానికి సూచనలు**

- ఇంట్లో ఉన్నప్పుడు, పగటిపూట బల్బులు వేసుకోకండి.
- సి.ఎఫ్.ఎల్ బల్బులను మాత్రమే వాడండి.
- గాలి, వెలుతురు కోసం ఫ్యాను, ఎ.సి., కూలర్లకు బదులు కిటికీలు తెరిచి ఉంచుకోండి.
- ఇంటిలో నుంచి బయటకు బయలుదేరేముందు తప్పనిసరిగా విద్యుత్తు నిలిపి వేసి వెళ్ళండి.
- మాటిమాటికి రిఫ్రిజిరేటర్‌ను తెరుస్తూ ఉండకండి.
- గీజర్/హీటర్ లిఫ్టుల వంటి వాటి వినియోగాన్ని తగ్గించండి.
- ఎలక్ట్రిక్ కుక్కర్, మైక్రోవేవ్ ఓవెన్‌కి బదులు గ్యాస్‌పొయ్యిని వాడండి.
- ప్రతిరోజూ కాకుండా కొన్ని రోజులకు అవసరమైన ఆహారపదార్థాలను దినుసులను రుబ్బి పెట్టుకోండి.
- విద్యుత్ ఆదాచేసే సామర్థ్యమున్న (ఐదు నక్షత్రాలు) ఎలక్ట్రానిక్ పరికరాలను మాత్రమే వాడండి.

**"విద్యుత్తు పొదుపు – రేపటికి వెలుగు"**

రాష్ట్ర విద్యుత్‌శాఖ, ఆంధ్రప్రదేశ్



©SCERT not to be republished

"ఇందులో విద్యుత్తుకు సంబంధించిన వివరాలు ఉన్నాయి." అంది లక్ష్మి. "అవును విద్యుత్‌ను పొదుపు చేయమని అందులో రాసి ఉంది" చెప్పింది రాధ. పరిశీలనగా చూస్తూ "ఇందులో చాలా వివరాలు ఉన్నట్లున్నాయే" అన్నాడు అనిరుధ్.

ఇంతలోనే వాళ్ళు ఆడుకోవడానికి బయలుదేరుతున్న విషయం గుర్తుకు వచ్చి మైదానం వైపు దౌడుతీశారు. వీళ్ళు వెళ్తున్న దారిలో ఇలాంటివే పెద్దపెద్ద కాగితాలను గోడలకు అతికించి ఉండటం గమనిస్తూ మైదానానికి చేరుకున్నారు.


మిగతా పిల్లలకు గోడలకు అతికించిన పెద్దకాగితాల గురించి అందులోని విషయాల గురించి చెప్పారు. అంతలోనే అక్కడికి నర్మద వచ్చింది. వాళ్ళను చూసి "ఏమిటి పిల్లలూ! దేని గురించి మాట్లాడుతున్నారు?" అని అడిగింది. నర్మదను చూసి పిల్లలందరూ సంతోషంతో "అక్కయ్యా!" అంటూ ఆమె చుట్టూ గుమిగూడారు.

**శైలజ** : అక్కయ్యా! మేము ఆడుకోవడానికని ఇటువైపు వస్తుంటే గోడలపై పెద్ద కాగితాలను అతికించారు. దాని గురించి మేమందరం మాట్లాడుకుంటున్నాం.

**నర్మద** : అలాగా! అయితే అందులో ఏముంది?

**శైలజ** : విద్యుత్తును ఆదాచేయమని రాసి ఉంది. ఇంకా.. చాలా వివరాలు అందులో రాసి ఉన్నాయి.

**నర్మద** : అదా సంగతి! నేను కూడా ఈ వైపు వస్తుంటే దారిలో చూశాను. మన గ్రామంలో గోడల మీద అతికించారు. పిల్లలూ... దాన్ని పెద్ద కాగితం అనకూడదు. "పోస్టరు" అనాలి.



**రాధ** : ఓహో! 'పోస్టరు' అంటారా! మరి దాన్ని ఎందుకలా అతికించారు?

**నర్మద** : విద్యుత్తు తయారీ కంటే వినియోగం ఎక్కువగా ఉంది కాబట్టి సరిపోవడంలేదు, అందుకే విద్యుత్తును ఆదా చేసి సహకరించమని పోస్టర్ ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

**లక్ష్మి** : ఈ పోస్టర్‌ని ఎవరు అతికించారు అక్కయ్యా!

© SCERT not to be republished

**నర్మద** : విద్యుత్‌శాఖ వాళ్ళు అతికించారు. ఇలాంటి పోస్టర్లు మీరు ఎక్కడైనా చూశారా?

**సరిత** : అవును అక్కయ్యా! ఇంత పెద్ద పోస్టరు కాదు గానీ. కొంచెం చిన్నది మన ఊరి తిరునాళ్ళ సందర్భంగా చూశాము.

**నర్మద** : అందులో ఏముంది సరితా?

**సరిత** : ఫిబ్రవరి 2వ తేదినుండి 9వ తేదివరకు ఊళ్ళో తిరునాళ్ళు జరుగుతాయని, అందరూ రావాలని ఉంది.

**నర్మద** : ఇంకా ఎవరైనా ఇలాంటి పోస్టర్లు చూశారా?

**అనిరుధ్** : నేను చూశాను అక్కయ్యా! పట్నం వెళ్ళినప్పుడు అక్కడ పెద్దపెద్ద సినిమా పోస్టర్లు అతికించారు.

**నర్మద** : ఓ! సినిమా పోస్టరా!

**అనిరుధ్** : అవును, దానిమీద హీరో బొమ్మలు, ఇంకా వేరే బొమ్మలు కూడా ఉన్నాయి. దానిమీద సినిమా పేరు ఉంది. దర్శకుని పేరు, నిర్మాత పేరు, ఇతరుల పేర్లు రాసి ఉన్నాయి.

**శైలజ** : మన ఊళ్ళో చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించమని కూడా పోస్టరు అతికించారు అక్కయ్యా!

**నర్మద** : అంటే మీరు వేరువేరు పోస్టర్లు చూశారు కదా! పోస్టర్లు రకరకాలుగా ఉంటాయి. జాతర గురించి, సర్కస్ గురించి, రకరకాల ప్రదర్శనలకు సంబంధించినవి, కళాశాలల వివరాలు... ఇలా రకరకాల పోస్టర్లు ఉంటాయి.

**లక్ష్మి** : ఈ పోస్టర్లు ఎందుకు అతికిస్తారు?

**నర్మద** : సమాచారం అందరికీ తెలియజేయడంకోసం, ప్రజలను చైతన్యపరచడంకోసం కార్యాలయాల్లో, కూడళ్ళలో, జనసమ్మర్దంగా ఉండే చోట పోస్టర్లను అతికిస్తారు. ఈ రోజు మీరు చూసిన పోస్టరు కూడా విద్యుత్తు ఆదా చేయడం కోసమని ప్రజలను చైతన్యపర్చడానికి ప్రదర్శించారు. ప్రభుత్వ శాఖలవారు ప్రజలను చైతన్యపరచడానికే కాక, ప్రభుత్వ కార్యక్రమాల గురించి తెలియజేయడానికి కూడా పోస్టర్లను ప్రదర్శిస్తారు. వ్యాపార సంస్థలవారైతే తమ సంస్థల గురించి, ఉత్పత్తుల గురించి ప్రచారం చేసుకోవడానికి పోస్టర్లను వాడుకుంటారు.

**అనిరుధ్** : అంటే.. సినిమా, సర్కస్ గురించి అతికించేలాంటివి కదా!

**నర్మద** : అవును.

**శైలజ** : కానీ, మన బడి దగ్గర వేసిన పోస్టరు విద్యాపక్షోత్సవాల గురించి అందరికీ తెలియజేయడం కోసం అతికించారు కదా!

**నర్మద** : అవును! పిల్లలను బడిలో చేర్పించండని అతికించారు.

**అనిరుధ్** : ఈ రోజు చూసిన పోస్టర్‌లో విద్యుత్తు అని రాసి ఉంది. అంటే ఏమిటి అక్కయ్యా?

©SCERT not to be republished

**నర్మద** : కరెంటునే విద్యుత్తు అంటారు. చాలా అవసరాలకు మనం విద్యుత్తును వినియోగిస్తున్నాం.

**లక్ష్మి** : నాకు తెలుసు అక్కయ్యా! ఇంట్లో బల్బు వెలగడానికి, టి.వి. నడవడానికి ఫ్యాన్ తిరగటానికి ఉపయోగిస్తాం కదా!



**నర్మద** : నువ్వు చెప్పింది నిజమే! వీటికే కాకుండా ఇంకా మన ఇళ్ళలో వేటికి ఉపయోగిస్తామో చెప్పండి.

**సరిత** : ఇంకా.. ఫ్రిజ్‌కి, ఇస్త్రీ పెట్టెకు, రైస్ కుక్కర్లకు, వాషింగ్ మిషన్‌కు కూడా వాడతాం.

**నర్మద** : వీటికే కాదు రైతులు పంటలు పండించడానికి, పరిశ్రమలు నడపడానికి, ఎలక్ట్రిక్ రైలు నడపడానికి బోలెడంత విద్యుత్తు అవసరం అవుతుంది.



**రాధ** : ఇన్ని ఉపయోగాలు ఉన్నాకూడా విద్యుత్తును ఎందుకు ఎక్కువగా నిలిపివేస్తున్నారు?

**నర్మద** : మన అవసరాలకు సరిపడా విద్యుత్తు ఉత్పత్తి కావడం లేదు. జలాశయాల్లో నీళ్ళు అడుగంటిపోయాయి. బొగ్గునిల్వలు తగ్గిపోయాయి. కాబట్టి విద్యుత్తు కోతలు విధిస్తున్నారు.

**అనిరుధ్** : విద్యుత్తు కోతకు నీళ్ళకు ఏమిటి సంబంధం అక్కయ్యా?




**నర్మద** : విద్యుత్తు ఉత్పత్తికి నీటిని వినియోగిస్తారు. జలాశయాల్లో నీళ్ళను నిలవ చేసి, ఆ నీటిని గేట్ల ద్వారా వదిలి టర్బయిన్‌లను తిప్పుతారు. టర్బయిన్ల ద్వారా యాంత్రికశక్తిని విద్యుచ్ఛక్తిగా మారుస్తారు. జలాశయాల్లో ఇందుకు సరిపడా నీరు లేదు కాబట్టి విద్యుత్తు తయారుకావడం లేదు.

**శైలజ** : మరీ! బొగ్గుకు, విద్యుత్తు కోతలకు సంబంధం ఏమిటి?







© SCERT not to be republished

**నర్మద** : మన రాష్ట్రంలో ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి బొగ్గు ద్వారానే జరుగుతుంది. దీన్నే థర్మల్ విద్యుత్ అంటారు. బొగ్గును మండించడం ద్వారా వెలువడే శక్తితో నీటిని ఆవిరిగా మార్చి, ఆ నీటి ఆవిరితో టర్బయిన్‌లను తిప్పి యాంత్రికశక్తిని విద్యుచ్ఛక్తిగా మారుస్తారు.

**లక్ష్మి** : విద్యుత్తు ఉత్పత్తి వెనక ఇంత కథ ఉందా, అక్కయ్యా!

**అనిరుధ్** : అయితే... ఈ విద్యుత్ కోతల వల్ల టి.వి. చూడలేకపోతున్నాం. చాలా ఇబ్బందిగా ఉంది అక్కా!

**శైలజ** : వీడికి ఎప్పుడూ టి.వి. గొడవే! పొద్దస్తమానం టి.వి. చూస్తూనే ఉంటాడు.

**నర్మద** : ఈ కోతలనుంచి బయటపడాలంటే మనం కూడా విద్యుత్తును ఆదా చేయాలి.

**సరిత** : ఆదా చేయడమా? అదెలా!

**నర్మద** : మన ఇళ్ళలో అనవసరంగా విద్యుత్తును ఉపయోగిస్తూ ఉంటాం. అలాంటివి తగ్గిస్తే ఆదా అవుతుంది. ఉదా॥ అవసరం లేకున్నా ఫ్యాన్ వేయడం, ఫ్రిజ్ డోర్‌ను మాటి మాటికి తీయడం, ఇంట్లో ఎక్కువ బల్బులు వాడడం, అనవసరంగా బల్బులను వెలిగించడం, పగటిపూట బల్బులను వెలిగించడం వల్ల విద్యుత్తును వృథా చేస్తున్నాం.

**శైలజ** : అవును... పగటిపూట కూడా మా ఇంట్లో బల్బులు వెలుగుతూనే ఉంటాయి.

**అనిరుధ్** : మా ఇంట్లో కూడా రోజంతా టి.వి పనిచేస్తుంది. హాల్లో ఎప్పుడూ ఫ్యాన్ తిరుగుతూ ఉంటుంది.

**నర్మద** : చూశారా! ఇవన్నీ విద్యుత్తును అనవసరంగా వృథా చేయడమే. మీకోవిషయం చెప్పనా! ఇవన్నీ తగ్గిస్తే మీరు కూడా విద్యుత్తును ఉత్పత్తి చేసినట్లే! అందుకే విద్యుత్తును వినియోగించే ముందు ఒక్క నిమిషం ఆలోచించండి!



**పిల్లలందరూ** : అలాగే అక్కయ్యా! ఈ రోజు నుండి మేమందరం మా ఇళ్ళల్లో అనవసరంగా విద్యుత్తును వృథా చేయం అని ప్రతిజ్ఞ చేస్తున్నాం.

అని పిల్లలందరూ నర్మద అక్కయ్య దగ్గర నుండి వెళ్ళి ఆటల్లో నిమగ్నమయ్యారు.

© SCERT not to be republished

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



అ) పోస్టర్లను జన సమ్మర్ధంగా ఉన్న ప్రాంతాల్లో అతికిస్తారు. ఎందుకో చెప్పండి.

ఆ) మీ ఇంట్లో వేటికి విద్యుచ్ఛక్తిని వాడతారు? వీటిలో దేనికి విద్యుత్తు వినియోగం ఎక్కువగా అవసరం ఉంది?

ఇ) గృహావసరాలతోపాటు మీ గ్రామంలో ఇంకా ఏ ఏ కార్యక్రమాలకు విద్యుచ్ఛక్తిని వాడుతారు? దీని వల్ల ఏం జరుగుతుంది?

ఈ) మీ గ్రామంలో/వీథిలో విద్యుత్తును అవసరం మేరకే వినియోగిస్తున్నారా? లేక వృథాగా వినియోగిస్తున్నారా? ఎలాగో చెప్పండి.

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



అ) కింది పోస్టరును చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

### గ్రామ ప్రజలారా! జాగ్రత్త పడండి! నీటిని పొదుపుగా వాడండి!

గ్రామ ప్రజలకు విజ్ఞప్తి

**నీటి వృథాను అరికట్టండి.**

- నీరు మనకు ప్రాణాధారం.
- ప్రతి నీటి చుక్కా విలువైనదే!
- నీటిని పొదుపుగా వాడుకొందాం!
- మన వాడకం అవసరం మేరకు మాత్రమే నీటిని వినియోగిద్దాం.
- నీరు ఎక్కడైనా పంపుల ద్వారా, కుళాయిల ద్వారా వృథా అవుతుంటే వెంటనే మునిసిపాలిటి / పంచాయితీ వారికి తెలియజేయండి.
- కుళాయి వదిలేసి పనులు చేయకండి. బకెట్‌లో పట్టుకొని నీటిని వాడండి.
- వాడుకొన్న నీటిని మొక్కలకు మళ్ళించండి.
- వర్షపు నీరు వృథా కాకుండా ఇంకుడుగుంత ద్వారా భూగర్భజలాలను వృద్ధి పరుద్దాం.

గ్రామ పంచాయతి
తిమ్మాపురం

1. పోస్టరు దేన్ని గురించి తెలియజేస్తోంది ?
2. పోస్టరును ఎందుకోసం అతికించారు ?
3. పోస్టరు ద్వారా నీవు తెలుసుకున్న మూడు ముఖ్యమైన విషయాలు ఏవి ?

© SCERT not to be republished



**ఆ) పాఠం చదివి కింది వాక్యాలు ఎవరు ఎవరితో అన్నారో చెప్పండి.**

1. "ఏమిటి! శైలజా! అలా గోడవైపు కన్నార్పకుండా చూస్తున్నావు?"
2. అదా సంగతి! నేను కూడా ఈ వైపు వస్తుంటే దారిలో చూశాను.
3. 'పోస్టరు' అంటారా ! మరి దాన్ని ఎందుకు అలా అతికించారు?
4. విద్యుత్తు కోతకు నీళ్ళకు ఏమిటి సంబంధం అక్కయ్యా?
5. అవును... పగటిపూట కూడా మా ఇంట్లో బల్బులు వెలుగుతూనే ఉంటాయి.

**ఇ) పాఠంలోని పోస్టరును చదవండి, దాని ఆధారంగా మీ ఇంట్లో ఏమేమి అమలు చేస్తున్నారు? ఏమేమి అమలు చేయడం లేదో రాయండి.**

| అమలు చేసేవి | అమలు చేయనివి |
|---|---|
| ................................ | .................................... |

**ఈ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. పోస్టరు గమనించాక పిల్లలు ఏమని చర్చించుకొన్నారు?
2. పోస్టరును ఎందుకు అతికిస్తారు ?
3. విద్యుత్తు ఉత్పత్తి ఏ ఏ విధాలుగా జరుగుతుంది?
4. విద్యుత్తును ఏ ఏ అవసరాలకు వాడుకొంటున్నాం?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



అ) "విద్యుత్తు శక్తిని పొదుపు చేస్తే మీరు దాన్ని ఉత్పత్తి చేసినట్లే" దీన్ని సమర్థిస్తూ నాలుగు వాక్యాలు రాయండి.

ఆ) ఏదైనా అంశాన్ని గురించి ప్రచారం చేయాలన్నా ఇతరులకు తెలపాలన్నా పోస్టరును ఉపయోగిస్తారు కదా! అలాగే విద్యార్థులుగా మీరు ఏ ఏ అంశాల గురించి మీ వీధివాళ్ళకు/ ఊరివాళ్లకు పోస్టరు ద్వారా తెలియజేయాలనుకుంటున్నారు? ఎందుకు?

ఇ) విద్యుత్తు ఆదాచేసినట్లే మనం ఇంకా వేటిని ఆదాచేయాల్సిన అవసరం ఉంది? ఎందుకు?

ఈ) విద్యుచ్ఛక్తిని పొదుపుగా వాడాలని తెలుసుకున్నారు కదా! విద్యుత్తును పొదుపు చేయడానికి మీరేం చేస్తారో రాయండి.

© SCERT not to be republished

## IV పదజాలం



అ) విద్యుత్తుతో పనిచేసే సాధనాల పేర్లను రాయండి. వాటితో వాక్యాలు రాయండి.

ఆ) కింది పదాలకు సమాన అర్థాలు వచ్చేవి పాఠంలో ఉన్నాయి. వాటి ఆధారంగా సొంతవాక్యాలు రాయండి.

| పదం | సమాన అర్థం | సొంత వాక్యం |
|---|---|---|
| విన్నపం | | |
| జాతర | | |
| ఆదా | | |
| అనవసరంగా ఖర్చు | | |
| ఉత్పత్తి | | |

ఇ) కింది వాక్యాలను ఒకే పదంలో సూచించండి.

1. అనవసరంగా విద్యుత్తును వృథా చేయకుండుట......................
2. సమాచారాన్ని పెద్ద కాగితంమీద ప్రదర్శించేది......................
3. పిల్లలు ఆటలాడుకునే స్థలం ......................
4. దేవాలయం దగ్గర ప్రతి ఏటా జరిపే ఉత్సవం......................
5. ఎక్కువ నీరు నిలవ ఉంచే చోటు ......................

## V సృజనాత్మకత



అ) ఈ రోజుల్లో పిల్లలు బయటి చిరుతిళ్ళకు (fast food) అలవాటు పడ్డారు. కానీ దానివల్ల కలిగే అనారోగ్య సమస్యలు తెలియవు. కింద ఇచ్చిన పదాలు ఆధారంగా పాఠశాల అసెంబ్లీలో చెప్పడానికి ఒక సందేశాన్ని తయారు చేయండి.

బయటి చిరుతిళ్ళకు (fast food) కి దూరంగా ఉండండి.

- ఆరోగ్యానికి మంచిది కాదు
- అపరిశుభ్రమైనవి
- పోషకాలు లేనివి
- మసాలతో తయారైనవి
- ఖరీదైనవి
- తాజాగా ఉండవు

ఆ) విద్యుత్తు శాఖవారి పోస్టరును చూశారు కదా! అట్లాగే గ్రామంలో మొక్కలు నాటాలని సూచించేలా ఒక పోస్టరును తయారు చేయండి. ప్రదర్శించండి.


© SCERT not to be republished

## VI ప్రశంస



అ) మీరు బడికి వెళ్తూ ఉంటే ఊళ్లో వీధి దీపాలు వెలుగుతుండడం గమనించారు. విద్యుత్తు దుర్వినియోగం మీద తగిన చర్యలను తీసుకోవాలని సర్పంచికి విన్నవిస్తూ లేఖ రాయండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



**అ) కింది సంశ్లిష్ట వాక్యాలను చదవండి. రెండు వాక్యాలుగా రాయండి.**

1. పావురం వచ్చి, రాజు దగ్గర వాలింది.
2. పాము చెట్టు దిగి, పుట్టలోకి పోయింది.
3. చీమ ఆకుమీద చేరి, ఒడ్డుకు చేరింది.
4. అతడు అంచెలంచెలుగా ఎదిగి, గొప్ప స్థానాన్ని పొందాడు.
5. చేప చిక్కినట్టే చిక్కి, తప్పించుకొంది.

**ఆ) కింది సంయుక్త వాక్యాలను చదవండి. గీతగీసిన పదాలు ఉండేలా మరికొన్ని వాక్యాలను రాయండి.**

1. ఉరుములు, మెరుపులు రాలేదు, <u>అయినా</u> పెద్ద వర్షం కురిసింది.
2. అక్షరాలు స్పష్టంగా రాయాలి, <u>లేకపోతే</u> అర్థం కాదు.
3. శ్రీవేద బాగా పాటలు పాడింది, <u>కాబట్టి</u> పోటీలో బహుమతి వచ్చింది.
4. ఉదయాన్నే రైలు ఎక్కి వెళ్ళు <u>లేదా</u> ఇప్పుడు బస్సెక్కి వెళ్ళు.

© SCERT not to be republished

### ప్రాజెక్టు పని

మీ గ్రామంలో ఏ ఏ అంశాల మీద పోస్టర్లు ఉన్నాయి. ఇవి వేటికి సంబంధించినవి? వాటిలోని వివరాలను తెలియజేయండి.

### నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | పోస్టర్ల గురించి విద్యుత్తు వినియోగం, పొదుపు గురించి చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | పాఠాన్ని ధారాళంగా చదవగలను. ఎవరు ఎవరితో ఏమన్నారో చెప్పగలను. | ఔను/కాదు |
| 3. | మొక్కలు నాటడంపై పోస్టరును తయారుచేసి ప్రదర్శించగలను. | ఔను/కాదు |
| 4. | నీటి పొదుపుపై పోస్టరును తయారు చేయగలను. | ఔను/కాదు |

ఇసుమంత ఆచరణ ఇరవైవేల టన్నుల వ్యర్థమైన మాటలతో సమానం.

- స్వామి వివేకానంద

నాలుగో యూనిట్

# 16. శతకపద్యాలు


కింది చిత్రం చూడండి.




© SCERT not to be republished


## ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- చిత్రంలోని పాప ఏం చదువుతున్నది?
- ఆ పద్యం భావం ఏమై ఉంటుంది?
- ఇలాంటి పద్యాలు మీకు తెలుసా?



### పిల్లలూ! ఇలా చేయండి.

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.



1. **వేరుపురుగు చేరి వృక్షంబు జెఱచును**
**జీడపురుగు చేరి చెట్టు చెఱచు**
**కుత్సితుండు చేరి గుణవంతు జెఱచురా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**భావం:** వేరుపురుగు వేరును తొలిచి చెట్టును పాడుచేస్తుంది. అట్లాగే చీడపురుగు చెట్లపైకి చేరి చెట్లను పాడు చేస్తుంది. కీడుజేసేవాడు గుణవంతుణ్ణి కూడా చెడగొడతాడు.

2. **ఇనుము విఱిగెనేని యినుమారు ముమ్మారు**
**కాచి యతుక వచ్చు గ్రమము గాను**
**మనసు విఱిఁగెనేని మఱి చేర్చరాదయా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**భావం:** ఇనుము రెండు, మూడు సార్లు విరిగినా కూడా దాన్ని వేడి చేసి మళ్ళీ అతికించవచ్చు. కాని మనసు విరిగితే మాత్రం మళ్ళీ కలపడం వీలుకాదు.



© SCERT not to be republished



3. **ఏరకుమీ కసుగాయలు**
**దూరకుమీ బంధుజనుల దోషము సుమ్మీ**
**పారకుమీ రణమందున**
**మీరకుమీ గురువులాజ్ఞ మేదిని సుమతీ!**

**భావం:** భూమిపై పచ్చికాయలు ఏటి తినకూడదు. చుట్టాల తప్పులను ఎంచగూడదు. యుద్ధం నుండి వెనుదిరిగి పారిపోగూడదు. పెద్దల ఆజ్ఞలను జవదాటగూడదు.



4. **ఆకొన్న కూడె యమృతము**
**తాగొంకక నిచ్చువాడె దాత ధరిత్రిన్**
**సోకోర్చువాఁడె మనుజుఁడు**
**తేకువ గలవాఁడె వంశతిలకుఁడు సుమతీ!**

**భావం:** లోకంలో ఆకలితో ఉన్నప్పుడు తినే అన్నమే అమృతంలా ఉంటుంది. దేనికైనా వెనకడుగువేయక దానం చేసేవాడే దాత. కష్టానికి ఓర్చుకొనేవాడే మానవుడు. ధైర్యం గలవాడే వంశంలో గొప్పవాడు.

5. **సద్గోష్ఠియె సిరి యొసగును**
**సద్గోష్ఠియె కీర్తి పెంచు సంతుష్టిని నా**
**సద్గోష్ఠియె ఒనగూర్చును**
**సద్గోష్ఠియె పాపములను చరచు కుమారా!**




**భావం:** మంచివారితో స్నేహంచేయడంవల్ల సంపద పెరుగుతుంది. పేరుప్రతిష్ఠలు వస్తాయి. సంతృప్తి కలుగుతుంది. పాపాలు కూడా తొలగిపోతాయి.

© SCERT not to be republished




6. **సాధు సంగమమున సామాన్యుడును గూడ**
**మంచి గుణములను గ్రహించుచుండు**
**పుష్పసౌరభంబు పొందదా దారంబు**
**లలిత సుగుణ జాల! తెలుగు బాల!**

**భావం:** పూలను కుచ్చడం వల్ల వాటి సుగంధం దారానికి కూడా అబ్బుతుంది. అలాగే మంచివారితో కలిసి ఉండడంవల్ల సామాన్యుడు కూడా మంచిగుణాలను అలవరచుకొంటాడు.



7. ఇనుఁడు వెలుగు నిచ్చు; ఘనుఁడు వర్షము నిచ్చు;
గాలి వీచు; చెట్లు పూలు పూచు
సాధుపుంగవులకు సహజ లక్షణమిది
లలిత సుగుణ జాల! తెలుగు బాల!

**భావం:** సూర్యుడు వెలుగు నిస్తాడు. మేఘాలు వర్షాన్ని ఇస్తాయి. గాలి వీస్తుంది. చెట్లు పూలు పూస్తాయి. గొప్పవారికి ఇలాంటి లక్షణాలు సహజంగా ఉంటాయి.



8. ధర్మగుణము మించు ధనధాన్యములు లేవు
విద్యకన్న మించు విభవమేది
నీతి వేరెలేదు నిజము పల్కుట కంటె
తెలిసికొమ్ము నీవు తెలుగుబిడ్డ.

**భావం:** ఓ తెలుగుబిడ్డా! ధర్మగుణానికి మించిన ధనమూ లేదు. ధాన్యమూ లేదు. విద్యకన్నా మించిన సంపద లేదు. నిజం పల్కుట మాత్రమే నీతి అని తెలుసుకో.

© SCERT not to be republished



9. ఎఱుక గలవారి చరితలు
గఱచుచు సజ్జనుల గోష్ఠి గదలకు ధర్మం
బెఱుగుచు నెఱిగిన దానిని
మఱువ కనుష్ఠించునది సమంజస బుద్ధిన్

**భావం:** జ్ఞానవంతుల చరిత్రలు తెలుసుకోవాలి. మంచివారి సాంగత్యంతో ధర్మం గ్రహించాలి. తెలుసుకున్న ధర్మాన్ని మరవకుండా మంచి బుద్ధితో ఆచరించాలి.

– **మహాభారతం**



10. శ్రద్ధ లేనియెడల చదువు సాములు రావు
శ్రద్ధయున్న రానిచదువు లేదు.
శ్రద్ధ కలిగెనేని చంద్రమండల యాత్ర
సులభసాధ్యమె యగు తెలుగుబిడ్డ.

**భావం:** ఓ తెలుగు బిడ్డా! శ్రద్ధ లేకపోతే చదువు సంధ్యలు రావు. శ్రద్ధ ఉంటే దేన్నైనా సాధించవచ్చు. చంద్రమండలాన్ని కూడా చేరుకోవచ్చు. శ్రద్ధే అన్నిటికీ మూలం.

## కవి పరిచయాలు

| శతకం పేరు | రాసినవారు |
|---|---|
| సుమతీ శతకం | బద్దెన |
| వేమన శతకం | వేమన |
| కుమార శతకం | పక్కి అప్పల నరసయ్య |
| మహాభారతం | నన్నయభట్టు |
| తెలుగు బాల | కరుణ శ్రీ |
| తెలుగు బిడ్డ | నార్ల చిరంజీవి |

© SCERT not to be republished

## ఇవి చేయండి

### I వినడం, ఆలోచించి చెప్పడం



అ) పద్యాలను చూడకుండా రాగయుక్తంగా, చక్కగా చదవండి. వాటి భావం చెప్పండి?

ఆ) పెద్దల ఆజ్ఞలను జవదాటగూడదని తెలుసుకున్నారు కదా! మీరు పెద్దలపట్ల ఎలా ప్రవర్తిస్తారో చెప్పండి.

ఇ) శ్రద్ధ ఉంటే చదువు వస్తుందని తెలుసుకున్నారు కదా! మీరు మీ పాఠశాలలో ఎలా చదువుతున్నారో చెప్పండి.

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



**అ) కింది భావాలకు సరైన పద్యపాదాలు రాయండి.**

1. మనసు విరిగితే మళ్ళీ కలపలేం.
2. ధైర్యం గలవాడే వంశంలో గొప్పవాడు.
3. పూలను గుచ్చడం వల్ల వాటి సువాసనలు దారానికి కూడా అంటుతుంది.
5. శ్రద్ధ ఉంటే దేన్నైనా సాధించవచ్చు.

**ఆ) కింది పదాలు ఏ సందర్భాల్లో వచ్చాయో రాయండి.**

1. చీడపురుగు చేరి చెట్టు చెఱచు.
2. దూరకుమీ బంధుజనుల దోషము సుమ్మీ.
3. సద్గోష్ఠియె సిరియొసగును.
4. గాలి వీచు; చెట్లు పూలుపూచు

**ఇ) పాఠం చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. గొప్పవారి లక్షణాలను వేటితో పోల్చారు?
2. మంచివారి సాంగత్యంవల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి?
3. శ్రద్ధవల్ల ప్రయోజనాలేమిటి?

©SCERT not to be republished

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)




అ) మంచివారితో స్నేహం చేయడం వల్ల మంచి జరుగుతుందని తెలుసుకున్నాం కదా! దీనిని సమర్థిస్తూ రాయండి.

ఆ) శ్రద్ధ ఉంటే ఏదైనా సాధించవచ్చు అని తెలుసుకున్నారు కదా! వేటి పట్ల శ్రద్ధ కలిగి ఉండాలి? శ్రద్ధతో ఏం సాధించాలనుకుంటున్నారు?

ఇ) బంధువులను దూషించరాదు కదా! మీ బంధువులతో మీరు ఎలా ప్రవర్తిస్తారో సొంతమాటల్లో రాయండి.

## IV పదజాలం



**అ) కింది వాక్యాలలో గీత గీసిన పదానికి సరైన అర్థాన్ని గుర్తించి దాని కింద గీత గీయండి.**

1. మనం **<u>ధరిత్రి</u>**పై నివసిస్తున్నాం. (భూమి/ఆకాశం)
2. అన్ని జీవులకు **<u>వాయువు</u>** అవసరం. (గాలి/కాఫీ)
3. పెద్దలపట్ల **<u>మర్యాద</u>**గా ఉండాలి. (గౌరవం/అశ్రద్ధగా)


## V సృజనాత్మకత



అ) పాఠంలోని ఏదైనా ఒక పద్యభావం వచ్చేటట్లు ఒక కథ రాయండి.


ఆ) ఏది సాధించాలన్నా శ్రద్ధ అవసరమని మీ మిత్రునికి ఒక లేఖ రాయండి.

## VI ప్రశంస



తెలుగు భాషలోని 'పద్యాలు' ప్రసిద్ధమైనవి. వేమన, సుమతి శతకాలు, కుమార శతకం, నార్ల చిరంజీవి, తెలుగు బిడ్డ వంటి శతక పద్యాలు పిల్లలందరూ నేర్చుకోవలసినవి. మీకు ఎన్ని పద్యాలు వస్తాయి? ఒక్కొక్కరు కనీసం యాభై పద్యాలు చదవగలగాలి. రాయగలగాలి. మీ తరగతిలో ఇలా యాభై పద్యాలు ఎవరికి వస్తాయో చెప్పండి. వాళ్ళను ఎలా అభినందిస్తారో చెప్పండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



**అ) కింది వాక్యాల్లోని విభక్తులను గుర్తించి గీతగీయండి.**

1. వేరుపురుగు వేరును తొలుస్తుంది.
2. లోకంలో ఆకలి సమయంలో తినే అన్నమే అమృతంతో సమానం.
3. మంచి వారితో స్నేహం చేయడంవల్ల మన విలువ పెరుగుతుంది.

**ఆ) కింది విభక్తులను ఉపయోగించి వాక్యాలు రాయండి.**

ని, కి, కు, గురించి, వలన, కొరకు, లో, తో

**ఉదా:** సీత లక్ష్మిని తోడుతీసుకొని వెళ్ళింది.

### ప్రాజెక్టు పని

మీ తరగతి గ్రంథాలయంలోని వేమన శతకం, సుమతీ శతకం వంటి పుస్తకాలు చూడండి. వాటిలో మీకు తెల్సిన పద్యాలు ఎన్ని? తెలియని పద్యాలు ఎన్నో రాయండి. మీకు తెలియని పద్యాలలో మీకునచ్చిన ఏవైనా ఐదు పద్యాలు రాయండి. వాటి భావాన్ని చెప్పండి.

© SCERT not to be republished

### నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | పద్యాలను రాగ, భావ యుక్తంగా చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | పద్యాలను, భావాలను చదవగలను. ప్రశ్నలకు జవాబులు రాయగలను. | ఔను/కాదు |
| 3. | పద్యభావాల ఆధారంగా సొంతమాటల్లో జవాబులు రాయగలను. | ఔను/కాదు |
| 4. | పద్యభావాలకు తగిన కథను రాయగలను. | ఔను/కాదు |

పెద్దవారి మాటలు విందులు కావు. మందులు.
- శ్రీ సత్యసాయి

చదువు ఆనందించు

# అన్నదమ్ములకథ

రామాపురం అనే ఊరిలో ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. వాళ్ళ తండ్రి చనిపోతూ వారిద్దరికీ ఒక మామిడి చెట్టు, ఒక ఆవు, ఒక కంబళి ఇచ్చి వాటిని ఇద్దరూ సమానంగా అనుభవించమని చెప్పి చనిపోయాడు.

ఆ ఇద్దరిలో తమ్ముడు అమాయకుడు. అన్న గడుసువాడు. అన్న తమ్ముడితో "నాన్న మనకు ఒకే చెట్టు, ఒకే ఆవు, ఒకే కంబళి ఇచ్చాడు కదా! వాటిని ముక్కలు చేయకూడదు. కనుక వాటిని కలిసి ఉపయోగించుకుందాం. చెట్టు మొదలు భాగం నీకు, పై కొమ్మల భాగం నాకు. అట్లాగే ఆవు ముందు భాగం నీకు వెనుక భాగం నాకు. ఇక కంబళి పగలంతా నువ్వు వాడుకో, రాత్రికి నాకు ఇచ్చేయ్" అన్నాడు అన్న. తమ్ముడు అందులోని కపటం తెలియక సరేనన్నాడు. రోజూ తమ్ముడు చెట్టు మొదట కుదుర్లో నీళ్ళు పోసేవాడు, ఆవుకు మేత, కుడితి పెట్టేవాడు. కంబళిని ఉతికి ఆరవేసి మడిచి పెట్టేవాడు. అన్న కొమ్మలకు కాసిన కాయలు, పండ్లు తాను తీసుకొనేవాడు. ఆవు పాలు తాను పితుకుకొనేవాడు. అన్న చక్కగా రాత్రిపూట కంబళిని కప్పుకొనేవాడు.

ఇట్లా కొంతకాలం గడిచింది. తమ్ముడికి పెళ్ళి అయ్యింది. అతని భార్య అమాయకుడైన తన భర్తను అతడి అన్న ఎట్లా మోసం చేస్తున్నాడో గమనించింది. భర్తతో ఒక మాట చెప్పి ఆ విధంగా చేయమన్నది. భార్యమాట ప్రకారంగా తమ్ముడు ఒక గొడ్డలి తెచ్చి దాంతో చెట్టు మొదలును నరకడం మొదలుపెట్టాడు. దానికి అన్న "చెట్టు ఎందుకు నరుకుతున్నావు" అని అడగగా "చెట్టు మొదలు నాది కదా! నాయిష్టం! అన్నాడు తమ్ముడు. మొదలు కొడితే చెట్టు మొత్తం చచ్చిపోతుంది కొట్టకు. ఇక నుంచి కాసేపండ్లు చెరిసగం తీసుకుందాం" అన్నాడు అన్న.

అన్న పాలు పితికే వేళకు తమ్ముడు ఆవుకు మేత వేయకపోగా ఒక కర్ర తీసుకొని ఆవు ముట్టెమీద కొట్టసాగాడు. పాలివ్వకుండా ఆవు అన్నని తన్నింది. "అదేమిటి?" అని అన్న అడిగితే, "ఆవు ముందు భాగం నాది కదా! నా ఇష్టం" అని బదులు చెప్పాడు తమ్ముడు. అన్న అప్పుడు "ఇక మీదట ఇద్దరమూ ఆవును మేపుదాం, పాలు కూడా సమానంగా పంచుకొందాం" అన్నాడు.



ఆ మరునాడు తమ్ముడు కంబళిని పగటిపూట నీటిలో తడిపి, ఆ తడి కంబళిని సాయంత్రం అన్నకు ఇచ్చాడు. అన్న దానిని ఉపయోగించు కోలేకపోయాడు. దాంతో అన్నకు బుద్ధివచ్చి, 'తన తప్పును క్షమించమని' తమ్ముడిని బతిమాలాడు. ఆ తర్వాత అన్నదమ్ములిద్దరూ సమానంగా అన్నిటినీ అనుభవిస్తూ హాయిగా సుఖంగా జీవించారు.

© SCERT not to be republished

# పదాలు - అర్థాలు

### అ

అంధకారం = చీకటి

అక్షయ = నశించని, తిరుగులేని

అఖండం = నిండైనది

అద్భుత = ఆశ్చర్యకరమయిన

అధ్యయనం = నేర్చుకోవడం

అనాదిగా = చాలా పూర్వంనుండి

అనుజ్ఞ = అనుమతి

అనురాగం = ప్రేమ

అనుష్ఠించు (క్రి.) = ఆచరించడం, పాటించడం

అన్వేషణ = వెదకడం

అభినందించు (క్రి.) = మెచ్చడం, శుభాకాంక్షలు చెప్పడం

అర్చించు (క్రి.) = పూజించడం

అర్ధనారీశ్వరుడు = శివుడు (సగభాగం స్త్రీగా ఉన్న ఈశ్వరుడు)

అలనాడు = ఆరోజు, పూర్వకాలంలో

అల్లారు ముద్దుగా = అధిక ప్రేమతో

అవగాహన = ఆకళింపు, అర్థంచేసుకోవడం

అవనత = దించిన, వంచిన

అశ్రువులు = కన్నీళ్ళు

అష్టాదశ = పద్దెనిమిది

### ఆ

ఆకసం = ఆకాశం

ఆజ్ఞ = ఆదేశం, ఉత్తరువు

ఆత్మవిశ్వాసం = తనపై తనకున్న నమ్మకం

ఆదరించు (క్రి.) = గౌరవించడం, దగ్గరకు తీయడం

ఆదా = పొదుపు, లాభం, మిగులు

ఆధునికం = నవీనం, ఇప్పటిది, కొత్తది

ఆనందం = సంతోషం

ఆనవాళ్ళు = తెలుసుకొనే గుర్తులు

ఆప్యాయంగా = ప్రేమగా

ఆమదోషం = రోగబాధ

ఆమోదించు (క్రి.) = ఒప్పుకోవడం

ఆరగించు (క్రి.) = తినడం

ఆరాధించు (క్రి.) = పూజించడం, అర్చించడం

ఆరామము = తోట

ఆలపించు (క్రి.) = పాడటం

ఆలయం = గుడి, ఇల్లు

ఆవల = అవతల, బయట

ఆవిర్భవించు (క్రి.) = పుట్టడం

ఆవిష్కరించు (క్రి.) = వెల్లడించడం, ప్రకటించడం, విడుదల చేయడం

ఆశీర్వదించు (క్రి.) = దీవించు

ఆహ్లాదం = సంతోషం

ఆహ్వానం = పిలుపు

### ఇ

ఇంపు = ఇష్టం, ఆనందం

ఇతిహాసం = రామాయణం లేదా మహాభారతం, జరిగినది

ఇనుడు = సూర్యుడు

ఇనుమడింపజేయు(క్రి.) = రెట్టింపు చేయడం

ఇరవు = స్థానం

ఇరుమారు = రెండు సార్లు

ఇసుమంత = కొద్దిగ (ఇసుకంత)

### ఉ

ఉత్కంఠ = తహతహ, తెలుసుకోవాలన్న ఆత్రం

ఉత్పత్తి = పుట్టుక, తయారుచేయడం

ఉత్సవం = పండుగ

ఉద్భవం = పుట్టడం

ఉద్యమం = ప్రయత్నం, పోరాటం

ఉబ్బి = పొంగి, సంతోషించి

### ఎ

ఎద = హృదయం

ఎడబాయని = వదలని

ఎఱుకగలవారు = జ్ఞానవంతులు, తెలివైనవారు

ఎల్ల = హద్దు

### ఏ

ఏకైక = ఒక్కొక్క ; ఒకే ఒక

ఏండ్లు = సంవత్సరాలు

### ఒ

ఒనగూర్చు = సిద్ధించు, కలిగించు

### ఔ

ఔదార్యం = దానగుణం, ఉదారత

### క

కంబళి = గొంగడి, ఉన్నితో నేసిన దుప్పటి

కడు = అధిక, చాలా

కరతాళధ్వనులు = చప్పట్లు

కరవీరం = గన్నేరు, కత్తి

కరుణ = దయ

కర్షకులు = రైతులు

కలకాలం = ఎల్లప్పుడు

కలుపుతీయు (క్రి.) = పంట మొక్కల మధ్య పెరిగిన ఇతరమైన పనికిరాని మొక్కలను పీకివేయడం

కళాతృష్ణ = కళల పట్ల ఆసక్తి

కసుగాయలు = లేతకాయలు

కళ్యాణం = పెళ్లి

కాంతి = వెలుతురు

కారా = చెఱసాల

కాలికి బుద్ధి చెప్పు(క్రి.)= పారిపోవడం

కాసులు = నాణేలు, ధనం, డబ్బులు

కిక్కిరిసి = ఎడం లేకుండా వ్యాపించి

క్రిమిసంహారిణి = క్రిములను చంపేది

కుంచె = చిత్రం గీసే కుచ్చు కఱ్ఱ, బ్రష్

© SCERT not to be republished

కుత్సితంబు = చెడ్డబుద్ధి, మోసం, అసూయ
కుందు (క్రి.) = శోకించుట
కునుకు (క్రి.) = నిద్రతో తూగడం, జోగడం
కుమారి = కన్యాకుమారి (పాఠంలోని అర్థం)
కుళాయి = నీటి పంపు
కృతజ్ఞత = చేసిన మేలు తలచడం, మరవకపోవడం
కేతనం = జెండా
కేరింతలు = ఉత్సాహంతో కేకలు వేయడం
క్షేత్రం = పుణ్యస్థలం, స్థలం, పొలం
కొంకక = భయపడక, వెనకడుగువేయక
కొనియాడు (క్రి.) = పొగడు
కొలను = సరస్సు, చెరువు, మడుగు
కొలుచు (క్రి.) = సేవించు, ఉపాసించు
కొలువు = సభ, ఆస్థానం
కోలాహలం = సందడి, కలకలం
కోవిదులు = పండితులు, విద్వాంసులు

### ఖ

ఖండం = భాగం
ఖరారు = స్థిరపరచడం, నిర్ధారించడం
ఖరీదైన = విలువైన, ఎక్కువ ధరకలిగిన
ఖ్యాతి = పేరు, కీర్తి, ప్రసిద్ధి

### గ

గంగాళం = నీళ్ల కొప్పెర, పెద్ద పాత్ర
గంజి వార్చు (క్రి.) = అన్నం ఉడకగా మిగిలిన ఎసరు నీళ్ళ బయటకు వచ్చేలా వంచడం
గట్టు = ఒడ్డు
గంధోళి = పుప్పొడి
గమ్మత్తు = వేడుక, తమాషా
గర్జించు (క్రి.) = ఉరమడం, గట్టిగా అరవడం
గాటము = అధికం, ఎక్కువ
గాదె = ధాన్యం నిలవ ఉంచే కొట్టు
గిట్టకపోవు (క్రి.) = నచ్చకపోవడం
గిరులు = పర్వతాలు
గింజుకొను (క్రి.) = ఏడుస్తూ కాళ్లు విదిలించడం
గీతం = పాట
గుడి = దేవాలయం
గుబాళించు (క్రి.) = వాసన వెదజల్లుట
గృహాలంకరణ = ఇంటిని అందంగా అలంకరించుట
గృహిణి = ఇల్లాలు
గొణుగు (క్రి.) = పైకి వినబడకుండా పెదవులు కదుపుతూఅస్పష్టంగా మాట్లాడటం
గోమయం = ఆవుపేడ

### ఘ

ఘనుడు = గొప్పవాడు, మేఘుడు

### చ

చరచు (క్రి.) = పోగొట్టు, అరచేత్తో తట్టడం
చరిత = నడవడి
చిటి = చిన్న
చిత్రం = బొమ్మ
చిహ్నం = గుర్తు
చురుకుగా = వేగంగా
చెరసాల = జైలు
చెలికత్తె = స్నేహితురాలు
చెమ్మనేల = తడినేల
చేతబూని = చేతపట్టుకొని
చైతన్యం = ప్రాణం, తెలివి

### జ

జనని = తల్లి
జలకాలాడు (క్రి.) = స్నానంచేయు
జాగీరు = సొంత భూమి, రాజు బహుమానంగా ఇచ్చినది
జాగృతి = మేలుకొలుపు
జాలి = దయ
జీవరాశి = ప్రాణుల సమూహం

### త

తడవక = ప్రస్తావించక, వెదకక
తరగని = తగ్గని
తరగలు = అలలు
తలలో నాలుక = అణకువగా, వినయంగా
తలుచు (క్రి.) = జ్ఞాపకం చేసుకోవడం
తొంకు (క్రి.) = వెనుదీయడం, భయపడడం
తాపం = బాధ, సంతాపం, వేడి
తాళపత్రం = తాటేకు
తిరునాళ్ళు = దేవుని ఉత్సవాలు, జాతరలు
తిలకించు (క్రి.) = చూడటం
తివాచి = నేలమీద పరచుకొనే ఉన్ని ఆస్తరణం
తీరం = ఒడ్డు
తీవ = తీగ
తీవ్రతరం = ఇంకాఎక్కువ
తెగువ = సాహసం, తెగింపు
తేకువ = ధైర్యం, వివేకం
తేజస్సు = ప్రకాశం, వెలుగు
తొలిరోజులు = మొదటి రోజులు
త్యాగం చేయు (క్రి.) = వదులుకోవడం, విడిచిపెట్టడం

### ద

దండిగ = ఎక్కువగా
దర్శించు (క్రి.) = చూడటం
దాడి = దండెత్తడం, హఠాత్తుగా వచ్చిపడటం
దాత = ఇచ్చేవాడు, దానం చేసేవాడు
దీవన = మంచి జరగాలని కోరుకోవడం
దుక్కి దున్ని (క్రి.) = వ్యవసాయ భూమి దున్నడం
దుబ్బులు = గడ్డి గంటలు
దుర్గంధం = చెడు వాసన
దులుపు (క్రి.) = రాల్చడం, రాలగొట్టడం
దేశ వ్యాప్తంగా = దేశమంతటా

### ధ

ధరిత్రి = భూమి

### న

నందనారామం = ఇంద్రుని తోట
నడయాడు (క్రి.) = నడవడం, చరించడం, కదలడం
నవధాన్యాలు = తొమ్మిది ధాన్యాలు
నమ్రత = వినయం, అణకువ
నాజూకు = సున్నితమైన
నాదం = ధ్వని
నారచీర = జనుము వంటి నారతో నేసిన చీర
నాసికం = ముక్కు
నింగి = ఆకాశం

© SCERT not to be republished

నిదర్శనం = దృష్టాంతం
నిరంతరం = ఎల్లప్పుడూ
నిరాడంబరం = ఆడంబరంలేని, సాధారణంగా
నిర్లక్ష్యం = అశ్రద్ధ
నిరాశ = ఆశ కోల్పవడం
నిర్మించు (క్రి.) = కట్టడం
నిరీక్షించు (క్రి.) = ఎదురుచూస్తూ ఉండటం
నిరోధించు (క్రి.) = అడ్డగించడం, ఆపడం
నిర్దోషి = నేరం చేయనివాడు
నూతన = కొత్త
నెపం = సాకు
నెలవు = చోటు
నేత = నాయకుడు
నేర్పు = నైపుణ్యం, సామర్థ్యం

**ప**

పంతం = పోటీ, పౌరుషం, ప్రతిజ్ఞ
పర్వం = పండుగ
పరమానందం = అధిక సంతోషం
పరాయివాళ్ళు = ఇతరులు
పరికించు (క్రి.) = పరిశీలించి చూడటం
పరిశీలించు (క్రి.) = పట్టిపట్టి చూడటం
పరిశోధించు (క్రి.) = కొత్త విషయం తెల్సుకోవడం
పరిష్కరించు (క్రి.) = చక్కబెట్టడం, సరిచేయడం
పరువు = గౌరవం
పవిత్రం = పరిశుద్ధం, పావనం, స్వచ్ఛమైన
పశ్చాత్తాపం = చేసిన తప్పు తెలుసుకొని బాధపడటం
పిపీలిక = చీమ
పసిమనసులు = చిన్న పిల్లల మనస్సులు
పాటవం = గట్టితనం, దృఢత్వం
పానవట్టం = లింగపీఠం (శివలింగానికి ఆధారంగా ఉన్న శిల)
పారకు = పారిపోకు
పారిశుద్ధ్యం = పరిశుభ్రత
పీడ = బాధ
పురాతన = ప్రాచీనం, పాతది
పూదేనియ = మకరందం, పూలతేనె
పొగడ్త = మెచ్చుకోవడం, మెప్పు
పొడసూపు (క్రి.) = కనబడటం
పొరలి = పొంగి
పోరాటం = యుద్ధం
పోరు = యుద్ధం
పోషకాహారం = ఒంటికి బలాన్ని ఇచ్చే ఆహారం
ప్రకటన = వెల్లడి చేసినది
ప్రకృతి = సహజస్థితి, మనచుట్టూఉన్నవి
ప్రతిజ్ఞ = ఏదో ఒక పనిని తప్పక చేస్తానని దృఢంగా చెప్పడం
ప్రతిభ = వికసించే బుద్ధి, నైపుణ్యం
ప్రతిమ = బొమ్మ
ప్రతీక = గుర్తు
ప్రతీతి = ఎరుక, ప్రసిద్ధి
ప్రత్యక్షమవు (క్రి.) = కంటికి కనిపించడం
ప్రదర్శించు (క్రి.) = వివరించి చూపడం
ప్రధానం = ముఖ్యంగా
ప్రవహించు (క్రి.) = పారడం
ప్రశంసించు (క్రి.) = పొగడుట
ప్రసంగం = ఏదైనా ఒక విషయాన్ని గురించి వివరంగా చెప్పడం
ప్రస్తావన = చెప్పడం, అవసరం
ప్రసిద్ధమైన = పేరు పొందిన
ప్రాతఃకాలం = ఉదయం
ప్రాయం = వయస్సు
ప్రాశస్త్యం = ప్రసిద్ధి, మంచిపేరు
ప్రియం = ఇష్టమయినది, వెలఎక్కువఉన్నది

**బ**

బంతి = పంక్తి, వరస
బహుమతి = కానుక
బాకు = కత్తి
బాటసారి = దారివెంట నడిచేవాడు
బిలం = రంధ్రం
బింకం = గర్వం
బెంగ = మనసులో దిగులు, బాధ, వెలితి
బోలెడు = చాలా

**భ**

భక్షించు (క్రి.) = తినడం
భటుడు = పనివాడు, సేవకుడు
భ్రమరం = తుమ్మెద
భరించు (క్రి.) = మోయడం
భరిణ = కుంకుమ వంటివి పోసుకొనే చిన్న (మూత ఉన్న) డబ్బా, పాత్ర
భవిష్యత్తు = కాగలది, జరగబోయే లేదా రాబోయే కాలం
భూతదయ = ప్రాణుల మీద సానుభూతి, జాలి

**మ**

మందహాసం = చిరునవ్వు
మగువ = స్త్రీ
మ్రందిన = చనిపోయిన
మన్నన = గౌరవం (చేయడం)
మమత = నాదని అనుకోవడం, ఇష్టం
మహానుభావులు = గొప్పవారు
మాటకారి = ఉపాయంగా ఎక్కువగా మాట్లాడేవాడు
మారుమూల = దూరంగా ఉండే ప్రదేశం
మారు = ప్రతి, నకలు
మిడుకు (క్రి.) = పరితపించటం, అసూయపడటం
మితభాషి = తక్కువగా మాట్లాడేవాడు
మిన్న = ఎక్కువ
మిన్ను = ఆకాశం
మీరు (క్రి.) = దాటడం
ముఖద్వారం = ఇంటిలోని మొట్టమొదటి వాకిలి
ముదము = ఆనందము, సంతోషం
ముద్రణ = అచ్చువేయడం, అచ్చు (పని)
ముమ్మారు = మూడుసార్లు
మువ్వన్నెలు = మూడు రంగులు
మూడు (క్రి.) = ముగియడం, చెడు జరగడం, కలగడం
మూర్ఖత్వము = తెలివిలేని తనం
మృతవీరులు = వీర మరణం పొందిన వారు
మేదిని = భూమి
మేధావులు = తెలివిగలవారు,బుద్ధిమంతులు

©SCERT not to be republished

మోతుబరి = గొప్ప సంపద, పేరు, పలుకుబడి కలవారు
మోదం = సంతోషం

**య**

యజ్ఞం = యాగం,దేవతలను తృప్తిపరిచే అర్చన
యథావిధిగా = ఎప్పటి లాగే
యాత్ర = పుణ్యక్షేత్రాలను సేవించబోవడం, ప్రయాణం

**ర**

రంగవల్లి = ముగ్గు
రణం = యుద్ధం
రమణీయత = అందం
రాజధాని = ముఖ్యపట్టణం
రాలు (క్రి.) = రాలిపోవడం, కిందపడడం
రీతి = విధం, రకం, పద్ధతి

**ల**

లభ్యమవు (క్రి.) = దొరకడం
లాలిమ = లాలిత్యం, మెత్తదనం
లాల్‌ఖిల్లా = ఎర్రకోట
లౌక్యం = వ్యవహారంతెలిసినవాడు,గడసరితనం

**వ**

వదనం = ముఖం
వాతము = గాలి
వాస్తవం = నిజం
విందు = ఆతిథ్యం, ప్రత్యేక సందర్భంగా పెట్టే భోజనం
వికాసం = వికసించడం, తెలివి పొందడం
విజ్ఞప్తి = విన్నపం, మనవి
విజ్ఞానం = శాస్త్రముల యందలి జ్ఞానం
వినమ్రం = వినయంతో కూడిన, అణకువగల
వినియోగం = ఉపయోగం
విపరీతంగా = అధికంగా, చాలా ఎక్కువగా
విరాజిల్లు (క్రి.) = ప్రకాశించు, మెరియు
విశ్వం = ప్రపంచం; బ్రహ్మాండంలో ఉన్న అన్ని గ్రహాలు
విభవము = సంపద, ఐశ్వర్యము
విశ్రమించు (క్రి.) = విశ్రాంతి తీసుకోవడం
విస్తరించు (క్రి.) = వ్యాపించేటట్లు చేయడం, వ్యాపించడం
వీనులు = చెవులు
వెచ్చించు (క్రి.) = ఖర్చుచేయడం, వినియోగించడం
వేడుక = పండుగ, వినోదకార్యం

**శ**

శకునం = శుభసూచన, నిమిత్తం
శాస్తి = శిక్ష
శిల = రాయి
శిల్పం = బొమ్మ వంటివి చెక్కిన రాయి
శీతల వాయువు = చలిగాలి
శోభ = కాంతి
శౌన్యం = డేగ
శౌర్యం = పరాక్రమం, శూరుడి గుణం
శ్రద్ధ = ఆసక్తి, గౌరవం
శ్లేష్మం = తెమడ, కఫం

**ష**

షష్టిపూర్తి = 60 సంవత్సరాలు పూర్తయినపుడు జరిపే వేడుక
షోకు చేసుకొను (క్రి.)= అందంగా తయారవడం

**స**

సంకేతం = గుర్తు
సంగమం = కలయిక
సంత = అమ్మకందారు పెట్టుకొనే అంగళ్ళ వరస (కనీసం వారానికి ఒకరోజుచొప్పున)
సంతసం = ఆనందం, సంతోషం
సంతుష్టి = తృప్తి, సంతోషం
సత్తువ = శక్తి
సందేశం = సమాచారం, కబురు
సందేహం = అనుమానం, శంక
సంరంభం = వేగిరపాటు, హడావుడి
సవిత్రి = తల్లి, మాత
సంస్కృతి = నాగరికత, సంస్కారం (మానసికం కాని, భౌతికం కాని)
సజ్జనులు = మంచివారు
సద్గోష్ఠి = మంచి సభ, మంచి సంఘం
సన్నెకల్లు = నూరే రాయి
సభాసదులు = సభలోనివారు
సమంజసం = న్యాయంతో కూడినది
సమగ్రత = సమస్తం, అంతా
సమత = సమానత్వం
సమాచారం = వార్త, వృత్తాంతం
సమావేశం = ఒక చోట కలుసుకోవడం
సముదాయించుకొను(క్రి.)= ఓదార్చుకొని
సమృద్ధి = ఎక్కువగా ఉండటం (సంపదమొ॥వి)
సర్వజనావళి = ప్రజలందరూ
సర్వరోగాలు = అన్ని రోగాలూ
సహకరించు (క్రి.) = తోడ్పడటం, సహాయపడటం
సహవాసం = కలిసి జీవించడం, కలిసి ఉండడం
సాధువు = సజ్జనుడు, మంచివాడు
సామర్థ్యం = నేర్పు, యోగ్యత, సమర్థత
సారం = బలం, చేవ
సింగం = సింహం
సిరి = సంపద
సువాసన = మంచివాసన
సూచిక = తెలియజేసేది
సేద = బడలిక, శ్రమ
సోకోర్చువాడు = బాధను ఓర్చుకొనేవాడు
సోయగం = అందం
సౌరభం = మంచి వాసన
సౌరులు = అందాలు
స్తుతి = పొగడడం, పొగడ్త
స్ఫూర్తి = స్ఫురించడం, ప్రభావం చూపడం

**హ**

హక్కు = ఒక సౌకర్యాన్ని అనుభవించే అవకాశం, విలువ
హాని = నష్టం, కీడు
హిమాద్రి = హిమాలయ పర్వతాలు
హొయలు = విలాసం, అందం, సొగసు కనబరుచుకొనే ఒయ్యారం

© SCERT not to be republished